శనివారం
18-06-2022
విజయవాడ ప్రచురణ
సంపుటి : 70, సంచిక : 355
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952

విశాలాంధ్ర

VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

శ్రీలంకలో వారానికి నాలుగు పనిదినాలు

ఆర్థిక సంక్షోభంతో కొట్టుమిట్టాడుతున్న శ్రీలంక ప్రభుత్వ ఉద్యోగులకు వారానికి నాలుగు రోజులు పనిచేసేందుకు అనుమతించింది. తాజాగా ఇంధన కొరత వేధిస్తుండటంతో ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. 2లో

నిప్పులు చిమ్మిన నిరసన గళం

పోలీసు కాల్పుల్లో మరణించిన రాకేశ్

'అగ్నిపథ్'పై దేశవ్యాప్తంగా వ్యతిరేకత

- 12 రైళ్లకు నిప్పు... రహదారులు దిగ్బంధం
- సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో రగిలిన ఆగ్రహ జ్వాల
- పట్టాలపై బైఠాయించిన యువత
- పోలీసు తూటాలకు తెలంగాణ యువకుడి బలి
- ఉత్తరాది నుంచి దక్షిణాదికి పాకిన నిరసనలు
- పథకాన్ని వెంటనే రద్దు చేయాలని నిరుద్యోగుల డిమాండు

న్యూదిల్లీ/సికింద్రాబాద్: కేంద్రంలోని మోదీ ప్రభుత్వం రేపిన మంటల్లో దేశం కాలిపోతోంది. బీజేపీ పాలకుల అస్తవ్యస్త ఆర్థిక, పాలనా విధానాలపై ప్రజల్లో ఆగ్రహ జ్వాలలు ప్రజర్విల్లుతున్నాయి. ఒకపక్క మతం, కులం పేరుతో విద్వేష, వినాశకర కాషాయ కుట్రలను కొనసాగిస్తూనే, మరోవైపు, ఆర్థిక, సామాజిక సంక్షోభాన్ని సృష్టించి యువతను, ప్రజలను నట్టేట ముంచేసే చర్యలకు పాలక బీజేపీ ఒడిగడుతోంది. ఇందుకు సైన్యంలో నియామకాల కోసం కేంద్రం తీసుకువచ్చిన 'అగ్నిపథ్' పథకం మరొక ఉదాహరణ అని వామపక్ష పార్టీలు, ఇతర విపక్ష పార్టీలు, విశ్లేషకులు, మేధావులు పేర్కొంటున్నారు. సైన్యంలో నూతన నియామక విధానం 'అగ్నిపథ్' పథకంపై దేశవ్యాప్తంగా నిరసనలు కొనసాగుతున్నాయి. ఉత్తరాది నుంచి దక్షిణాది

వరకు యువత పెద్ద సంఖ్యలో ఆందోళనలకు దిగారు. బీహార్, ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాల్, అసోం, ఒడిశా, తెలంగాణ, హరియాణా, మధ్యప్రదేశ్‌కు నిరసనలు వ్యాపించాయి. అగ్నిపథ్‌ను వ్యతిరేకిస్తూ నిరసనకారులు అనేక రాష్ట్రాల్లో రైళ్లకు నిప్పు పెట్టి పోలీసులతో ఘర్షణకు దిగారు. కనీసం 12 రైళ్లను తగలబెట్టారు. సికింద్రాబాద్‌లో పోలీసు కాల్పుల్లో ఒకరు చనిపోయారు. అగ్నిపథ్‌కి వ్యతిరేకంగా శుక్రవారం మూడవ రోజు రైళ్లను తగులబెట్టడం, ప్రజా ఆస్తులను ధ్వంసం చేయడం, వేల మంది యువకులు రైలు పట్టాలు, రహదారులపై బైఠాయించడంతో అనేక రాష్ట్రాల్లో నిరసనలు హింసాత్మకంగా మారాయి. అయితే కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ఈ పథకాన్ని సమర్థించింది. దీనిని 'పరివర్తన'గా పేర్కొంది. తెలంగాణలోని సికింద్రాబాద్‌లో రైల్వే స్టేషన్‌లో వేలాది మంది యువకులు నిరసనకు దిగారు. రైలు పట్టాలపై బైఠాయించి అగ్నిపథ్‌ని వెంటనే ఉపసంహరించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండు చేశారు. ఈ సందర్భంగా పోలీసులు వారిపై లాఠీలు ఝుళిపించడంతో - మిగతా 2 లో

'అగ్నిపథ్' రద్దుకు పోరు

ఏఐవైఎఫ్ అధ్యక్షుడు తిరుమలై రామన్ హైదరాబాద్‌లో మోకాళ్లపై నడుస్తూ నిరసన 2లో

జేసీ ఇంట్లో ఈడీ సోదాలు

టీడీపీ నాయకులు, జేసీ బ్రదర్స్ ప్రభాకరరెడ్డి, దివాకర్‌రెడ్డి ఇళ్లలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ శుక్రవారం సోదాలు చేపట్టింది. తాడిపత్రిలోని జేసీ బ్రదర్స్ అనుచరుడు, కాంట్రాక్టర్ చవ్వా గోపాల్ రెడ్డి ఇంట్లోనూ సోదాలు నిర్వహిస్తున్నారు. దీంతో జేసీ ఇంటికి సమీపంలో పోలీస్ చెక్‌పోస్టు ఏర్పాటు చేశారు. 3 లో

ఏపీలో రైల్వేస్టేషన్లకు భారీ భద్రత

విశాలాంధ్ర బ్యూరో– అమరావతి : కేంద్ర ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన అగ్నిపథ్ పథకంపై దేశవ్యాప్తంగా యువత నుంచి తీవ్రస్థాయిలో నిరసనలు వ్యక్తమవుతుండడంతో శుక్రవారం ఏపీ పోలీస్ శాఖ అప్రమత్తమైంది. రాష్ట్రవ్యాప్తంగా అన్ని రైల్వే స్టేషన్లలో పోలీస్ భద్రత పెంచారు. రైల్వే పరిధిలోని ఆర్పీఎఫ్, జీఆర్పీ నుంచి అదనపు బలగాలను రప్పించారు. రాష్ట్రంలో అతి పెద్ద రైల్వే జంక్షన్ అయిన విజయవాడలో ముందు జాగ్రత్త చర్యగా భారీస్థాయిలో పోలీస్ బలగాలను మోహరించారు. అలాగే విశాఖపట్నం, తిరుపతి, కడప, గుంటూరు, ఒంగోలు, నెల్లూరు, రేణిగుంటతో సహా చిన్న రైల్వే స్టేషన్లలోనూ భద్రత కట్టుదిట్టం చేశారు. రైల్వే స్టేషన్ పరిసరాల్లో ఎవరూ గుమిగూడకుండా చర్యలు చేపట్టారు. ప్రవేశ ద్వారాల వద్ద తనిఖీలు నిర్వహిస్తూ జాగ్రత్త చర్యలు తీసుకున్నారు. అలాగే ముఖ్యపట్టణాల్లోని కూడళ్లలోనూ పోలీసులు మోహరించారు. విశాఖ, గుంటూరు రైల్వేస్టేషన్లలో విధ్వంసం జరిగే అవకాశం ఉందని నిఘా వర్గాల హెచ్చరికతో ఆ రెండు స్టేషన్లలో పోలీసులు మరింత అప్రమత్తమయ్యారు. పోలీసు ఉన్నతాధికారులు పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా భద్రతా చర్యలు చేపట్టారు.

8వేల ఖాళీల భర్తీకి సిద్ధం

- ఉన్నత విద్యలో ఖాళీల భర్తీపైనా దృష్టి
- పోలీసు నియామకాలపై కార్యాచరణ
- సమీక్షలో సీఎం జగన్ ఆదేశం

విశాలాంధ్ర బ్యూరో–అమరావతి: జాబ్ క్యాలెండర్‌లో మిగిలిన ఎనిమిదివేల పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఉన్నతాధికారులను ఆదేశించారు. తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో ఏడాది కాలంగా జరిగిన నియామకాలు, ఇంకా భర్తీ చేయాల్సిన ఖాళీలపై అధికారులతో ముఖ్యమంత్రి శుక్రవారం సమగ్రంగా సమీక్షించారు. జాబ్ క్యాలెండర్‌లో - మిగతా 2 లో

ఏడాదైనా ఉద్యోగాలేవీ ? జగన్ సర్కారు నిర్లక్ష్యం 2లో

జగన్‌కు ఉచ్చు?

రాష్ట్రపతి ఎన్నికల్లో బీజేపీ వైపే అడుగులు?

- ఇంటా, బయటా వ్యతిరేకత... కేడరులో అలజడి
- పోటాపోటీ మద్దతుకు వైసీపీ, టీడీపీ సిద్ధం

విశాలాంధ్ర బ్యూరో–అమరావతి: రాష్ట్రపతి ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థికి మద్దతుగా వైసీపీ అడుగులు వేయడంపై ఇంటా, బయటా వ్యతిరేకత నెలకొంది. దేశవ్యాప్తంగా ప్రతిపక్ష పార్టీలన్నీ మోదీకి వ్యతిరేకంగా ఉండగా, వైసీపీ మాత్రం బీజేపీకే మద్దతు దిశగా మరోసారి అడుగులు వేయడం విమర్శలకు దారితీస్తోంది. జగన్ వైఖరిని ప్రతిపక్ష పార్టీలతోపాటు వైసీపీ నేతలు, శ్రేణులు తప్పుబడుతున్నారు. దీంతో జగన్‌కు చాప కింద నీరులా ఉచ్చు బిగుస్తోంది. ప్రతిపక్ష పార్టీలతోపాటు సొంత పార్టీ నేతలు, ప్రజాప్రతినిధులు సైతం జగన్‌ను వైఖరిపై అసంతృప్తితో ఉన్నారు. దేశవ్యాప్తంగా రాష్ట్రపతి ఎన్నికలపై చర్చ కొనసాగుతోంది. బీజేపీకి వ్యతిరేకంగా రాష్ట్రపతి అభ్యర్థిని నిలిపేందుకు ఇటీవల నుంచి ప్రతిపక్ష పార్టీలు ప్రయత్నిస్తున్నాయి. కేంద్రంలోని మోదీ నాయకత్వంలోని బీజేపీ ప్రభుత్వంతో లౌకికవాదానికి ప్రమాదం పొంచి ఉంది. ఢిల్లీ కేంద్రంగా మమత అధ్వర్యంలో ఏర్పాటు చేసిన 17 ప్రతిపక్ష పార్టీల కూటమి భేటీ నిర్వహించి, ఒకరిద్దరు రాష్ట్రపతి అభ్యర్థి పేర్లను తెరపైకి తెచ్చాయి. బీజేపీ అభ్యర్థికి వ్యతిరేకంగా పోటీకి దిగాలని నిర్ణయించాయి. అతి కీలకమైన సమావేశానికి వైసీపీ అధినేత, సీఎం జగన్‌కు ఆహ్వానం అందినప్పటికీ హాజరు కాకపోవడంపై ప్రతిపక్షాలు తప్పుబతున్నాయి. రాష్ట్రపతి ఎన్నికలపై వైసీపీ వైఖరేమిటనేది వెల్లడించాలంటూ డిమాండ్ చేస్తున్నాయి. ఏపీలో లౌకికవాద పార్టీలుగా ఉన్న వైసీపీ, టీడీపీలు సైతం బీజేపీకి పోటీపడి మద్దతిచ్చేందుకు సిద్ధమవ్వడాన్ని ప్రతిపక్ష పార్టీలు తప్పుబడుతున్నాయి. ఇటీవల మోదీని జగన్ కలిసి లోపాయికారి ఒప్పందం చేసుకున్నారనే ప్రచారముంది. ఇప్పటివరకూ రాష్ట్రపతి ఎన్నికల్లో వైసీపీ వైఖరేమిటనేది ఆ పార్టీ అధిష్టానం స్పష్టం చేయలేదు. జగన్‌ను ప్రజలు నమ్మి గెలిపిస్తే, వాటిని ఆయన స్వార్థ ప్రయోజనాల కోసం వినియోగిస్తున్నారనే విమర్శలున్నాయి. వైసీపీ ఓటు బ్యాంక్‌గా ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలు ప్రధానంగా ఉన్నారు. గత ఎన్నికల్లో ఆయా వర్గాలు వైసీపీ గెలుపునకు ప్రధాన భూమిక పోషించాయి. వారిని విస్మరించేలా మోదీ ప్రభుత్వం మతతత్వ, రాజ్యాంగ - మిగతా 2 లో

ఒక అభ్యర్థి.. ఒకటే స్థానం

కేంద్రానికి ఎన్నికల కమిషన్ ప్రతిపాదన

న్యూదిల్లీ : ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు ఒక స్థానానికే పరిమితం కావాలని ఎన్నికల కమిషన్ పేర్కొంది. దాదాపు రెండు దశాబ్దాల కిందటి ప్రతిపాదనను తిరిగి తెరపైకి తెచ్చింది. అభ్యర్థులను ఒక స్థానం నుంచి పోటీకి పరిమితం చేయాలని, అలా కుదరకపోతే నియోజకవర్గాల్లో ఉపఎన్నికలకు కారణమైన వారికి (గెలిచి ఆ స్థానాన్ని ఖాళీ చేస్తే) భారీ జరిమానా విధించాలని ప్రతిపాదించింది. తొలుత 2004లో చేసిన ఈ ప్రతిపాదనను ప్రధాన ఎన్నికల కమిషన్ రాజీవ్ కుమార్ ఇటీవల న్యాయశాఖలోని శాసన (లెజిస్లేటివ్) కార్యదర్శితో భేటీ సమయంలో ప్రస్తావించారు. ప్రస్తుత చట్టాల ప్రకారం ఒక అభ్యర్థి సార్వత్రిక ఎన్నికల్లో రెండు వేర్వేరు నియోజకవర్గాల నుంచి పోటీ చేయొచ్చు. ఎక్కువ స్థానాల్లో ఎన్నికైతేగనుక గెలిచిన స్థానం లో ఒకదానికే పరిమితం కావాలి. అయితే, రెండు స్థానాలకు మించి పోటీ చేసే అవకాశం ఉండకుండా 1996లో ప్రజాప్రాతినిధ్య చట్టం సవరణ జరిగింది. ఈ చట్టంలోని అనేక సెక్షన్లలో - మిగతా 2 లో

ఇదీ లోకం!

'స్విస్'లో దూసుకెళ్లిన భారతీయుల సొమ్ము

- ఒక్క ఏడాదిలోనే 50 శాతం పెరుగుదల
- రూ.30 వేల కోట్లతో 14 ఏళ్లలో గరిష్ఠ స్థాయికి...
- స్విస్ సెంట్రల్ బ్యాంక్ గణాంకాలు వెల్లడి

న్యూదిల్లీ/జ్యూరిచ్ : స్విస్ బ్యాంకుల్లో భారతీయుల పెట్టుబడులు, డిపాజిట్లు ఒక్క ఏడాదిలోనే గణనీయంగా పెరిగాయి. భారతదేశంలోని శాఖలు, ఇతర ఆర్థిక సంస్థలతో సహా స్విస్ బ్యాంకుల్లో భారతీయ వ్యక్తులు, సంస్థల నిధులు 2021లో 14

సంవత్సరాల గరిష్ఠ స్థాయి 3.83 బిలియన్ స్విస్ ఫ్రాంక్‌లకు (రూ.30,500 కోట్లకు) పెరిగింది. సెక్యూరిటీలు, వాటికి సమాంతర సాధనాల మూలంగా , ఖాతాదారుల డిపాజిట్ల మూలంగా సంపదలో పెరుగుదల నమోదయిందని స్విట్జర్లాండ్ సెంట్రల్ బ్యాంక్ వార్షిక డేటా వివరించింది. స్విస్ బ్యాంకుల్లో 2020లో భారతీయుల నిధుల మొత్తం రూ.20,700 కోట్లుగా నమోదైంది. ఏడాది - మిగతా 2 లో

అమెరికాకు అసాంజే అప్పగింత..!

బ్రిటన్ : వికీలీక్స్ వ్యవస్థాపకుడు జూలియన్ అసాంజేను అమెరికాకు అప్పగించడానికి బ్రిటన్ ఆమోదించిందని బ్రిటీష్ అంతర్గత మంత్రి ప్రీతి పటేల్ శుక్రవారం తెలిపారు. అమెరికాలో ఉన్న సమయంలోనూ సరైన రీతిలోనే ట్రీట్మెంట్ ఇవ్వనున్నట్లు అప్పగింత ఒప్పందంలో తెలిపారు. అసాంజే ఆఫ్గానిస్తాన్, ఇరాక్‌లలో జరిగిన సంఘర్షణలలో అమెరికా చేపట్టిన తప్పులను బహిర్గతం చేయడంతో ఆయన వాంటెడ్‌లిస్టులో ఉన్నారు. ఇది అసాంజే ప్రాసిక్యూషన్ జర్నలిజం, వాక్ స్వేచ్ఛపై రాజకీయ దాడిగా ఆయన మద్దతుదారులు పేర్కొన్నారు. అమెరికాకు అప్పగింత అంశంపై అసాంజే భార్య స్టెల్లా మాట్లాడుతూ.. తన భర్త ఎటువంటి తప్పు చేయలేదని, ఆయన ఎటువంటి నేరానికి పాల్పడలేదన్నారు. "జూన్ 17న, మేజిస్ట్రేట్ కోర్ట్, హై కోర్ట్ రెండింటి పరిశీలన తరువాత, జూలియన్ అసాంజేని అమెరికాకు అప్పగించాలని ఆదేశించడమైంది. దీనికి వ్యతిరేకంగా అప్పీల్ చేయడానికి అసాంజేకు 14-రోజుల వ్యవధి ఉంటుంది. అయితే అసాంజే లండన్ హైకోర్టులో అప్పీల్ చేసుకోనున్నట్లు సమాచారం. చివరికి అసాంజే తన కేసును బ్రిటన్ సుప్రీంకోర్టుకే అప్పగించే అవకాశం ఉంది. అయితే ఈ అప్పీల్ తిరస్కరించినట్లయితే 28 రోజుల్లోగా అస్సాంజేని అప్పగించవలసి ఉంది.

శ్రీలంకలో వారానికి నాలుగు పనిదినాలు

కొలంబో : ఆర్థిక సంక్షోభంతో కొట్టుమిట్టాడుతున్న శ్రీలంక ప్రభుత్వ ఉద్యోగులకు వారానికి నాలుగు రోజులు పనిచేసేందుకు అనుమతించింది. తాజాగా ఇంధన కొరత వేధిస్తుండటంతో ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఆర్థిక సంక్షోభం చుట్టుముట్టడంతో ఇంధనం, ఆహారం, మందుల దిగుమతికి అవసరమైన విదేశీ మారకద్రవ్య నిల్వల కొరత శ్రీలంకను అల్లాడుతోంది. లక్షలాది మంది దేశవ్యాప్తంగా పెట్రోల్ పంపుల వద్ద గంటల తరబడి వేచిచూసే పరిస్థితి నెలకొంది. నెలల తరబడి విద్యుత్ కోతలు శ్రీ లంకను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. దీనితో ప్రభుత్వ ఉద్యోగులకు మూడు నెలల పాటు ప్రతి శుక్రవారం సెలవు దినంగా ప్రకటించేందుకు శ్రీలంక క్యాబినెట్ ఆమోదించింది. ఇంధన కొరతతో కార్యాలయాల రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతుండటంతో ఈ నిర్ణయం తీసుకుంది. మరోవైపు సెలవు దినాల్లో వ్యవసాయ ఉత్పత్తుల సాగుకు వారిని ప్రోత్సహిస్తోంది. ఆహార కొరతను అధిగమించేందుకు ఉద్యోగులను వారానికి మూడు సెలవు దినాల్లో తమ ఇండ్లలో కూరగాయలు, పండ్లు సాగుచేసేందుకు ప్రోత్సహించాలని నిర్ణయించింది.

ఆచరణాత్మక మద్దతుకు నాటో సంకల్పం

బ్రస్సెల్స్ : తూర్పు ప్రాంతంలో యుద్ధ బలగాలను బలోపేతం చేయాలని ఉత్తర అట్లాంటిక్ ట్రీటీ ఆర్గనైజేషన్ (నాటో) సంకల్పించింది. జూన్ 29-30 తేదీలలో స్పెయిన్‌లోని మాడ్రిడ్‌లో జరగనున్న నాటో శిఖరాగ్ర సమావేశానికి రెండు రోజుల సన్నాహకాల ముగింపులో జరిగిన విలేకరుల సమావేశంలో నాటో సెక్రటరీ జనరల్ జెన్స్ స్టోల్టెన్‌బర్గ్ ప్రసంగించారు. నాటో భవిష్యత్తు కార్యాచరణపై చర్చలు జరిపారు. ఆచరణాత్మక మద్దతును ఎలా పెంపొందించుకోవాలో సూచించారు. నాటో ఉనికి, సామర్థ్యాలు, సంసిద్ధతను గణనీయంగా బలోపేతం చేయాలని పేర్కొన్నారు. సైబర్ రక్షణలు, అలాగే ముందుగా అమర్చిన పరికరాలు, ఆయుధ నిల్వలు. ఆధునిక సంసిద్ధతతో మిత్రదేశాల రక్షణకు బలగాలు ఏర్పాటుకు సూచనలు చేశారు. నాటో కూటమి వరుసగా ఏడు సంవత్సరాలుగా యూరోపియన్ మిత్రదేశాలు, కెనడాలలో రక్షణ పెట్టుబడులకు, మిత్రరాజ్యాలు నాటో విస్తరణలకు దోహదపడుతున్నాయని స్టోలెన్‌బర్గ్ పేర్కొన్నారు. బయటి జోక్యం లేకుండా అన్ని దేశాలకు వారి స్వంత మార్గాన్ని ఎంచుకునే హక్కు ఉందని స్పష్టం చేసారు. మిత్రరాజ్యాల దేశాధినేతలు ఉక్రెయిన్ రక్షణ మంత్రితో సమావేశమయ్యారు. ఉక్రెయిన్‌కు మద్దతును అందించడం నాటోకు కీలకమని చెప్పారు. మాడ్రిడ్‌లో జరిగే నాటో సమావేశాలకు ఉక్రెయిన్ అధ్యక్షుడు వోలోడిమిర్ జెలెన్స్కి పాల్గొంటారు.

14వ బ్రిక్స్ సదస్సుకు చైనా ఆతిథ్యం

బీజింగ్ : 14వ బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశానికి చైనా ఆతిథ్యం ఇవ్వనున్నట్లు ఆ దేశ విదేశాంగ మంత్రిత్వ శాఖ శుక్రవారం వెల్లడించింది. వర్చువల్‌ఫార్మాట్‌లో ఈ సమావేశం జరుగుతుంది. అధ్యక్షుడు జి జిన్‌పింగ్ జూన్ 24న బీజింగ్‌లో గ్లోబల్ డెవలప్‌మెంట్‌పై ప్రసంగించనున్నారు. స్థిరమైన అభివృద్ధికోసం 2030 ఎజెండాను సంయుక్తంగా అమలు చేయడానికి కొత్త యుగానికి ప్రపంచ అభివృద్ధి భాగస్వామ్యాన్ని ప్రోత్సహించండి అనే థీమ్‌తో ఈ సమావేశం జరుగనుంది. అభివృద్ధి చెందుతున్న మార్కెట్లు, అభివృద్ధి చెందుతున్న దేశాల నాయకులు ఈ కార్యక్రమానికి హాజరవుతారని హువా తెలిపారు. బ్రిక్స్ అనేది ప్రపంచంలోని ఐదు ప్రధాన వర్ధమాన ఆర్థిక వ్యవస్థలు, అవి బ్రెజిల్, రష్యా, భారతదేశం, చైనా, దక్షిణాఫ్రికాలతో కూడిన బహుపాక్షిక ఫోరమ్.

ఒక అభ్యర్థి.. ఒకటే స్థానం

(మొదటిపేజీ తరువాయి)

సవరణలను ఎన్నికల సంఘం 2004లో సూచించింది. అభ్యర్థి ఒక నియోజకవర్గంలోనే పోటీ చేయాలని పేర్కొంది. నిబంధనలను అలాగే ఉంచితే రెండు స్థానాల నుంచి పోటీ చేసే అభ్యర్థి .. గెలిచి వద్దనుకున్న స్థానానికి జరిపే ఉపఎన్నికలకయ్యే ఖర్చును భరించాలని ఓ అధికారి వెల్లడించారు. రాష్ట్ర అసెంబ్లీ, శాసనమండలి ఎన్నికల కోసం అభ్యర్థికి విధించే జరిమానా మొత్తాన్ని రూ.5లక్షలుగా, లోక్‌సభ ఎన్నికలైతే రూ.10లక్షలుగా అప్పట్లో ప్రతిపాదించారు. ఈ మొత్తాన్ని సవరించాలని ఎన్నికల సంఘం భావిస్తోంది. అభ్యర్థి రెండు స్థానాల్లో పోటీ చేసి రెండింటిని గెలుచుకుంటే కచ్చితంగా ఒకదానిని వదిలేయాల్సి ఉంటుంది. తద్వారా ఉప ఎన్నికల నిర్వహణ అనివార్యం అవుతుంది. అప్పుడు ప్రభుత్వ ఖజానాపై ఆర్థిక భారం పడటమే కాకుండా సిబ్బంది, ఇతర వనరులూ అనవసరం ఖర్చు అవుతాయి. అభ్యర్థి వద్దనుకున్న నియోజకవర్గ ఓటర్లకు అన్యాయం జరుగుతుంది అని ఎన్నికల సంఘం పేర్కొంది. కాగా, అభ్యర్థులను ఒక స్థానం నుంచి పోటీకి పరిమితం చేయాలన్న ప్రతిపాదనకు న్యాయ కమిషన్ అనుకూలంగా ఉన్నప్పటికీ గెలిచిన అభ్యర్థి తాను ఖాళీ చేసే స్థానంలో జరిగే ఉప ఎన్నిక ఖర్చును జరిమానా రూపేణ జమ చేయడాన్ని సమర్థించలేదు.

8వేల ఖాళీల భర్తీకి సిద్ధం

(మొదటిపేజీ తరువాయి)

భాగంగా నియామకాలు జరిగిన పోస్టుల వివరాలను సీఎం జగన్‌కు అధికారులు విశదీకరించారు. మిగిలిన ఖాళీలు, ఏపీపీఎస్సీ, వైద్య, ఆరోగ్య-కుటుంబ సంక్షేమశాఖ, ఉన్నత విద్య తదితర శాఖల్లో జరిగిన, జరుగుతున్న నియామకాల వివరాలను తెలియజేశారు. 2021-22లో ఇప్పటివరకు 39,654 ఖాళీలను భర్తీచేశామని, వీటిలో ఒక్క వైద్య ఆరోగ్యశాఖలోనే 39,310 ఖాళీలు భర్తీ చేసినట్లు తెలిపారు. వైద్య ఆరోగ్యశాఖలో గుర్తించిన 47,465 ఖాళీల్లో 83.5 శాతం ఖాళీల భర్తీ ఈ ఒక్క ఏడాదిలో పూర్తి చేశామని, మిగిలిన 16.5శాతం ఖాళీలను, ఇంకా భర్తీచేయాల్సి ఉందని వివరించారు. భర్తీచేయాల్సిన ఖాళీల్లో 1198 ఖాళీలు వైద్య ఆరోగ్యశాఖలోనే ఉన్నాయని చెప్పారు. దీనిపై సీఎం స్పందిస్తూ తక్షణమే జాబ్ క్యాలెండర్‌లో మిగిలిన 8వేల ఖాళీల భర్తీకి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామ, వార్డు సచివాలయాల్లో రికార్డుస్థాయిలో 1.26లక్షలమందికి శాశ్వత ఉద్యోగాలు ఇచ్చామని, ఇవిగాక ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడంద్వారా మరో 50వేల మందిని ప్రభుత్వంలోకి తీసుకున్నామన్నారు. జాబ్ క్యాలెండర్‌లో నిర్దేశించుకున్న ఖాళీల్లో ఇంకా భర్తీ కాకుండా మిగిలిన ఖాళీల రిక్రూట్‌మెంట్‌పై కార్యాచరణ రూపొందించుకోవాలని అధికారులకు సూచించారు. అలాగే వైద్య ఆరోగ్యశాఖలో మిగిలిన ఖాళీలను ఈ నెలాఖరులోగా, ఉన్నత విద్యాశాఖలో అసిసోయేట్ ప్రొఫెసర్ ఖాళీలను సెప్టెంబరులోగా, ఏపీపీఎస్సీలో ఖాళీలను మార్చిలోగా భర్తీచేయాలని సీఎం ఆదేశించారు. విద్యా, వైద్యంపై భారీస్థాయిలో డబ్బు వెచ్చించి ఆస్పత్రులు, విద్యాలయాలు కడుతున్నామని, అందువల్ల వాటిల్లో ఖాళీలు భర్తీచేయకపోవడం సరికాదన్నారు. ఉన్నతవిద్యలో బోధన ఖాళీల భర్తీలో పారదర్శకత, సమర్థతకు పెద్ద పీటవేసేలా నిర్ణయాలు ఉండాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. సాధారణ, ఒప్పంద ఖాళీలు పారదర్శకంగా నియమకాలు జరగాలని, దీనికోసం ప్రతిపాదనలు వెంటనే తయారు చేయాలని, వీటితో పాటు పోలీసు ఉద్యోగాల భర్తీపైనా కార్యాచరణ రూపొందించుకోవాలని అధికారులను సీఎం ఆదేశించారు. ఈ సమీక్షా సమావేశానికి డీజీపీ కే వీ రాజేంద్రనాథ్‌రెడ్డి, ఆర్థికశాఖ స్పెషల్ సీఎస్ ఎస్ ఎస్ రావత్, మహిళా శిశు సంక్షేమశాఖ ముఖ్య కార్యదర్శి ఏఆర్ అనురాధ, జలవనరులశాఖ ముఖ్యకార్యదర్శి శశిభూషణ్ కుమార్, వైద్య ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి ముద్దాడ రవిచంద్ర, సాంఘిక సంక్షేమశాఖ కార్యదర్శి ఎం ఎం నాయక్, కళాశాల విద్య కమిషనర్ పోలా భాస్కర్, ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యా మండలి చైర్మన్ కె హేమచంద్రారెడ్డి, హోంశాఖ ముఖ్య కార్యదర్శి హరీశ్ కుమార్ గుప్త, జీఏడీ కార్యదర్శి (సర్వీసులు. హెచ్‌ఆర్‌ఎం) హెచ్ అరుణ్ కుమార్ ఇతర ఉన్నతాధికారులు హాజరయ్యారు.

నేడు పాలిసెట్ ఫలితాలు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఏపీ పాలిసెట్-2022 ఫలితాలను ఈనెల 18వ తేదీ శనివారం విజయవాడ గేట్ వే హోటల్‌లో ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి విడుదల చేస్తారు. పాలిటెక్నిక్, డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాలకు మే 29వ తేదీన పాలీసెట్‌ను ఆంధ్రప్రదేశ్ సాంకేతిక విద్య శాఖ అధ్వర్యంలో నిర్వహించారు. ఇప్పటికే పాలిసెట్-2022 కీని ఎస్‌బీటీఈటీ విడుదల చేసింది. ఈ ఫలితాలను విడుదల చేసిన రోజే ర్యాంక్ కార్డ్ డౌన్‌లోడ్ చేసుకోవచ్చని బోర్డ్ తెలిపింది.

కొత్త బార్ పాలసీ విడుదల

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఏపీలో 2022-23 ఆర్థిక సంవత్సరానికిగాను కొత్త బార్ పాలసీని రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది. మూడేళ్ల కాలపరిమితితో కొత్త బార్ లైసెన్సులు జారీ చేస్తూ శుక్రవారం రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రజత్ భార్గవ ఉత్తర్వులు జారీచేశారు. కొత్త పాలసీలో లైసెన్స్ ఫీజుతోపాటు నాన్-రిఫండబుల్ రిజిస్ట్రేషన్ చార్జీలు ఏడాదికి పది శాతం మేర పెంచింది. ప్రస్తుతమున్న బార్లు ఒకే చోట కేంద్రీకృతం కాకుండా, కొత్త పట్టణ ప్రాంతాలకూ విస్తరించేలా లైసెన్సుల హేతుబద్ధీకరణ చేపట్టనుంది. మద్యం నియంత్రణ విధానంలో భాగంగా, ఈ నెలాఖరుతో లైసెన్సులు ముగియనున్న రాష్ట్రంలోని 840 బార్లకు మాత్రమే రెండు నెలలపాటు పునరుద్ధరణకు అవకాశమిచ్చింది. ఈలోగా బార్ లైసెన్సులు పొందేందుకు వేలం, లాటరీ నిర్వహించాలని నిర్ణయించింది. పట్టణ ప్రాంతాలు, మున్సిపల్ కార్పొరేషన్లు, నగర పంచాయతీల్లో ఎన్ని బార్లు ఉండాలనే దానిపై ఆబ్కారీశాఖ కమిషనర్ నిర్ణయిస్తారని వెల్లడించింది. మున్సిపాల్టీల్లో మూడు కిలోమీటర్లు, మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 10 కిలోమీటర్ల పరిధిలో ఎక్కడైనా బార్లు పెట్టుకోవచ్చని పేర్కొంది. ఈ ఏడాది సెప్టెంబరు 1 నుంచి కొత్త బార్ పాలసీ అమల్లోకి వస్తుందని ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది. జూన్ 27న నిర్దేశిత అనుమతి ఫీజులను బార్ల యాజమాన్యానికి సూచించింది.

ఏడాదైనా ఉద్యోగాలేవీ ?

రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థి, యువజన సంఘాల నిరసన

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: గతేడాది జూన్ 18న విడుదల చేసిన 10,143 ఉద్యోగ పోస్టులకు ఇప్పటివరకూ ప్రకటనలు జారీ చేయకపోవడాన్ని నిరసిస్తూ, ఏపీ ఉద్యోగ పోరాట సమితి అధ్వర్యంలో ఏఐవైఎఫ్, ఏఐఎస్ఎఫ్, పీడీఎస్‌యూ, టీఎన్ఎస్ఎఫ్, తెలుగు యువత తదితర విద్యార్థి, యువజన సంఘాల అధ్వర్యంలో శుక్రవారం రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు నిర్వహించారు. కర్నూలులో ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి నక్కి లెనిన్, కడపలో రాష్ట్ర అధ్యక్షులు పరుచూరి రాజేంద్రబాబు, అనంతపురంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు సంతోష్ కుమార్, నంద్యాలలో ఉపాధ్యక్షులు నాగ రాముడు, కాకినాడలో రాష్ట్రసహాయ కార్యదర్శి వై.బాబీ, నరసరావుపేటలో రాష్ట్ర సహాయకార్యదర్శి సి.సుభానీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయా చోట్ల ఏఐవైఎఫ్ నేతలు మాట్లాడుతూ-ఉద్యోగ క్యాలెండర్ విడుదల చేసి, శనివారానికి సంవత్సరం గడుస్తోందనీ, అయినా జాబ్ క్యాలెండరులో ప్రకటించిన 10,143 పోస్టులకు ప్రకటనలు విడుదల చేయకపోవడం దుర్మార్గమన్నారు. జగన్ నిరుద్యోగులను తీవ్రంగా వంచించాడని విమర్శించారు. అధికారం చేపడితే రెండు లక్షల 50వేల ఉద్యోగాలు భర్తీ చేస్తానని ఇచ్చిన హామీని జగన్ విస్మరించారని ఎద్దేవా చేశారు. మాట తప్పి, మడమ తిప్పి నిరుద్యోగులను తీవ్ర వంచనకు గురి చేశాడని దుయ్యబట్టారు. కేంద్రంలో మోడీ అగ్నిపథ్ పేరిట నిరుద్యోగులను వంచించారని దుయ్యబట్టారు. ఉద్యమించిన యువతపై పాశవిక దమనకాండ సాగిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఉద్యోగాలు అడిగితే జగన్ కేసులు నమోదు చేస్తున్నాడని విమర్శించారు.

మరోవైపు 117 జీవోతో పాఠశాల విద్యను ముక్కలు చేసి విద్యారంగాన్ని జగన్ ప్రభుత్వం నీరుగార్చుతోందన్నారు. ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయడం లేదన్నారు. నిరుద్యోగులు వేలాది రూపాయలు వెచ్చించి శిక్షణ తీసుకుంటున్నాగానీ, ప్రకటనలు జారీ చేయకపోవడం అన్యాయమన్నారు. ఖాళీగా ఉన్న 2.50 లక్షల ఉద్యోగాలు భర్తీ చేసేంత వరకు ఉద్యమిస్తామని హెచ్చరించారు.

'అగ్నిపథ్' రద్దుకు పోరు

విశాలాంధ్ర-హైదరాబాద్: యువతను మోసం చేసేందుకు ప్రవేశపెట్టిన అగ్నిపథ్ పథకానికి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా ఉద్యమిస్తామని అఖిలభారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) జాతీయ అధ్యక్షులు తిరుమలై రామన్ కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కేంద్ర ప్రభుత్వం 'అగ్నిపథ్'తో దేశ యువత భవిష్యత్తుతో ఆటలాడుకుంటోందని, ఆర్మీ రిక్రూట్‌మెంట్‌కు సిద్ధమవుతున్న యువకులు గత ఎనిమిది సంవత్సరాలుగా బీజేపీ పాలనలో మోసపోతూనే ఉన్నారని ఆందోళన వ్యక్తంచేశారు. నాలుగు ఏళ్లకే పదవీవిరమణ అంటే ఆ తరువాత అదానీ, అంబానీ వంటి కార్పొరేట్ సంస్థలకు ప్రైవేట్ సెక్యూరిటీ గార్డులుగా మాత్రమే పనిచేసేందుకు ఈ కాంట్రాక్టు నియామకాలు జరుగుతున్నాయా అని ప్రశ్నించారు. అగ్నిపథ్ పథకాన్ని తక్షణమే రద్దు చేయాలనీ డిమాండ్ చేస్తూ ఏఐవైఎఫ్ తెలంగాణ రాష్ట్ర సమితి అధ్వర్యాన హిమాయత్ నగర్ వై జంక్షన్ వద్ద శుక్రవారం మోకాళ్లపై నడుస్తూ వినూత్న ప్రదర్శన నిర్వహించారు. ప్లకార్డులు చేతబూని, మోదీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్దఎత్తున నినాదాలు చేస్తూ అగ్నిపథ్‌ను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా తిరుమలై రామన్ మాట్లాడుతూ అగ్నిపథ్ కారణంగా దేశంలో జరుగుతున్న అల్లర్లకు, ఆందోళనలకు, ఆర్మీ అభ్యర్థుల మరణాలకు మోదీ, రాజ్‌నాథ్ సింగ్, అమిత్‌షా బాధ్యత వహించాలన్నారు. అగ్నిపథ్ పథకం యువతకు హాని కలిగించడమే కాకుండా సైన్యం గోప్యత, విశ్వసనీయతకు భంగం కలిగించవచ్చు అని అన్నారు. కేంద్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి ఈ పథకాన్ని నిలిపివేసి, మునుపటిలా ఆర్మీ నియామక ప్రక్రియను ప్రారంభించాలని తిరుమలై రామన్ డిమాండ్ చేశారు. ఏఐఎస్ఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి సుకేందర్ మహేసరి మాట్లాడుతూ గతంలో రైతులను లక్ష్యంగా చేసుకొని నల్ల వ్యవసాయ చట్టాలను తీసుకవచ్చి అనేకమంది రైతులను బలి తీసుకున్నారని, యువతను లక్ష్యంగా చేసుకొని అగ్నిపథ్ తీసుకొచ్చి కేంద్రంలోని మోదీ ప్రభుత్వం నేడు యువతను బలి తీసుకుంటోందని విమర్శించారు. మిలిటరీ ఉద్యోగాలపై ఆశలు పెట్టుకున్న నిరుద్యోగ యువతకు మోదీ ప్రభుత్వం ద్రోహం చేసిందన్నారు. గత ఎనిమిది సంవత్సరాలలో మోదీ ప్రభుత్వం ఖాళీగా ఉన్న లక్షలాది ఉద్యోగాలను భర్తీ చేయలేదని, నిరుద్యోగం పెరుగుదలపై ప్రతిపక్షాలు తీవ్రంగా విమర్శిస్తుంటే, 10 లక్షల కేంద్ర ప్రభుత్వ ఉద్యోగ ఖాళీలను త్వరలో భర్తీ చేస్తామని కేంద్రం ప్రకటించిందని ఇదికూడా బూటకమేనని చెప్పారు. రక్షణ దళాలలో నాలుగు సంవత్సరాల కాంట్రాక్టు ఉద్యోగం యువత జీవితాలను నాశనం చేస్తుందని అయన తెలిపారు. ఈ ప్రదర్శనలో ఏఐవైఎఫ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ వలి ఉల్లాహ్ ఖాద్రి, హైదరాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి నిర్లేకంటి శ్రీకాంత్, హరీష్ బాల, మహమూద్, మజీద్ ఖాన్, హర్షద్, శ్రీమాన్ మఠ్రి తదితరులు పాల్గొన్నారు.

త్వరలో 'అగ్నిపథ్' నియామకాలు

రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్

న్యూఢిల్లీ : 'అగ్నిపథ్' సైనిక నియామక పథకం మరికొన్ని రోజుల్లో ప్రారంభమవుతుందని, యువతకు ఇది ఒక బంగారు అవకాశమని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ శుక్రవారం అన్నారు. సైన్యంలో చేరాలనుకుంటున్న యువత అందుకు సిద్ధపడాలని కోరారు. 2022లో ఈ పథకం కింద నియామకం కోసం గరిష్ఠ వయోపరిమితిని 21 ఏళ్ల నుంచి 23 ఏళ్లకు పెంచుతూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం వల్ల గణనీయమైన సంఖ్యలో యువకులు సాయుధ దళాల్లో చేరేందుకు వీలు కలుగుతుందని సింగ్ అన్నారు. యువకుల భవిష్యత్తు పట్ల శ్రద్ధ, సున్నితత్వం చూపినందుకు ప్రధాన మంత్రికి ఆయన ధన్యవాదాలు తెలిపారు.

'స్విస్'లో దూసుకెళ్లిన భారతీయుల సొమ్ము

(మొదటిపేజీ తరువాయి)

వ్యవధిలో అది దాదాపు 50 శాతం ఎగబాకి రూ.30,500 కోట్లకు చేరింది. వరుసగా రెండవ సంవత్సరం వృద్ధి నమోదయింది. మరోవైపు వరుసగా రెండేళ్ల పాటు తగ్గుముఖం పట్టిన భారతీయ ఖాతాదారుల పొదుపు లేదా డిపాజిట్ ఖాతాల్లోని నగదు ఏడేళ్ల గరిష్ఠానికి చేరి 2021లో రూ.4,800 కోట్లకు పెరిగింది. స్విస్ బ్యాంకుల్లో భారతీయుల సంపద 2006లో 6.5 బిలియన్ స్విస్ ఫ్రాంకులుగా నమోదయింది. ఇప్పటి వరకు ఇదే గరిష్ఠం. అప్పటి నుంచి ఏటా తగ్గుముఖం పడుతూ వచ్చింది. 2011, 2013, 2017, 2020లో మాత్రం స్వల్ప వృద్ధి నమోదయింది. 2021లో ఏకంగా 50 శాతం పెరగడం గమనార్హం. 2019లో మొత్తం నాలుగు భాగాలు క్షీణించినప్పటికీ, 2020లో ఖాతాదారుల డిపాజిట్లలో గణనీయమైన పతనం కనిపించింది. అయితే 2021లో అన్ని వర్గాలలో పెరుగుదల కనిపించింది. ఇవి బ్యాంకులు ఎస్ఎన్‌బీకి నివేదించిన అధికారిక గణాంకాలు. అయితే స్విట్జర్లాండ్‌లో భారతీయులు కలిగి ఉన్న చాలా చర్చనీయాంశమైన నల్లధనం పరిమాణాన్ని మాత్రం సూచించలేదు. భారతీయులు, ఎన్ఆర్ఐలు లేదా ఇతరులు మూడవ దేశ సంస్థల పేర్లతో స్విస్ బ్యాంకుల్లో ఉన్న డబ్బును కూడా ఈ గణాంకాలు చేర్చలేదు. మరోవైపు, స్విస్ బ్యాంకుల్లో భారతీయ వ్యక్తుల డిపాజిట్లకు మరింత విశ్వసనీయమైన చర్యగా గతంలో భారతీయ, స్విస్ అధికారులు వివరించిన బ్యాంక్ ఫర్ ఇంటర్నేషనల్ సెటిల్‌మెంట్ (బీఐఎస్) 'స్థాన బ్యాంకింగ్ గణాంకాలు' క్షీణతను చూపించాయి. 2020లో దాదాపు 39 శాతం పెరిగి 125.9 మిలియన్ డాలర్లకు (రూ. 932 కోట్లు)కి చేరిన తర్వాత అటువంటి నిధులలో 2021లో 8.3 శాతం 115.5 మిలియన్ డాలర్లకు (ప్రస్తుత మారకపు ధరల ప్రకారం రూ.927 కోట్లు) క్షీణతను చూపించింది. స్విట్జర్లాండ్‌లోని భారతీయ నివాసితులు కలిగి ఉన్న ఆస్తులను 'నల్లధనం'గా పరిగణించలేమని స్విస్ అధికారులు ఎల్లప్పుడూ సమర్థిస్తూనే ఉన్నారు. గత సంవత్సరం వార్షిక గణాంకాల విడుదల తర్వాత, భారత ప్రభుత్వం 2020లో వ్యక్తులు, సంస్థల నిధులలో మార్పులకు గల కారణాలపై వారి అభిప్రాయంతో పాటు సంబంధిత వాస్తవాలపై స్విస్ అధికారుల నుంచి వివరాలను కోరింది. స్విట్జర్లాండ్‌లో భారతీయులు కలిగి ఉన్న నల్లధనం ఎంత అన్నది ఈ గణాంకాలు సూచించడం లేదని ఆర్థిక మంత్రిత్వ శాఖ తన ప్రకటనలో పేర్కొంది.

జగన్‌కు ఉచ్చు?

(మొదటిపేజీ తరువాయి)

విరుద్ధమైన విధానాలకు పాల్పడుతోంది. వాటిని పరిగణలోకి తీసుకోకుండా, మతతత్వ బీజేపీ నిలిపిన రాష్ట్రపతి అభ్యర్థికి జగన్ సిద్ధమవ్వడంపై వైసీపీ నేతలు, శ్రేణులు అసంతృప్తితో ఉన్నారు. ఇదే జరిగితే భవిష్యత్తులో వైసీపీకి భారీ నష్టం జరుగుతుందని ఆందోళన చెందుతున్నారు.

ఏపీకి అడుగడుగునా మోదీ దగా

ఏపీకి అడుగడుగునా మోదీ దగా చేస్తున్నారు. మోదీ అధికారంలోకి వచ్చాక ఏపీకి చేసిందేమీ లేదు. బెత్తెడు అభివృద్ధి ముందుకెళ్లలేదు. ప్రత్యేక హోదాతోపాటు విభజన హామీల అమలుకు సహకరించలేదు. వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి ప్యాకేజీ ఇవ్వలేదు. కడప స్టీలు ప్లాంట్ ఏర్పాటుచేయకపోగా, విశాఖలో ఉన్న ఉక్కు ఫ్యాక్టరీని కేంద్రం ప్రైవేట్ పరం చేసింది. కేంద్ర ప్రభుత్వ ఆధీనంలోని ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేట్ పరం చేయడంతో ఉద్యోగాలు కుదించుకుపోతున్నాయి.

అన్ని రంగాలను మోదీ ప్రైవేటపరం చేస్తూ, ఏపీకి దగా చేస్తున్నారు. రాష్ట్రాభివృద్ధికి సహకరించని బీజేపీకి, రాబోయే రాష్ట్రపతి ఎన్నికల్లో వైసీపీ బేషరతుగా మద్దతిచ్చేందుకు సిద్ధమవ్వడంపై ప్రతిపక్ష పార్టీలు ధ్వజమెత్తుతున్నాయి. మోదీ పాలనలో ప్రజాస్వామ్యం అంతానికి తుది దశకు చేరిందని, మతతత్వ బీజేపీకి వైసీపీ మద్దతివ్వడాన్ని సర్వత్రా తప్పుబడుతున్నారు.

హోదా కోసం నిలదీయరేం

2019 ఎన్నికల్లో వైసీపీకి 25 సీట్లు వస్తే, కేంద్రంలో అధికారంలో ఎవరున్నప్పటికీ వారి మెడలు వంచి, హోదా సాధించి తీరుతామని జగన్ ఆర్భాటంగా ప్రజలకు హామీ ఇచ్చారు. ఆ ఎన్నికల్లో వైసీపీకి భారీ మెజార్టీ వచ్చి, 22 ఎంపీ సీట్లను ప్రజలు అప్పగించారు.

ఆ తర్వాత ఏపీకి ప్రత్యేక హోదాతోపాటు విభజన హామీలపై కేంద్రంపై జగన్ ఎలాంటి ఒత్తిడి చేయలేదు. దీనిపై ప్రతిపక్షాలు ప్రశ్నించినప్పుడల్లా, బీజేపీ అత్యధిక మెజార్టీతో ఉన్నందునే, వైసీపీ ఒత్తిడి చేయలేకపోతుందంటూ దాట వేస్తూ వస్తున్నారు. వాస్తవంగా 2014 ఎన్నికల్లో వైసీపీ ఓటమి నుంచి 2019 ఎన్నికల వరకు ప్రత్యేక హోదా పేరిట జగన్ చాలా ఉద్యమాలు నిర్వహించారు. ఆ పార్టీ ఎంపీలు సైతం రాజీనామాలు చేశారు. ప్రస్తుత రాష్ట్రపతి ఎన్నికల్లో వైసీపీ ఓట్లు కీలకం కానున్నాయి. వైసీపీకి దాదాపు 155 మంది ఎమ్మెల్యేలతోపాటు 31(లోక్‌సభ+రాజ్యసభ) ఎంపీల ఓట్లున్నాయి. ఇదే అదునుగా, రాష్ట్ర ప్రయోజనాల కోసం మోదీని, బీజేపీ నేతల మెడలనూ జగన్ వంచాల్సిన సమయం ఆసన్నమైంది. ఏపీకి ప్రత్యేక హోదా ఇస్తేనే, బీజేపీకి మద్దతిస్తానంటూ జగన్ తెగేసి చెబితే, కేంద్రం దిగిరాక తప్పదు. అలా చేయకుండా బేషరతుగా మోదీకి జగన్ మద్దతుకు సిద్ధమవ్వడంపై ప్రతిపక్షాలు విమర్శలు చేస్తున్నాయి. వైసీపీ ప్రజాప్రతినిధులు సైతం లోలోపల మదన పడుతున్నారు. ఇప్పటికైనా జగన్ మేల్కొని, సొంత ప్రయోజనాలను పక్కనపెట్టి, ప్రతిపక్ష పార్టీలు నిలిపబోయే రాష్ట్రపతి అభ్యర్థికే మద్దతిచ్చి, లౌకికవాద పరిరక్షణకు తోడ్పడాల్సిన అవసరముంది.

నిరసన గళం

(మొదటిపేజీ తరువాయి)

నిరుద్యోగుల శాంతియుత నిరసన హింసాత్మకంగా మారింది. పోలీసుల కాల్పుల్లో వరంగల్‌కు చెందిన 19 ఏళ్ల యువకుడు మరణించాడు. మరో 15 మందికి పైగా గాయపడ్డారు. బీహార్‌లో ఈ పథకానికి వ్యతిరేకంగా నిప్పులు చెరుగుతున్న నిరసనల మధ్య పశ్చిమ చంపారన్ జిల్లాలోని బెట్టియాలో ఉప ముఖ్యమంత్రి రేణు దేవి ఇంటిపై దాడి జరిగింది. బుధవారం నుంచి మొదలైన హింసాత్మక ఘటనలకు బీహార్ అతలాకుతలమయింది. దీంతో ఈ రాష్ట్రంలోని 12 జిల్లాల్లో ఇంటర్‌నెట్ సేవలను నిలిపివేశారు. ఇక ఉత్తరప్రదేశ్‌లో నిరసనకారులు శుక్రవారం రైళ్లు, బస్సులు, పోలీసు అవుట్ పోస్టును తగలబెట్టారు. ఆందోళనకారులు అలీఘర్ జిల్లాలోని జట్టారి పోలీస్ స్టేషన్‌కు నిప్పు పెట్టారు. రోడ్లపై బైఠాయించి వాహనాల రాకపోకలను అడ్డుకున్నారు. అంతేకాకుండా అనేక పోలీసు వాహనాలను కూడా తగులబెట్టారు. బల్లియాలోని రైల్వే స్టేషన్‌లోకి ఒక గుంపు ప్రవేశించి రైలు కోచ్‌కు నిప్పు పెట్టింది. వారిని చెదరగొట్టడానికి పోలీసులు లాఠీఛార్జి చేయడానికి ముందు రైల్వే స్టేషన్ ఆస్తులను కూడా ధ్వంసం చేశారు. వారణాసి, ఫిరోజాబాద్, అమేథీలలో కూడా నిరసనలు చెలరేగాయి. ప్రభుత్వ బస్సులు, ఇతర ప్రజా ఆస్తులను ధ్వంసం చేశారు. అలీఘర్‌లో స్థానిక బీజేపీ నేత కారును తగులబెట్టారు. దేశమంతటా నిరసనలు వెల్లువెత్తడంతో కేంద్రం దిద్దుబాటు చర్యలకు ఉపక్రమించింది. కేంద్ర హోం మంత్రి అమిత్ షా, సైనిక దళాల ప్రధానాధికారి మనోజ్ పాండే ఆందోళనలు తగ్గించే ప్రకటనలు చేశారు. 2022లో ఈ పథకం కింద గరిష్ఠ వయోపరిమితిని 21 ఏళ్ల నుంచి 23 ఏళ్లకు పెంచాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. గత రెండేళ్లుగా సైనిక దళాల్లో చేరేందుకు సిద్ధమవుతున్న యువతకు అవకాశం కల్పిస్తామని సైనిక దళాల ప్రధానాధికారి చెప్పారు. గరిష్ఠ వయోపరిమితిని పెంచుతూ కేంద్రం తీసుకున్న నిర్ణయం పెద్ద సంఖ్యలో యువతకు ప్రయోజనం చేకూరుస్తుందని అమిత్ షా అన్నారు. కానీ నిరసనలు అనేక రాష్ట్రాలకు వ్యాపించాయి. శాంతియుతంగా జరుగుతున్న నిరసనలు హింసాత్మకంగా మారాయి. నిరసనకారులు ఉత్తరప్రదేశ్, తెలంగాణలో ఒక్కొక్క రైలుకు నిప్పు పెట్టారు. బీహార్‌లో న్యూఢిల్లీ-భాగల్‌పూర్ విక్రమశిలా ఎక్స్‌ప్రెస్‌ను లఖిసరాయ్‌లో, న్యూఢిల్లీ-దర్భంగా బీహార్ సంపర్క్ క్రాంతి ఎక్స్‌ప్రెస్‌ల బోగీలను సమస్తిపూర్‌లో తగులబెట్టారు. లఖిసరాయ్ స్టేషన్‌లో రైళ్ల రాకపోకలను అడ్డుకునేందుకు వారు పట్టాలపై పడుకోగా, రైల్వే, స్థానిక పోలీసులు వారిని చెదరగొట్టారు. ప్రదర్శనకారులు బక్సర్, భాగల్పూర్, సమస్తిపూర్‌లలో అనేక చోట్ల రహదారులను దిగ్బంధించారు. ఉత్తరప్రదేశ్‌లోని బల్లియా పట్టణంలో యువకులు 'భారత్ మాతా కీ జై', 'అగ్నిపథ్ వాపస్ లో' వంటి నినాదాలు చేశారు. ఖాళీ రైలుకు నిప్పంటించారు. మరికొన్ని రైళ్లను ధ్వంసం చేశారు. మధ్యప్రదేశ్ వాణిజ్య రాజధాని ఇండోర్‌లో వందలాది మంది ట్రాక్‌లపై గుమిగూడి రాళ్లు రువ్వారు. దాదాపు 15 మంది ఆందోళనకారులను అరెస్టు చేశారు. హరియాణాలో యువకులు టైర్లు తగులబెట్టడంతో పాటు మరికొందరు సర్వానాలో రైలు పట్టాలపై బైఠాయించారని అధికారులు తెలిపారు. పాల్వాల్‌లో హింసాత్మక నిరసనల తరువాత హరియాణా ప్రభుత్వం ముందుజాగ్రత్త చర్యగా ఫరీదాబాద్ జిల్లాలోని బల్లభ్‌ఘర్ ప్రాంతంలో మొబైల్ ఇంటర్నెట్, ఎస్ఎంఎస్ సేవలను 24 గంటల పాటు నిలిపివేసింది. దేశ రాజధాని దిల్లీలో వామపక్షాలకు అనుబంధంగా ఉన్న ఆల్ ఇండియా స్టూడెంట్స్ అసోసియేషన్ సభ్యులు ప్రదర్శనలు చేయడంతో మెట్రో ప్రయాణానికి అంతరాయం ఏర్పడింది.

హైదరాబాద్‌కి అగ్నిపథ్ సెగ... పోలీసు కాల్పుల్లో యువకుడి మృతి

విశాలాంధ్ర - హైదరాబాద్ : కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన అగ్నిపథ్ సెగ హైదరాబాద్‌కూ తాకింది. అగ్నిపథ్‌ను వ్యతిరేకిస్తూ సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో వందలాది మంది యువకులు శుక్రవారం ఆందోళనకు దిగారు. అగ్నిపథ్‌ను రద్దు చేసి యథావిధిగా సైనిక ఎంపిక కొనసాగించాలని డిమాండు చేశారు. ఈ క్రమంలో రైలు పట్టాలపై పార్సిల్ సామాన్లు వేసి నిప్పు పెట్టారు. మరోవైపు సికింద్రాబాద్ నుంచి బయల్దేరే ఈస్ట్‌కోస్ట్ ఎక్స్‌ప్రెస్‌కు ఆందోళనకారులు నిప్పు పెట్టారు. ఒక్కసారిగా యువకులు ఆందోళనకు దిగడంతో సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని ఆందోళనకారులను అదుపులోకి తీసుకున్నారు. దీంతో ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. అటుగా వెళుతున్న రైళ్లపై ఆందోళనకారులు రాళ్లు రువ్వారు. దీంతో స్టేషన్లో పరిస్థితిని చూసి ప్రయాణికులు బయటకు పరుగులు తీశారు. కొంతమంది యువకులు రైల్వేస్టేషన్ బయట ఆర్టీసీ బస్సులు ధ్వంసం చేశారు. పరిస్థితి చేయి దాటుతున్న క్రమంలో పోలీసులు కాల్పులు జరుపుతామని హెచ్చరించినా ఆందోళనకారులు వెనక్కు తగలేదు. స్టేషన్‌లోని జీఆర్పీ పోలీసులతో పాటు కాచిగూడ నుంచి చేరుకున్న అదనపు బలగాలు, సివిల్ పోలీసులు ఆందోళనకారులపై లాఠీఛార్జి జరిపారు. అయినా పరిస్థితి అదుపులోకి రాకపోవడంతో ఆందోళనకారులు వెనక్కి తగ్గి స్టేషన్‌ను వదిలి వెళ్లకపోతే కాల్పులు జరపాల్సి వస్తుందని రైల్వే స్టేషన్ పోలీసులు హెచ్చరించారు. మొదటి మూడు ఫ్లాట్‌ఫాంలలో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. ఈ మూడు ఫ్లాట్‌ఫాంలను ఆందోళనకారులు పూర్తిగా ధ్వంసం చేశారు. అధికారులు రైళ్లన్నింటినీ నిలిపివేశారు. ఆందోళనకారులు పోలీసుల హెచ్చరికలు లెక్కచేయకుండా రెచ్చిపోవడంతో పాటు రైళ్లపై యువకులు రాళ్ల దాడి చేయడంతో పోలీసులు గాల్లోకి 15 రౌండ్ల కాల్పులు జరిపారు. ఈ ఘటనలో వరంగల్ జిల్లా ఖానాపురం మండలం దాబీర్ పేటకు చెందిన రాకేష్ మృతి చెందగా అనేక మంది గాయపడ్డారు. మరో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. రైల్వే స్టేషన్ వద్దకు పెద్ద ఎత్తున చేరుకుని రాళ్లు రువ్వుతూ తొలుత రైల్వే స్టేషన్ ముందు ఉన్న బస్సుల అద్దాలను ధ్వంసం చేశారు. పోలీసులపై రాళ్ల వర్షం కురిపించడంతో ఇద్దరికి తీవ్ర గాయాలైనట్టు సమాచారం. పోలీసులు టియర్ గ్యాస్ ప్రయోగించారు. సికింద్రాబాద్‌లో ఆందోళన దృష్ట్యా హైదరాబాద్ మెట్రో అప్రమత్తమైంది. హైదరాబాద్ మెట్రో రైళ్లు రద్దు చేస్తున్నట్లు మెట్రో యాజమాన్యం ప్రకటించింది. అన్ని మార్గాల్లో మెట్రో సేవలు రద్దు చేస్తున్నట్లు మెట్రో ఎండీ ఎన్వీఎస్ రెడ్డి వెల్లడించారు.

పక్కా పథకం ప్రకారమే...

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో విధ్వంసం పక్కా పథకం ప్రకారమే జరిగినట్టు పోలీసులు తేల్చారు. అగ్నిపథ్ పథకం ప్రకటన వెలువడిన వెంటనే ఆందోళనకు ప్రణాళిక రూపొందించిన విద్యార్థులు జిల్లాల వారీగా వాట్సాప్ గ్రూప్‌లు ఏర్పాటు చేసుకున్నట్టు సమాచారం. ఈ గ్రూప్‌ల ద్వారా ఎప్పటికప్పుడు సమాచారాన్ని ఆందోళనకారులు తెలుసుకున్నారని పోలీసులు తెలిపారు. తెలంగాణలోని వివిధ జిల్లాలకు చెందిన యువకులు గురువారం రాత్రే హైదరాబాద్‌కు చేరుకున్నారు. చివరకు పోలీసుల కళ్లుగప్పి సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌కు వచ్చారు. వాట్సాప్ గ్రూప్‌ల ద్వారా విద్యార్థులంతా ఒకచోటుకు చేరినట్టు గుర్తించారు. శుక్రవారం ఉదయం 9 గంటలకు తొలుత సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ వద్ద బస్సులపై రాళ్లు రువ్వి అద్దాలను ధ్వంసం చేశారు. అనంతరం ఒక్కసారిగా స్టేషన్లోకి దూసుకొచ్చినట్లు పోలీసులు చెప్పారు. అనంతరం రైలు పట్టాలపై పార్సిల్ సామాన్లను కాల్చివేసి నిరసన తెలిపారు. ఒక్కసారిగా పట్టాలపై చేరి కేంద్రానికి వ్యతిరేకంగా నినదించారు.

నిరుద్యోగ యువతపై కాల్పులు దారుణం

- అగ్నిపథ్ పథకం దుర్మార్గం
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: నిరుద్యోగ యువతపై సికింద్రాబాద్ రైల్వేస్టేషన్లో పోలీసులు కాల్పులు జరపడాన్ని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ఖండించారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ, నిరుద్యోగ యువతకు ఏటా 2 కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామన్న మోదీ ఎనిమిదేళ్లుగా నిరుద్యోగ యువతను మోసగిస్తోందన్నారు. ఇప్పుడు భారత సైన్యంలో నాలుగేళ్ల కాంట్రాక్ట్ పద్ధతి తీసుకువచ్చేలా మోదీ సర్కారు 'అగ్నిపథ్' పథకం తీసుకురావడం దుర్మార్గమనీ, భారతసైన్యం ప్రతిష్టను మంటగలిపేలా మోదీ ప్రభుత్వం వ్యవహరిస్తోందని విమర్శించారు. అగ్నిపథ్ వ్యతిరేకిస్తూ ఇప్పటికే ఉత్తరాది రాష్ట్రాల్లో వెల్లువెత్తుతున్న నిరసనలు దక్షిణాది రాష్ట్రాలకూ విస్తరించాయని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే తక్షణమే అగ్నిపథ్ పథకాన్ని విరమించాలని డిమాండ్ చేశారు. సికింద్రాబాద్ కాల్పుల్లో మరణించిన నిరుద్యోగి కుటుంబానికి తక్షణమే నష్టపరిహారం చెల్లించాలన్నారు.

విద్యార్థి, యువజన సంఘాల నేతల అరెస్టుకు సీపీఎం ఖండన

దేశ ప్రజల ప్రయోజనాలను దెబ్బతీసేలా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'అగ్నిపథ్' కు వ్యతిరేకంగా విజయవాడలో ప్రశాంతంగా ఆందోళన చేస్తున్న విద్యార్థి, యువజన నాయకులను అరెస్టు చేయడాన్ని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ఖండించారు. సాయుధ బలగాల్లోకి పూర్తి స్థాయి సైనికులను భర్తీ చేయడానికి బదులు, అగ్నిపథ్ అనే పథకాన్ని తీసుకొచ్చి నాలుగేళ్ళ కాలానికి కాంట్రాక్టు పద్ధతిలో చేర్చుకోవడం సరైంది కాదన్నారు. విజయవాడలో యువజనులతో సమావేశమవుతున్న సందర్భంలో యువజన సంఘం నేతలను అరెస్టు చేయడాన్ని ఆయన తప్పుపట్టారు.

పాత పద్ధతిలోనే ఆర్మీ ఉండాలి: ఏఐవైఎఫ్

దేశ రక్షణను పణంగా పెట్టే అగ్నిపథ్ పథకాన్ని వెంటనే రద్దుచేసి, పాత పద్ధతిలోనే ఆర్మీ రిక్రూట్మెంట్ చేయాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు పరుచూరి రాజేంద్ర, నక్కి లెనిన్‌బాబు డిమాండ్ చేశారు. దేశ రక్షణ వ్యవస్థను సైతం ప్రైవేటీకరణకు పూనుకోవడం మోదీ ప్రభుత్వానికే చెల్లిందని, కేవలం నాలుగేళ్లే ఉపయోగించుకుని తర్వాత ఇంటికి పంపి వారికి ఎలాంటి పెన్షన్, ఇతర సదుపాయాలు లేకుండా చేయడం చూస్తుంటే, బీజేపీకి దేశరక్షణ పట్ల ఎంత చిత్తశుద్ధి ఉందో అర్థమవుతోందన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ దేశరక్షణ వ్యవస్థను ప్రైవేటు వారికి అప్పగించొద్దన్నారు. ఇప్పటికైనా కేంద్రంలోని మోదీ నాయకత్వంలోని బీజేపీ ప్రభుత్వం కుయుక్తులు మాని అగ్నిపథ్ పథకాన్ని రద్దుచేసి, పాత పద్ధతిలోనే సైన్యంలోకి చేర్చుకోవాలన్నారు.

జేసీ ప్రభాకరరెడ్డి ఇంటి వద్ద నిర్మానుష్యంగా రోడ్డు

జేసీ ఇంట్లో ఈడీ సోదాలు

విశాలాంధ్రబ్యూరో-అనంతపురం: టీడీపీ నాయకులు, జేసీ బ్రదర్స్ ప్రభాకరరెడ్డి, దివాకర్‌రెడ్డి ఇళ్లలో ఎన్‌ఫోర్స్ మెంట్ డైరెక్టరేట్ శుక్రవారం సోదాలు చేపట్టింది. తాడిపత్రిలోని జేసీ బ్రదర్స్ అనుచరుడు, కాంట్రాక్టర్ చవ్వా గోపాల్ రెడ్డి ఇంట్లోనూ సోదాలు నిర్వహిస్తున్నారు. దీంతో జేసీ ఇంటికి సమీపంలో పోలీస్ చెక్‌పోస్టు ఏర్పాటు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు మోహరించారు. ఈ కారణంగా తాడిపత్రిలో ఉద్రిక్త వాతా వరణం నెలకొంది. అటు హైదరాబాద్‌లో జేసీ బ్రదర్స్‌కు చెందిన ఇళ్లలోనూ ఈడీ సోదాలు చేస్తోంది. ఒకే సమయంలో ఈ దాడులు జరగడం సంచలనంగా మారింది. జేసీ ప్రభాకర్ రెడ్డి ఇళ్లలో ఈడీ సోదాల సమయంలో ఆయన సోదరుడు జేసీ దివాకర్ రెడ్డి కూడా అక్కడే ఉన్నారు. ఈడీ అధికారుల నుంచి సోదాలకు సంబంధించి వివరాలు ఆయన తెలుసుకుంటున్నట్లు సమాచారం. జేసీ ప్రభాకర్ రెడ్డి రాజకీయాలతో పాటు వ్యాపారాలు, కాంట్రాక్టుల్లో చురుగ్గా ఉంటారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో ప్రభాకర్ రెడ్డి ఎమ్మెల్యేగా ఉంటే, ఆయన సోదరుడు దివాకర్ రెడ్డి ఎంపీగా ఉన్నారు. దివాకర్ ట్రావెల్స్ పేరుతో బస్సుల్ని కూడా నడిపారు. అయితే వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వీరి వ్యాపారాలపై దెబ్బ పడింది. ప్రభుత్వం వీరిని పూర్తిగా టార్గెట్ చేయడంతో కొన్ని వ్యాపారాల్ని మూసేశారు. ప్రస్తుతం ప్రభాకర్ రెడ్డి తాడిపత్రి రాజకీయాలకు పరిమితం అవుతుండగా.. దివాకర్ రెడ్డి పూర్తిగా స్తబ్దుగా ఉన్నారు. అయితే ఇప్పటికే జేసీ ప్రభాకర్‌రెడ్డిపై వాహనాల అక్రమ రిజిస్ట్రేషన్ కేసు విచారణలో ఉంది. ఈ సోదాలపై ఈడీ స్పందించలేదు. సమాచారం ఇచ్చేందుకు అధికారులు నిరాకరించారు.

కోనసీమ జిల్లాకు అంబేద్కర్ పేరు కొనసాగించాలి

- తక్షణమే ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయాలి
- అమలాపురం అల్లర్లకు బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి
- అనంతబాబును ఎమ్మెల్సీ పదవి నుంచి బర్తరఫ్ చేయాలి
- వీసీకే పార్టీ సదస్సులో నేతలు

మాట్లాడుతున్న జల్లి విల్సన్. వేదికపై రామారావు, బాలసింగం, సీతారామ్, విద్యాసాగర్, సుబ్బారావు తదితరులు

విశాలాంధ్ర-విజయవాడ: కోనసీమ జిల్లాకు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ పేరును యథాతథంగా కొనసాగించాలని, దీనిపై ప్రభుత్వం వెంటనే స్పష్టమైన ప్రకటన చేయాలని వీసీకే పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జి బాలసింగం, సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్ డిమాండ్ చేశారు. ఆయా జిల్లాలకు ఎన్టీఆర్, వైఎస్సార్, పొట్టి శ్రీరాములు, టంగుటూరి ప్రకాశం, అన్నమయ్య, సత్యసాయి పేర్లు పెట్టినప్పుడు లేని అభ్యంతరం కోనసీమకు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ పేరు పెడితే ఎందుకు వచ్చిందని ప్రశ్నించారు. కోనసీమ అంబే ద్కర్ జిల్లాగా కొనసాగించాలని డిమాండ్ చేస్తూ వీసీకే పార్టీ ఆధ్వర్యాన ఇక్కడి ప్రెస్‌క్లబ్‌లో శుక్ర వారం సదస్సు నిర్వహించారు. వీసీకే పార్టీ రాష్ట్ర నాయకుడు గంజి రామారావు అధ్యక్షతన నిర్వహిం చిన ఈ సదస్సులో ముఖ్య అతిథిగా పాల్గొన్న వీసీకే పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జి బాలసింగం మాట్లాడుతూ జిల్లాల పునర్విభజన సమయంలోనే డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాగా ప్రకటించకపోవడం, పేరు పెట్టిన తర్వాత మళ్లీ ప్రజాభిప్రాయ సేకరణ చేయడంతో ప్రభుత్వ తీరుపై అనుమానాలు ఉన్నాయన్నారు. తక్షణమే అమలాపురంలో అల్లర్లపై సిట్టింగ్ జడ్జితో విచారణ చేయించాలని, బాధ్యులు ఎవరనేది ప్రకటించి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

దుర్మార్గపు ఆలోచనలతోనే విధ్వంసం: జల్లి విల్సన్

జల్లి విల్సన్ మాట్లాడుతూ ఆధునిక స్వతంత్ర భారతదేశం ప్రగతిపథంలో పయనించేందుకు దిశానిర్దేశం చేసిన మహనీయుడు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ పేరును కోనసీమ జిల్లాకు పెట్టడాన్ని జీర్ణించుకోలేని కొన్ని సంఘవ్యతిరేక శక్తులు దుర్మార్గపు ఆలోచనలతో విధ్వంసానికి పాల్పడ్డా యని చెప్పారు. ప్రభుత్వం కూడా అనానుకూల సమయంలో కోనసీమ జిల్లాకు అంబేద్కర్ పేరును పెట్టిందని, దీనిని అదునుగా చేసుకుని అసాంఘిక, మతోన్మాద, కుల అహంభావంతో కూడిన శక్తులు రెచ్చిపోయి అమలాపురంలో బీభత్సం సృష్టించి మంత్రి, ఎమ్మెల్యే ఇంటిని తగలబెట్టాయని ఆగ్రహం వ్యక్తంచేశారు. కాకినాడలో ఎమ్మెల్సీ అనంతబాబు తన మాజీ డ్రైవర్ అయిన దళిత యువకుడిని హత్య చేసి మృతదేహాన్ని నేరుగా ఇంటికి తీసుకొచ్చి అప్పగించడం అగ్రకుల అహంకారానికి పరాకాష్ట అని మండిపడ్డారు. గతంలో దళితులు, మహిళలపై దాడులు చేసినప్పుడు చట్టాలను పకడ్బందీగా అమలు చేసి ఉంటే కాకినాడ ఘటన జరిగి ఉండేది కాదన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి చిత్తశుద్ధి ఉంటే తమ పార్టీ నుంచి బహిష్కరించిన అనంతబాబుతో ఎమ్మెల్సీ పదవికి కూడా రాజీనామా చేయించాలని డిమాండ్ చేశారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు మంతెన సీతారామ్ మాట్లాడుతూ అమలాపురం అల్లర్లకు బీజేపీ, ఆర్‌ఎస్ఎస్ కారణమని విమర్శించారు. బీజేపీ ఆంధ్రాలో బలపడేందుకు పథకం ప్రకారమే అంతర్వేది నుంచి అమలాపురం వరకు వరుసగా విధ్వంసాలు సృష్టిస్తోందని చెప్పారు. వీసీకే పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు విద్యాసాగర్, కాంగ్రెస్ ఎస్సీ సెల్ రాష్ట్ర చైర్మన్ కొరివి వినయ్‌కుమార్, డీహెచ్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కరవది సుబ్బారావు, ఆర్పీఐ నాయకుడు పిట్టా వరప్రసాద్, వీసీకే పార్టీ నాయకులు సూర్యచంద్రరావు, అన్నవరపు సుధీర్ మాట్లాడుతూ కోనసీమ జిల్లాకు అంబేద్కర్ పేరును కొనసాగించాలని డిమాండ్ చేశారు.

మాట్లాడుతున్న ప్రసాద్. పక్కన రంగయ్య, చెన్నప్పయాదవ్, చిరంజీవి యాదవ్, వెంకటేశ్ గౌడ్, పెద్దయ్య, బాలచంద్రుడు తదితరులు

ప్రతి రైతుకు నష్టపరిహారం ఇవ్వాలి

విశాలాంధ్ర-తాడిపత్రి: పంట నష్టపోయిన ప్రతి రైతుకు నష్ట పరిహారం అందించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కేవీవీ ప్రసాద్ డిమాండ్ చేశారు. పట్టణంలోని ఆర్ అండ్ బీ గెస్ట్ హౌస్‌లో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గతేడాది రాష్ట్రవ్యాప్తంగా రైతులు దాదాపు 49 లక్షల ఎకరాల పంటలు పండించారు. కానీ 29 లక్షల ఎకరాలకు మాత్రమే ప్రభుత్వం బీమా ప్రకటించిందని ప్రసాద్ చెప్పారు. వాటిలో 17 లక్షల 61వేల ఎకరాలకు మాత్రమే బీమా ఇచ్చిందన్నారు. మిగతా రైతులకు ఎందుకు ప్రకటించలేదని ప్రశ్నించారు. రాజకీయ జోక్యంతో ఇవ్వలేదా, అధికారులు తప్పిదాల వల్ల ఇవ్వలేదా? అని నిలదీశారు. దీనిపై తక్షణమే ప్రభుత్వం విచారణ చేపట్టాలన్నారు. ఆర్బీకేల వద్ద జాబితా చూస్తే పంట సాగు చేయని రైతులకు, ఒక్కొక్క సాగుదారునికి రెండు పర్యాయాలు బీమా ఇచ్చినట్లు జాబితాలో చూపించారన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం క్షేత్రస్థాయిలో పరిశీలించి అర్హులైన ప్రతి రైతుకి పంట నష్ట పరిహారం, చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి, జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షుడు టీ.రంగయ్య, జిల్లా రైతు సంఘం కార్యదర్శి చెన్నప్ప యాదవ్, సీపీఐ పట్టణ కార్యదర్శి చిరంజీవి యాదవ్, పుట్టపర్తి జిల్లా రైతు సంఘం జిల్లా కార్యదర్శి వెంకటేష్ గౌడ్, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పెద్దయ్య, సీపీఐ నాయకుడు బాల చంద్రుడు తదితరులు పాల్గొన్నారు.

ఉక్కు పరిరక్షణకు ఉద్యమిద్దాం

విశాలాంధ్ర-కూర్మన్నపాలెం: ఉక్కు పరిర క్షణకు చేయి చేయి కలిపి ఉద్యమించాలని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ పిలుపు నిచ్చింది. ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా చేపడుతున్న రిలే దీక్షలు శుక్ర వారం 491వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షల్లో ఎస్.ఎం.ఎస్ విభాగానికి చెందిన ఉద్యోగులు పాల్గొన్నారు. దీక్షా శిబిరాన్ని ఉద్దేశించి పోరాట కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ, నాయకులు రమణమూర్తి మాట్లాడుతూ ఉక్కును రక్షించుకునేందుకు అన్ని వర్గాల ప్రజలను, రాజకీయ పార్టీలను కలుపుకుని ఉద్యమ కార్యాచరణ చేపట్టాలన్నారు. అందరూ కలిసి ఉద్యమిస్తే సఫలీకృతమవుతామన్నారు. గ్రామ గ్రామాన ఉక్కు ఉద్యమ ఆవశ్యకతను వివరించి ఉద్యమంలోకి వచ్చేందుకు కార్మికవర్గం ప్రయత్నించాలన్నారు. ఉద్యమిస్తే విజయం తథ్యమని స్పష్టం చేశారు. ఇంకా ఈ దీక్షల్లో పోరాట కమిటీ నేతలు కె.ఎస్.ఎన్.రావు, ఏ.మసేన్ రావు, జె.రామకృష్ణ, కె.రాజబాబు, మరదాల శ్రీనివాస రావు, సుబ్బయ్య, రమణ మూర్తి, బి.అప్పారావు, వీడీవీ పూర్ణ చంద్ర రావు, నాగబాబు తదితరులు పాల్గొన్నారు.

బైజూస్‌తో ఒప్పందం రద్దు

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు డిమాండ్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్రంలో విద్యారంగాన్ని మరింత బలహీన పరిచే బైజూస్ సంస్థతో రాష్ట్ర ప్రభుత్వ ఒప్పందాన్ని రద్దు చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. పాఠశాలలకు, విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులు కల్పించడం, పర్యవేక్షణ పెంచి ఖాళీ పోస్టులను భర్తీ చేయడం ద్వారానే విద్యారంగం బలపడుతుందనీ, ఇలాంటి కార్పొరేట్ సంస్థల ఒప్పందాల వల్ల మెరుగవ్వదని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న నూతన విద్యావిధానాన్ని వ్యతిరేకించడానికి బదులు రాష్ట్ర ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు బోధనా కార్యక్రమం అప్పజెప్పడం అసమంజసమన్నారు. ఆన్‌లైన్ విద్యా బోధన ప్రత్యామ్నాయం కాదనీ, దీనివల్ల పేద విద్యార్థులు నష్టపోతారని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడమనే ముసుగులో బైజూస్ వంటి కార్పొరేట్ సంస్థతో చేసుకున్న ఒప్పందం రద్దు చేయాలన్నారు.

పంట దెబ్బతిన్న ప్రతి రైతుకు పరిహారం చెల్లించాలి: సీఎం జగన్‌కు లేఖ

2021-ఖరీఫ్‌లో తుపాన్‌లు, అధిక వర్షాల కారణంగా పంట దెబ్బతిన్న రైతాంగానికి పరిహారం చెల్లించాలని శ్రీనివాసరావు ముఖ్యమంత్రి జగన్‌కు రాసిన లేఖలో డిమాండ్ చేశారు. తుపాన్ అధిక వర్షాలు, వరదలు చీడపీడలతో 36 లక్షల ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయని పేర్కొన్నారు. నష్టపోయిన రైతులకు పరిహారం అందజేస్తామని, రాష్ట్ర ప్రభుత్వం వాగ్దానం చేసిందేగానీ, అచరణలో రైతులందరికీ సక్రమంగా నష్టపరిహారం అందడం లేదన్నారు. వారికి ఈ స్కీము ద్వారా ఎలాంటి సహాయం అందలేదనీ, వారిని ఆదుకోవాలన్నారు.

549 జీవో ప్రకారమే జీతాలు

ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేశు డిమాండ్

మాట్లాడుతున్న ఓబులేశు. సమ్మెలో పాల్గొన్న మురళి, రాధాకృష్ణ, పెంచలయ్య, విశ్వనాథ్ తదితరులు

విశాలాంధ్ర-తిరుపతి: ఐదు నెలల వేతన బకాయిలు తక్షణమే చెల్లించాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ వైద్య ఒప్పంద కార్మికుల సంఘం అధ్వర్యంలో తిరుపతిలోని రాష్ట్ర కార్మిక ఆరోగ్య బీమా సంస్థ ఆస్పత్రిలో శుక్రవారం సమ్మె చేశారు. ముఖ్య అతిథిగా ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జీ ఓబులేశు పాల్గొన్నారు. ఆస్పత్రిలో పనిచేసే ఒప్పంద కార్మికులకు ఐదు నెలలుగా జీతాలు చెల్లించకుంటే వారెలా బతుకుతారని ఓబులేశు ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం ఒప్పంద కార్మిక వ్యవస్థను పూర్తిగా నిలిపివేసి, వారికి ఓ కార్పొరేషన్ ఏర్పాటు చేసి ప్రతి నెల 1న జీతాలు చెల్లించి, అండగా ఉంటానన్న పెద్ద మనిషి జగన్... నవ్వు చెప్పిన మాటలు అబద్ధాలని చెప్పగలవా అని నిలదీశారు. ప్రభుత్వమే 549 జీవీ ఇచ్చిందని, దాని ప్రకారం ఆసుపత్రిలో పనిచేస్తున్న ఒప్పంద కార్మికులకు జీతభత్యాలు ఇస్తున్నారా? లేదా? అని ఏరోజైనా ఆరా తీశారా అని ప్రశ్నించారు. అబద్ధాలు కట్టిపెట్టి సోమవారం లోపల ఐదు నెలల వేతన బకాయిలను చెల్లించాలని, లేనిపక్షంలో ముట్టడి కార్యక్రమానికి పిలుపునిస్తామని హెచ్చరించారు. ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పీ మురళి, ఉప ప్రధాన కార్యదర్శి కే రాధాకృష్ణ మాట్లాడుతూ ఆస్పత్రి సూపరింటెండెంట్ కార్మికుల సమస్యలను పై అధికారులకు తెలియపరచి, పరిష్కరించి, 549 ప్రకారం వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఏపీ ప్రజానాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిన్నం పెంచలయ్య, సీపీఐ నగర కార్యదర్శి జల్లా విశ్వనాథ్, ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శులు ఎన్ శ్రీరాములు, శివ కుమార్, ఏఐటీయూసీ నగర ప్రధాన కార్యదర్శి ఎండీ రవి, ఆంధ్రప్రదేశ్ వైద్య ఒప్పంద కార్మికుల సంఘం జిల్లా అధ్యక్షులు మహేంద్ర, ఏపీ బాల, అల్లా బాషా, రాష్ట్ర కార్మిక బీమా సంస్థ ఆసుపత్రి సంఘం నాయకులు నరసింహులు, నాగభూషణం, శేఖర్ పాల్గొన్నారు.

తక్షణమే అగ్నిపథ్ రద్దు

విజయవాడలో విద్యార్థి, యువజన సంఘాల ధర్నా

విశాలాంధ్ర-విజయవాడ: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన అగ్నిపథ్ పథకాన్ని రద్దు చేయాలని ఉద్యమిస్తున్న యువకులు, నిరుద్యోగులు, విద్యార్థులపై లాఠీచార్జి, కాల్పులను నిరసిస్తూ ఏఐఎస్ఎఫ్, ఏఐవై ఎఫ్, పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో దాసరి భవన్ ఎదుట శుక్రవారం నిరసన ధర్నా చేపట్టారు. ఈ ధర్నాను పోలీసులు అడ్డుకుని నాయకు లను అరెస్ట్ చేసి ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.శివారెడ్డి, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు లంకా గోవిందరాజు, పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు ఎ.రవిచంద్ర మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన అగ్నిపథ్ పథకం వల్ల దేశ రక్షణ వ్యవస్థకు భంగం వాటిల్లుతుంద న్నారు. అగ్నిపథ్ పథకాన్ని తీసుకరావడం వలన ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ ని రద్దు చేస్తామని ప్రకటించడం దుర్మార్గమన్నారు. కరోనా కారణంగా రెండేళ్లుగా ఆర్మీ రిక్రూట్‌మెంట్ కోసం సిద్ధమవుతున్న నిరుద్యోగుల ఆశలు ఆవిరి అయ్యారన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులేసు, పీడీఎస్‌యూ నగర అధ్యక్షుడు ఐ.రాజేష్, ఏఐఎస్ఎఫ్ నగర కార్యదర్శి ఎం.సాయికుమార్, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి పృథ్వీ, నాయకులు శివరాం, అయ్యప్ప, రమేష్, సాయి, పీడీఎస్‌యూ నాయకుడు రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఇన్ఫోసిస్‌కు సహకరిస్తాం

రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖమంత్రి అమర్‌నాథ్

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం: విశాఖలో తమ కంపెనీ కార్యకలాపాలు ప్రారంభించడానికి ఇన్ఫోసిస్ సంసిద్ధత వ్యక్తం చేసింది. దీనిపై రాష్ట్ర పరిశ్రమలు, ఐటీశాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ సానుకూలంగా స్పందించారు. ఇన్ఫోసిస్ గ్లోబల్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ హెడ్ నీలాద్రిప్రసాద్ మిశ్రా, ఇన్ఫోసిస్ రీజనల్‌హెడ్ అమోల్ కులకర్ణి కంపెనీకి చెందిన ఇతర అధికారులతో మంత్రి శుక్రవారం విశాఖలో సమావేశమయ్యారు. విశాఖలో తమ కంపెనీ 2,500 నుంచి 3,000 మంది ఉద్యోగులతో కార్యకలాపాలు ప్రారంభించనుందని ఇన్ఫోసిస్ ప్రతినిధులు తెలియ చేశారు. ఇందుకు అనువైన ప్రదేశాన్ని ఇప్పటికే సిద్ధం చేసుకున్నామని తెలిపారు. దీనిపై మంత్రి స్పందిస్తూ, త్వరలోనే విశాఖ రాష్ట్ర రాజధానిగా రూపు దిద్దుకోబో తోందని ఈ నేపథ్యంలో ఇటువంటి కంపెనీలు విశాఖకు రావడం అభినందనీయ మన్నారు. ఐటీ ఉద్యోగుల అవసరాలకు అనుగుణంగా సదుపా యాలు అందు బాటులో ఉన్నాయని మంత్రి అమర్ తెలియచేశారు. ఇప్పటికే రాడిసన్ బ్లూ విశాఖకు వచ్చిందని, త్వరలోనే ఒబరాయ్ గ్రూప్ విశాఖకు రాబోతోందని తెలిపారు. అమెరికాలోని ఐటీ కంపెనీల్లో పనిచేస్తున్న తెలుగు వారిలో 25 శాతం మంది ఈప్రాంతానికి చెందిన వారేనని మంత్రి అమర్ అన్నారు. విశాఖకు సమీపంలోని భోగాపురం వద్ద అంతర్జాతీయ విమానాశ్రయం రానుందని, విశాఖ భోగాపురంని కలుపుతూ తీరం వెంబడి ఆరులైన్ల రహదారిని నిర్మిస్తున్నా మని, ఇది కూడా ఐటీ రంగానికి ఉపయోగపడుతుందని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీ టిఎస్ ఎండి నందీశ్వర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఓటరు నమోదుపై ప్రత్యేక కార్యాచరణ: ముఖేశ్ కుమార్ మీనా

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: రాష్ట్రంలో ఓటరు నమోదుకు పరిష్కారంకాని దరఖాస్తులను స్పెషల్ డ్రైవ్ చేపట్టడం ద్వారా తక్షణమే పరిష్కరించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేశ్ కుమార్ మీనా ఆదేశించారు. గురువారం ఎన్నికల కమీషన్‌కు సంబంధించిన విభిన్న అంశాలపై రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లతో సీఈసీ వెలగపూడి సచివాలయం నుండి వీడియో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖేష్ కుమార్ మీనా మాట్లాడుతూ రాష్ట్రంలో రిజిస్టర్, అన్ రిజిస్టర్డ్ రాజకీయ పార్టీల కోసం ఎన్నికల సంఘం సిద్ధం చేసిన నోటీసులను వెంటనే అందచేయాలని స్పష్టం చేసారు. ఆయా చిరునామాలలో ఎవ్వరూ అందుబాటులో లేరన్న సమాచారం వస్తుందని, సాధ్యమైనంత వరకు వారిని గుర్తించేందుకు ప్రయత్నించాలని పేర్కొన్నారు. ఓటరు నమోదు, అభ్యంతరాలకు 60 రోజులకు పైబడి విచారణలో ఉన్న వాటిని పరిష్కరించేందుకు క్షేత్రస్థాయి అధికారులకు తగిన ఆదేశాలు జారీ చేయాలని, పెండింగ్ దరఖాస్తులు పరిష్కరించేందుకు స్పెషల్ డ్రైవ్ చేపట్టాని మీనా ఆదేశించారు. ఓటర్ల జాబితా సవరణకు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. బూత్ లెవెల్ అధికారులు, ఈఆర్ఓ, ఏఈఆర్ఓలకు సంబంధించి ఎటువంటి సమస్య ఉత్పన్నం కారాదని, ఖాళీలు ఏర్పడిన వెంటనే వాటిని భర్తీ చేయాలని సూచించారు. అన్ని జిల్లాలలో ఎన్నికల విభాగం ద్వారా జనాభాపరంగా సారూప్య నమోదు, ఛాయాచిత్ర సారూప్య నమోదు చేపట్టాలన్నారు. జాతీయ ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (ఎన్ జి ఆర్ ఎస్) కి సంబందించిన ఫిర్యాదులు ఉంటే వాటిపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని స్పష్టం చేసారు. ఈ సమీక్షా సమావేశంలో సచివాలయం నుండి రాష్ట్ర ఎన్నికల సంఘం అధికారులు పాల్గొన్నారు.

దుష్టపాలనకు చరమగీతం పాడాలి: చంద్రబాబు

విశాలాంధ్ర-విజయనగరం /భోగాపురం /డెంకాడ /చీపురుపల్లి:

'క్విట్ జగన్ సేవ్ ఆంధ్ర'తోనే నిరుద్యోగులకు ఉద్యోగాలు వస్తాయని చంద్రబాబు నాయుడు అన్నారు. రాష్ట్రంలో జగన్మోహన్ రెడ్డిని దింపే వరకూ పోరాటం చేయాలని, లేకపోతే రాష్ట్రం మరో శ్రీలంకవుతుందన్నారు. విజయనగరం జిల్లా నెల్లిమర్ల, చీపురుపల్లి నియోజక వర్గాల్లో శుక్రవారం ఆయన రోడ్ షోలో పాల్గొన్నారు. భోగాపురం సన్ రే రిసార్ట్స్ నుంచి రోడ్ షో ప్రారంభమైంది. సన్ రే వద్ద పార్టీ నేతలు అశోక్ గజపతిరాజు, చినరాజప్ప, కిమిడి కళావెంకటరావు, మృణాళిని, సుజయ్ కృష్ణ రంగారావు, గుమ్మడి సంధ్యారాణి, బేబీ నాయన, పతివాడ నారాయణ స్వామినాయుడు తదితరులు చంద్రబాబుకు స్వాగతం పలికారు. కర్రోజు బంగారాజు అధ్వర్యంలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. బాబును గజమాలతో అభిమానులు స్వాగతించారు. రిసార్ట్ నుంచి నాతవలస, డెంకాడ, విజయనగరం రింగ్ రోడ్, ఫూల్‌బాగ్ మీదుగా నెల్లిమర్ల చేరుకున్నారు. డెంకాడలో కంది చంద్రశేఖరరావు అధ్వర్యంలో పార్టీ కార్యకర్తలు భారీ ఎత్తున స్వాగతం పలికారు. విజయనగరం దాసన్నపేట రింగురోడ్డు వద్ద అదితి గజపతిరాజు నాయకత్వంలో పార్టీ శ్రేణులు అధినేతను స్వాగతించారు. అక్కడ నుంచి నెల్లిమర్ల చేరుకున్నారు. నెల్లిమర్లలో ప్రధాన రహదారి ప్రజలతో కిక్కిరిసి పోయింది. మాజీ మంత్రి పతివాడ నారాయణ స్వామి నాయుడు, టీడీపీ జిల్లా సీనియర్ నాయకులు సువ్వాడ రవిశేఖర్, మండల అధ్యక్షుడు కడగల ఆనంద్ కుమార్, పట్టణ అధ్యక్షురాలు బయిరెడ్డి లీలావతి, నాయకులు లెంక అప్పలనాయుడు, గేదెల రాజారావు పాల్గొన్నారు. అక్కడ నుంచి గుర్ల మీదుగా, చీపురుపల్లి చేరుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మనుషులంటే ప్రభుత్వానికి లెక్కలేదని, అందుకే బాదుడే బాదుడు కార్యక్రమం చేపట్టారన్నారు. అసలు జగన్ రాజకీయాలకు అర్హుడా?అని ప్రశ్నించారు. రాష్ట్రంలో తిరుగుబాటు ప్రారంభమైందన్నారు. నిత్యావసరాల ధరలు పెరిగిపోయాయన్నారు. పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ పెరిగిందని, తాను దీపం పెడితే జగన్ ఆర్పేశాడన్నారు. చివరకు సామాన్యులు కట్టెల పొయ్యిలు వాడుతున్నారన్నారు. కరెంట్ ఛార్జీలు పెరిగాయన్నారు. తమ హయాంలో విద్యుత్ కొరత లేకుండా చేశానని చెప్పారు. మరుగు దొడ్లపై, చెత్తపై పన్నులు వేసిన చెత్త ప్రభుత్వమని విమర్శించారు. ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, తాను అధికారంలోకి రాగానే ఫ్రీగా ఇళ్లు నిర్మిస్తామని హామీ ఇచ్చారు. పదోతరగతిలో 20 ఏళ్లలో లేని విధంగా అతి తక్కువ ఫలితాలు వచ్చాయి. నాడు నేడులో రంగులు కొడితే చదువొస్తుందా అని ప్రశ్నించారు. అమ్మ ఒడి అరకొర ఒడిగా మారిందని, సారా వ్యాపారం చేసే వ్యక్తి చదువుల మంత్రా? అని ప్రశ్నించారు. ఫెయిలైన వారికి మరలా వేయి రూపాయల పరీక్ష ఫీజు పెట్టి బాదుడన్నారు. కోడి కత్తి ఏమైందో చెప్పాలన్నారు. తల్లిని, చెల్లిని మోసం చేశాడన్నారు. బాబాయిని హత్య చేశాడని విమర్శించారు. రామతీర్థం వచ్చిన తనపై కేసులు పెట్టారని, అశోక్ గజపతిరాజును కేసులతో వేధించారని, అయినా ఆయన దేనికీ భయపడలేదన్నారు. కిమిడి నాగార్జున తదితర నేతలు పాల్గొన్నారు.

డీఎస్సీ-1998 అభ్యర్థులకు శుభవార్త

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఎంతో కాలంగా ఎదురు చూస్తున్న డీఎస్సీ-1998 అభ్యర్థులకు న్యాయం చేసేలా ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు శుక్రవారం తాడేపల్లి సీఎం క్యాంపు కార్యాలయంలో జరిగిన సమీక్షా సమావేశంలో డీఎస్సీ-1998 వారికి న్యాయం చేసే దస్త్రంపై జగన్ సంతకం చేశారు. వారికి ఉద్యోగం ఇచ్చే దిశలో విధివిధానాలను ప్రభుత్వం సిద్ధం చేస్తోంది. త్వరలోనే వారికి ప్రభుత్వం న్యాయం చేయనుంది. ఈ మేరకు తాడేపల్లి సీఎం క్యాంపు కార్యాలయం వద్ద ఎమ్మెల్సీ కల్పలతారెడ్డి మాట్లాడుతూ, చాలా ఏళ్లుగా నిలిచిపోయిన డీఎస్సీ-1998 దస్త్రంపై సీఎం సంతకం చేశారన్నారు. 20 ఏళ్ల నుంచి ఈ సమస్య పరిష్కారానికి ఏ ప్రభుత్వమూ చొరవ చూపలేదన్నారు. గత ప్రభుత్వం ఎమ్మెల్సీల కమిటీ వేసినా డీఎస్సీ-1998, 2008 అభ్యర్థులకు న్యాయం చేయలేదని, మొత్తంగా ఇప్పటివరకు 4565 మంది అభ్యర్థులకు ప్రభుత్వం న్యాయం చేసిందన్నారు.

సంపాదకీయం

తిరగబడ్తున్న నిరుద్యోగ సేన

గత మంగళవారం నాడు రక్షణ శాఖ మంత్రి రాజ్ నాథ్ సింగ్ త్రివిధ సైనిక దళాలలో చేర్చుకోవడానికి "అగ్నిపథ్" పథకం ప్రక టించినప్పటి నుంచి అన్ని వేపుల నుంచి విమర్శలు వెల్లువెత్తాయి. అగ్నిపథ్ పథకం ప్రకారం రక్షణ శాఖలో చేరే వారికి ఆరు నెలల శిక్షణతో కలిపి నాలుగేళ్ల మాత్రమే ఉద్యోగం చేసే అవకాశం ఉంటుంది. ఆ తరవాత వారు మరో ఉద్యోగమైనా చేసుకోవాలి లేదా నాలుగు ఏళ్ల ఉద్యోగ భోగం తరవాత నిరుద్యోగులుగా మిగిలి పోవాలి. మాజీ సైనికాధికారుల దగ్గరనుంచి, విద్యావేత్తలు, ప్రతిపక్షాల వారు ఈ పథకాన్ని తీవ్రంగా దుయ్యబడ్తున్నారు. ప్రభు త్వానికి వంత పాడడం అలవాటైన వారు మాత్రమే ఈ పథకం కీర్తి గానంలో నిమగ్నమై ఉన్నారు. ఈ నిరసనలన్నీ మాటలకు పరిమితమైతే సైన్యంలో చేరడానికి ఉత్సాహ పడ్తున్న వారు మూడు రోజుల కిందటే అంటే ఈ పథకం గురించి తెలిసిన వెంటనే బిహార్‌లో అలజడి ప్రారంభ మైంది. శుక్రవారం నాటికి బిహార్‌తో పాటు తెలంగాణ, ఉత్తర ప్రదేశ్, మధ్య ప్రదేశ్, పశ్చిమ బెంగాల్, జార్కండ్ రాష్ట్రాలలో అంటే ఏడు రాష్ట్రాలలో నిరుద్యోగులు రోడ్డెక్కారు. అయితే ఉద్యోగార్థుల నిరసన అనేక చోట్ల హింసాత్మకంగా మారడం కచ్చితంగా విచారించ దగ్గ అంశమే. అగ్నిపథ్ పథకం ప్రకటించి కేంద్ర ప్రభుత్వం అసలే నిరు ద్యోగంతో సతమతమవుతున్న యువత రోడ్డెక్కి నిరసనకు దిగేలా చేసింది. తెలంగాణ రాజధాని హైదరాబాద్‌లో ఈ రభసలో ఒక వ్యక్తి ప్రాణాలే కోల్పోయాడు. మిగతా చోట్ల కూడా భారీ స్థాయిలో విధ్వంసం జరిగింది. పరిస్థితి అనుకూలంగా లేదనుకున్నప్పుడు చేసిన తప్పులను దిద్దుకునే కేంద్ర ప్రభుత్వం ఈ ఉద్యోగార్థుల వయో పరిమితిని 21 ఏళ్ల నుంచి 23 ఏళ్లకు పెంచింది. అయినా నిరుద్యోగ యువత ఆగ్రహం చల్లారడం లేదు. బిహార్‌లో ఉపముఖ్యమంత్రి ఇంటిపై దాడి జరిగింది. గొప్ప గొప్ప వాగ్దా నాలు చేసిన మోదీ సర్కారు చెల్లించని వాగ్దానాల సంఖ్యే ఎక్కువ. నిరు ద్యోగం యువతకు అగ్ని పరీక్షలా మారింది. నిరుద్యోగులు తమ ఆందో ళనకు రైల్వే స్టేషన్లను కేంద్రంగా చేసుకున్నందువల్ల శుక్రవారం నాటికి దాదాపు 200 రైళ్లకు అంతరాయం కలిగింది. 35 రైళ్లు రద్దయ్యాయి. కనీసం 13 రైళ్లను మధ్యలోనే ఆపి వేయాల్సి వచ్చింది. ఇది ప్రయాణికులను తీవ్ర ఇబ్బందులకు గురి చేసింది. హైదరాబాద్‌లో ఆందోళన వల్ల ఈస్ట్ కోస్ట్ ఎక్స్‌ప్రెస్, రాజ్ కోట్ ఎక్స్‌ప్రెస్, అజంతా ఎక్స్ ప్రెస్‌ను రద్దు చేయవలసి వచ్చింది. హైదరాబాద్‌లో స్థానిక రైళ్లు కూడా నడవలేదు. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ అయితే రణరంగంగా మారిపోయింది. భయభ్రాంతులైన రైల్వే ప్రయాణికులను రైల్వే భద్రతా సిబ్బంది వెంట ఉండి బయటకు పంపించ వలసి వచ్చింది. కొందరు ప్రయాణికులు తమ సూట్ కేసులు, కళ్ల జోళ్లు, ఆధార్ కార్డుల వంటి సామాన్లను సైతం వదిలేసి ప్రాణాలు అర చేతిలో పెట్టుకుని బయటపడ్డారు. మూడు రైళ్లకు ఆందోళన కారులు నిప్పు పెట్టారు.

బిహార్‌లో కొనసాగుతున్న ఆందోళన శుక్రవారం మూడో రోజుకు చేరింది. ఉపముఖ్యమంత్రి రేణు దేవి ఇంటి మీద ఆందోళనకారులు దాడి చేశారు. జమ్మూ తావీ ఎక్స్ ప్రెస్‌కు చెందిన రెండు రైలు పెట్టెలకు ఆందోళన కారులు నిప్పు పెట్టారు. లఖిం సరాయ్ జిల్లాలో బీజేపీ కార్యాలయం మీద యువత విరుచుకుపడింది. ఇస్లాం పూర్–హాతియా ఎక్స్‌ప్రెస్‌కు నలందాలో నిప్పు పెట్టారు. మూడు ఏ.సి. పెట్టెలు కాలి బూడిదైతే మిగతా పెట్టెలకు కూడా భారీ నష్టమే జరిగింది. ఉత్తరప్రదేశ్ లోని బలియా స్టేషన్ లోకి ప్రవే శించిన ఆందోళనకారులు ఒక రైలు పెట్టెకు అగ్ని పెట్టారు. రైల్వే స్టేషన్ ఆస్తిని ధ్వంసం చేశారు. ఆగ్రహోదగ్రులైన యువతను చెదరగొట్టడానికి పోలీసు బలప్రయోగం చేయవలసి వచ్చింది. అగ్నిపథ్ పథకంపై యువతలో ఇంత ఆగ్రహం ఎందుకు పెల్లుబికింది అన్నది నిశితంగా పరిశీలించిన అంశమే. ఇంతకు ముందు సైన్యంలో చేసే వారు 17 ఏళ్ల పాటు పని చేసే అవకాశం ఉండేది. కొంత మంది మరి కొంతకాలం పని చేసే వీలు ఉండేది. పింఛన్ లాంటి సదుపాయాలు ఉండేవి. ఇప్పుడు అవేవీ ఉండవు. ఈ పథకం కింద చేరేవారు తరవాత పకోడీలు అమ్ముకోవాలా అని ఆందోళనకారులు ప్రశ్నిస్తున్నారు. ఎక్కువ కాలం పని చేసే వారికి జీవిత కాలం పింఛన్ వస్తుంది. పింఛన్ల భారం ఎక్కువైందన్నది ప్రభుత్వ బాధ. అందుకే నాలుగేళ్లకు కుదిస్తే ఈ బాధ ఉండదని అగ్నిపథం పేర అగ్ని వీరులను తయారు చేసి నాలుగేళ్లు వాడుకుని వదిలేయాలనుకున్నారు. కరోనా కారణంగా రక్షణ దళాల్లో నియామకం స్తంభించడం కూడా నిరుద్యోగ శ్రేణుల్లో అసంతృప్తి తీవ్రత పెంచింది. మిగతా నియామకాలేవీ ఆగనప్పుడు ఇవి మాత్రమే ఎందుకు నిలిపి వేశారన్నది వారి అడిగే సహజమైన ప్రశ్న. అందుకే "భర్తీ దో, యా అర్థి దో" (ఉద్యోగమైనా ఇవ్వండి లేదా డబ్బులైనా ఇవ్వండి) అని నినదిస్తున్నారు. సైన్యంలో చేరాలనుకునే వారు ఏళ్ల తరబడి డబ్బు కట్టి శిక్షణ పొందుతారు. శరీర దారుఢ్యాన్ని కాపాడుకోవడానికి కష్ట పడతారు. అలాంటిది రెండేళ్లు అసలే నియామకాలు లేకపఒవడం ఇప్పుడు ఇస్తామంటున్నది కేవలం నాలుగేళ్ల పాటే అనడం యువతలో వ్యథను మరింత పెంచింది. రక్షణ శాఖలో చేరడానికి ఏళ్ల తరబడి శిక్షణ తీసుకుని, వేచి చూసిన వారికి కొత్త నియమాలవల్ల అవకాశాలు మాయమవుతాయి. అయితే భవిష్యత్తులో రక్షణ శాఖలో చేరేవారికైనా అన్యాయం జరగకూడదని తాము ఆందోళన చేస్తున్నమనే వారూ ఉన్నారు. రాత పరీక్షకు సిద్ధం కావడానికి లక్షన్నర అంతకన్నా ఎక్కువ ఖర్చు పెట్టారు. ఇప్పుడు వారి ఆశలన్నీ ఆవిరైనందుకే ఆందోళనా పథం చేపట్టారు. ఈ ఆందోళన మోదీ హయాంలో నిరుద్యోగ భూతం అంతకంతకూ పెరగడం మీద ఉన్న అసంతృప్తే. ఇదే ఆగ్రహంగా మారుతోంది. రక్షణ శాఖలో ఉద్యోగాలు ఇస్తామంటూనే అననుకూల విధానాలు రూపొం దించినందుకు నిరసన జ్వాలలు రేగుతున్నాయి. మిగతా రంగాలలో కూడా ఆగ్రహం ఇతర రంగాలకు కూడా విస్తరించవచ్చు. ఉద్యోగాల నియామకమే పూర్తిగా తగ్గి పోయింది. వస్తుందనుకున్న ఉద్యోగాలకు ఇలాంటి నిరాశాపూరిత షరతులు విధిస్తున్నారు. నిరుద్యోగ వ్యథ అనుభవిస్తున్నవారు అన్ని వర్గాలలోనూ ఉంటారు. ప్రభుత్వ రంగాన్ని నీరుగారుస్తున్నందువల్ల కొత్త ఉద్యోగావ కాశాలు సన్నగిల్లాయి. ప్రైవేటు రంగంలోనూ పరిస్థితి అను కూలంగా ఏమీ లేదు. గ్రామాల నుంచి వలసలు పెరుగుతుండడంతో నగరాలు నిరుద్యోగులతో నిండిపోతు న్నాయి. మోదీ సర్కార్ సాధిస్తున్నా మంటున్న ప్రగతి, అభివృద్ధి అంతా బూటకమని తేలిపోతున్న తరుణంలో యువతలో అసహనం పెరిగిపోతోంది. అయినా విధ్వంసానికి దిగడం బాధాకరమే.

ఓ ప్రజా పత్రిక పుట్టినరోజు

డబ్బై ఏళ్లు. సామాన్య విషయం కాదు. ఇది మనిషి బతకడం గురించి కాదు. మనిషి కోసం పని చేసిన ఓ పత్రిక గురించి. ఆయా కాలాల నుంచి ఎదురైన అనేకానేక ఒత్తిళ్లు, సమస్యలు, ఉద్యమాలు వాటి నుంచి నేటి ఆధునిక కాలం వరకూ నిలబడడం, అదీ ప్రజల తరఫున పోరాడుతూ నిలబడడం సాధ్యమేనా. నేటి సాంకేతిక, సామాజిక, రాజకీయ, ఆర్థిక పరిస్థితుల్లో సాధ్యం కాదు. కాని ఈ పత్రిక నిలబడింది. నిలబడడం ఎలాగో తెలుగు సమాజానికి చూపించింది. ఉద్దండులను సమాజానికి అందించి గొప్ప మేలు చేసి ఎంత ఎదిగినా... తొలినాటి రోజుల్లో ఉన్న ఒద్దికనే నేటికీ అవలంబిస్తోంది. ఆ పత్రికే విశాలాంధ్ర. నాలుగు రోజుల్లో ఈ దినపత్రిక ఏడు పదుల వయసులో పడుతోంది. బాల్య, యవ్వన, కౌమార దశలు దాటినా... ఇంకా యవ్వనపు చైతన్యాన్ని తన సొంతం చేసుకుని అడుగులు వేస్తోంది విశాలాంధ్ర.

చక్రవాకం

- ముక్కాముల చక్రధర్

తెలుగు సమాజానికి దిక్సూచిగా నిలబడింది విశాలాంధ్ర. ఒక వైపు ప్రజా పోరాటాలకు బాసటగా నిలబడడమే కాదు.... ఆ ప్రజా పోరాటాలకు అండదండలు అందించింది కూడా ఈ విశాలాంధ్రే. ఆరు పదులు దాటిన వారికి షష్టిపూర్తి జరిగినట్లుగానే ఈ విశాలాంధ్రకు ఏడు పదుల వయసొచ్చింది. షష్టిపూర్తిని ఉగ్రరథ శాంతి అంటారు. అంటే వయసు మీరిన తర్వాత ఎలాంటి ఒడిదొడుకులు లేకుండా మిగిలిన జీవితం సాఫీగా సాగిపోయేందుకు జరిపే క్రతువు. ఆ షష్టిపూర్తిని హాయిగా, ఆనందంగా పూర్తి చేసుకుంది విశాలాంధ్ర. ఇదిగో ఇప్పుడు ఈ ఏడు పదుల జీవితంలోకి ప్రవేశించింది. దీనికీ ఓ పేరుంది. అదే భీమ రథ శాంతి. అంటే భీషణమైన రథం అని. అవును ఇప్పుడు దేశవ్యాప్తంగా నడుస్తున్న ప్రభుత్వాలు, ఆ ఏలికలు అవలంబిస్తున్న తీరు తెన్నులపై భీషణమైన ప్రతిజ్ఞతో రథం ఎక్కి దాన్ని సన్మార్గంలో పెట్టాల్సిన బాధ్యత విశాలాంధ్ర పత్రిక ముందుంది. ఈ 70 ఏళ్ళ పొడవునా అదే పని చేసింది విశాలాంధ్ర. ఇదేమీ కొత్త కాదు...అలాగని చేయలేని పని కూడా కాదు. ఈ నూతన దశాబ్దంలోకి అడుగు పెట్టిన పత్రికకు అదేమంత సాధ్యం కాని పని కూడా కాదు. ఎందుకంటే ఈ విశాలాంధ్ర వెనుక అద్భుత చరిత్ర ఉంది. ఓ పరమాద్భుతంగా సాధించిన విజయాలున్నాయి.

కాలం కడుపుతో ఉండి కారల్ మార్క్సుని కన్నది అంటారు. విశాలాంధ్ర పత్రిక కడుపుతో ఉండి ఉద్దండులను కన్నది. కర్నూలు వేదికగా జరిగిన సభలలో మన మహాకవి శ్రీశ్రీ అంటూ శ్రీశ్రీని మహాకవిని చేసింది ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీ నాయకుడు చంద్ర రాజేశ్వరరావే. ఆయనే విశాలాంధ్ర పత్రికకు జన్మనిచ్చిన తండ్రి. కంచికచర్ల కోటేశును అగ్రవర్ణాల వారు అమానుషంగా సజీవ దహనం చేస్తే పెట్టుబడికి పుట్టిన విషపుత్రికలు రాజ్యమేలడం ప్రారంభమైన ఆ తొలి రోజుల్లో ఆ వార్తను మొదటి పేజీలో ప్రముఖంగా ప్రచురించింది విశాలాంధ్ర పత్రికే.

నా అక్షరాలు వెన్నెల్లో ఆడుకునే అందమైన ఆడపిల్లలు అంటూ రాసిన దేవరకొండ బాల గంగాధర తిలక్ కవిత్వం అమృతం కురిసిన రాత్రిని ప్రచురించింది అక్షరాలా కమ్యూనిస్టు పార్టీ పత్రికగా పిలుచుకునే విశాలాంధ్రే. వేలాది మందికి ఆ మాటకొస్తే లక్షలాది మంది తెలుగు సాహిత్య పాఠకులకు ఆనాటి రష్యన్ సాహిత్యాన్ని తెలుగులో అందించింది విశాలాంధ్ర పత్రిక, అందులోని సిబ్బందే. భార్యాబిడ్డలను ఇక్కడే వదిలేసి కేవలం రష్యన్ సాహిత్యాన్ని తెలుగు వారికి అందించాలనే తపనతో రష్యా వెళ్లి అక్కడి రాదుగ పబ్లికేషన్స్‌లో సంవత్సరాల తరబడి ఉన్నది ఈ విశాలాంధ్ర సిబ్బందే.

తెలుగు సాహిత్యానికి నాటికి, నేటికి కొలమానంగా ఉన్న విమర్శకుడికి పురుడు పోసింది విశాలాంధ్ర పత్రికే. రా.రా.గా పిలుచుకునే రాచమల్లు రామచంద్రారెడ్డి విశాలాంధ్ర పత్రికలో పనిచేశారు. పి.సి.జోషిగా ప్రసిద్ధి పొందిన పూర్ణ చంద్ర జోషి విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ జనరల్ మేనేజర్‌గా ఉన్నప్పుడు తీసుకువచ్చిన పుస్తకాలే ఏ రాజకీయ పార్టీ వారైనా... ఏ రాజకీయ అభిప్రాయాలున్న వారైనా ప్రామాణికంగా చేసుకున్నారనేందుకు ఏడు పదుల విశాలాంధ్రే సాక్షి.

ఓ పత్రిక ఎడిటర్ అనే పదానికి విలువను, గౌరవాన్ని తీసుకువచ్చింది విశాలాంధ్ర ఎడిటర్ సి.రాఘవాచారే. తెలుగు భాషకే కాదు... పాండిత్యానికి కూడా పట్టుకొమ్మగా ఎప్పటికీ నిలిచిన రాంభట్ల కృష్ణమూర్తి లాంటి ప్రముఖులూ విశాలాంధ్రలో పని చేశారు. కొల్లాయి గట్టితేనేమి అంటూ తెలుగు సాహిత్య సమాజాన్ని ఓ ఊపు ఊపిన మహీధర రామ్మోహన్ రావు విశాలాంధ్ర గారాలపట్టి. తెలుగు వారి ఆత్మ గౌరవాన్ని ఢిల్లీలో నిలబెట్టా రంటూ చెప్పుకునే ఎన్.టి.రామారావును వెన్నుపోటు పొడిచిన చంద్రబాబు నాయుడి పక్కలో బల్లెం క్యారికేచర్ సృష్టికర్త మోహన్ తన 19వ ఏటనే విశాలాంధ్రలో కుంచెను పట్టింది ఆయన ఆర్ట్ బోర్డంత నిజం. దర్గాగీతం కథా రచయిత పెద్దిభొట్ల సుబ్బరామయ్య ప్రతీ రోజూ సాయంత్రం తన కథలకు పదును పెట్టుకున్నది విజయవాడ విశాలాంధ్ర పత్రిక ఆవరణలోనే. ఏటుకూరి ప్రసాద్, ఆర్‌వీఆర్‌గా పిలుచుకునే రాళ్ళభండి వెంకటేశ్వరరావు తెలుగు వారికి ఎంతో అనువాద సాహిత్యాన్ని అందించిన ఉప్పల లక్ష్మణ రావు, బూదరాజు రాధాకృష్ణ, ఆరుద్ర, గొప్ప రచయిత చాగంటి సోమయాజులు, అద్దేపల్లి రామ్మోహన్ రావు వంటి దిగ్గజాలను తెలుగు వారికి రుచి చూపించింది ఎనిమిది పేజీల విశాలాంధ్రే.

ఎంతో మంది గొప్పవారిని అందించిన విశాలాంధ్ర 70వ పడిలో పడుతోంది. ఇది వార్ధక్యం కాదు. యవ్వనోత్సాహం. ఏడాదికే నాలుగేళ్లు రావాలి... మా బాబు ఎప్పటికీ ముప్పైగా ఉండిపోవాలి అని ఓ తల్లి తన కోరిక చెబుతుంది ఓ సినీ పాటలో. విశాలాంధ్ర కూడా అంతే. ఈ పత్రిక నిత్య నూతన యవ్వని. ప్రజాగ్రహ వాహిని.

వ్యాస రచయిత సీనియర్ జర్నలిస్ట్,
9912019929

విచ్ఛిన్నకర చర్యలతో వృద్ధి సాధ్యం కాదు

కె.ఆర్ సుధామన్

విచ్ఛిన్నకర ధోరణులు, ఆచరణలు దేశాభివృద్ధికి ఉపయోగపడవనే విషయాన్ని అధికార పార్టీ బీజేపీ ప్రతినిధులు అలాగే పాలన చేస్తున్న ముఖ్యులు గమనించకుండా అసూయా ద్వేషాలను ప్రదర్శిస్తున్నారు. అభివృద్ధికి సంబంధించిన వాస్తవ గణాంకాలను గాకుండా తమకు అనుకూలమైన గణాంకాలను ప్రకటిస్తున్నారు. నిర్మాణాత్మక విమర్శను పాలకులు తట్టుకోలేకపోతున్నారు. వారికి అహం అడ్డు వస్తున్నది. ఇప్పటికైనా ఈ ధోరణిని మార్చుకోవాలి.

గత ఎనిమిదేళ్ల కాలంలో అన్ని రంగాల్లో 'గొప్ప అభివృద్ధి' సాధించానని ప్రధాని నరేంద్ర మోదీ చెప్పిన విషయంపై మిశ్రమ స్పందనలు వచ్చాయి. సానుకూలంగా స్పందించిన వారిలో ఎక్కువ మోదీ భక్తులే ఉన్నార న్నది వాస్తవం. నిజంగా అభివృద్ధి సాధించి ఉంటే ప్రస్తుతం ఆర్థికమాంద్యంవైపు మనం పయనించే అవసరం ఉండేది కాదని అనేక మంది ఆర్థిక నిపుణులు అభి ప్రాయపడుతున్నారు. దేశంలో 2014 తర్వాత అసహనం, విద్వేషం రాజ్య మేలు తున్నాయి. పాలకులు మతమితవాద భావజాలం విస్తరణకు ఎక్కువ ప్రాధాన్యత నివ్వడం అభివృద్ధి తిరోగమిస్తున్నదన్న విమర్శలు పెరిగాయి. స్వాతంత్ర్యం సిద్ధించి 75 ఏళ్లు అయినప్పటికీ మధ్యతరహా ఆర్థిక వ్యవస్థకు లేదా అభివృద్ధి చెందిన ఆర్థిక వ్యవస్థకు చేరుకోవాలంటే ఇంకా చాలాకాలం పడుతుంది. గతంలో ఆర్థిక నిపుణులు ప్రభుత్వ పాలనను తులనాత్మకంగా పరిశీలించి విమ ర్శలు చేసేవారు. వాటిని తీసుకుని ప్రభుత్వాలు మరిన్ని సంస్కరణలు లేదా దిద్దు బాటు చర్యలు తీసుకొనే పరిస్థితి ఉండేది. ఫలితంగా ఆర్థిక రంగం ఎప్పుడైనా తిరిగి పుంజుకునేది.

తులనాత్మక విశ్లేషణ, విమర్శలను స్వీకరిస్తేనే వృద్ధి జరగడానికి అవకాశా లుంటాయి. దిద్దుబాటు చర్యలు వృద్ధికి తప్పక దోహదం చేస్తాయి. ఇప్పుడు ఆ పరిస్థితి ఉన్నదా..? నేడు దేశంలో నెలకొన్న పరిస్థితులు ఆందోళనకరంగా ఉన్నాయి. ఆర్థిక అంశాలపైనే ఆధారపడి విశ్లేషణ చేయడం గాకుండా విశ్లేషించే ఆర్థికవేత్త రాజకీయంగా ఏ వైపు ఉండి విశ్లేషిస్తున్నారనేది చూడాలి. గత ప్రభు త్వాలు ప్రత్యేకించి కాంగ్రెస్ ప్రభుత్వాలు సాధించిన వృద్ధిని, విజయాలను మోదీ ప్రభుత్వం తిరస్కరిస్తూ అనేక అనర్థాలకు వారే కారణమని ప్రకటిస్తోంది. ఈ ధోరణి బాగా పెరిగింది. ప్రథమ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ ప్రభుత్వం ఆధునిక భారత నిర్మాణం దిశగా అనేక ప్రాజెక్టులు చేపట్టి పూర్తి చేసింది. అయితే మోదీ ప్రభుత్వం నెహ్రూ పాలనను దుయ్యబడుతోంది.

నెహ్రూ పాలనలో కొన్ని లోపాలు ఉండవచ్చు. అందులో సందేహం లేదు. పారిశ్రామీకరణకు, వ్యవసాయ రంగం అభివృద్ధికి నెహ్రూ ప్రభుత్వం బలమైన పునాదులు వేసింది. ప్రత్యేకించి స్టీలు, సిమెంట్ పరిశ్రమలపైన శ్రద్ధ వహించి వీటి ఆధారంగా ఇతర పరిశ్రమలను నిర్మించింది. దేశంలో అనేక ప్రఖ్యాతి గాంచిన విద్యాలయాలు అప్పుడే స్థాపించారు. నెహ్రూ ప్రభుత్వ రంగం అభివృద్ధిపై చూపిన శ్రద్ధ దేశ ప్రజలకు ఎంతో ప్రయోజనం కల్పించింది. ప్రైవేటు రంగం ఆర్థిక రంగం అభివృద్ధికి వివిధ తరగతుల స్థితిగతుల మెరుగుదలకు అంతగా దోహదం చేయలేదు.

ప్రస్తుతం కొన్ని ప్రభుత్వ రంగ సంస్థలను ప్రత్యేకించి సేవలకు సంబం ధించిన పరిశ్రమలను అలాగే కొనసాగించవలసిన అవసరం లేదు. ప్రభుత్వం వాటిని క్రమంగా నిలిపి వేయవచ్చు. ఉదాహరణకు ఆహార కొరత ఉన్న దశల్లో బ్రెడ్ తయారు చేయటంలో ఆనాడు ప్రైవేటు రంగం విఫలమైంది. దాంతో ప్రభుత్వ రంగంలో మోడరన్ బేకరీస్‌ని ఏర్పాటు చేసింది. ఇప్పుడు బ్రెడ్ తయారు చేయటానికి అనేక ప్రైవేటు సంస్థలు ముందుకు వచ్చినందున ప్రభుత్వ రంగ సంస్థతో పనిలేదు. 1960లలో హరిత విప్లవం పంజాబ్, హర్యానా, పశ్చిమ ఉత్తరప్రదేశ్ ప్రాంతాలను ధాన్యాగారంగా చేసింది. ఇప్పుడు దేశ వ్యాప్తంగా పంటలు సమృద్ధిగా పండుతున్నందున హరిత విప్లవం అవసరం లేదు. స్థానికంగా చిన్న చిన్న గోదాములను నిర్మించి ధాన్యాన్ని నిల్వ చేసుకునే సౌకర్యం రైతులకు కల్పించడానికి ప్రభుత్వ- ప్రైవేటు రంగ భాగస్వామ్యం అవ సరం. అయితే ధాన్యం సేకరణలో అవినీతి లేకుండా చూడాలి. రైతు పండించే ధాన్యానికి మేలైన ధర పొందటం కూడా వీలవుతుంది. ప్రస్తుత ఆర్థిక పరిస్థి తుల్లో ఇలాంటివి వృద్ధికి దోహదం చేస్తాయి.

గతంలో అన్ని ప్రభుత్వాలు ఆర్థిక వృద్ధిని సాధించి ఉండకపోవచ్చు. ఈ రోజుల్లో రాజకీయ చర్చల మాదిరిగానే ఆర్థిక వ్యవస్థపై సమగ్ర చర్చలు జరిపి తగిన చర్యలను తీసుకోవటం అవసరం.

అభివృద్ధి, ద్రవ్యోల్బణం, ఆర్థిక సంస్కరణలు, చెల్లింపుల పరిస్థితి, ద్రవ్య స్థితి తదితర అంశాలపై ఆమూలాగ్ర చర్చ అవసరం. బీజేపీ అధికార ప్రతినిధి నూపుర్ శర్మ వ్యవహారమైనా ప్రభుత్వానికి కళ్లు తెరిపించాలి. మహ్మద్ ప్రవక్తను కించపరిచిన నూపుర్‌శర్మ వ్యాఖ్యలపైన అనేక ముస్లిం దేశాలు మండిపడు తున్నాయి. ఆ దేశాలతో తిరిగి సఖ్యత కుదుర్చుకునేందుకు మోదీ ప్రభుత్వం నానా తంటాలు పడుతోంది. ప్రత్యేకించి గల్ఫ్ దేశాలు మన రాయబారులను పిలిపించి తమ నిరసనను, అసమ్మతిని వ్యక్తం చేశాయి. అనేక లక్షల మంది మన దేశం నుండి గల్ఫ్ దేశాలకు వెళ్లి పనులు చేసుకొని అక్కడ మిగుల్చుకున్న ధనాన్ని మన దేశానికి పంపుతున్నారు. దీనివల్ల వచ్చే మారక ద్రవ్యం మనకెంతో ప్రయోజనం చేకూరుస్తున్నది. ఈ దేశాలతో ఎగుమతి, దిగుమతుల వాణిజ్యం వంద బిలియన్ డాలర్ల వరకు జరుగుతున్నది. అయితే విచ్ఛిన్నకర ధోరణులు, ఆచరణలు దేశాభివృద్ధికి ఉపయోగపడవనే విషయాన్ని అధికార పార్టీ బీజేపీ ప్రతినిధులు అలాగే పాలన చేస్తున్న ముఖ్యులు గమనించకుండా అసూయా ద్వేషాలను ప్రదర్శిస్తున్నారు. అభివృద్ధికి సంబంధించిన వాస్తవ గణాంకాలను గాకుండా తమకు అనుకూలమైన గణాంకాలను ప్రకటిస్తున్నారు. నిర్మాణాత్మక విమర్శను పాలకులు తట్టుకోలేకపోతున్నారు. వారికి అహం అడ్డు వస్తున్నది. ఇప్పటికైనా ఈ ధోరణిని మార్చుకోవాలి.

అవకాశం వదులుకుంటే ప్రమాదమే

టి.వి.సుబ్బయ్య

ఏడాదికి రెండుకోట్ల ఉద్యోగాలు సృష్టిస్తానని వాగ్దానం చేసి 45 ఏళ్ల గరిష్ఠ స్థాయికి నిరుద్యోగాన్ని తీసుకువెళ్లి 'గొప్ప అభివృద్ధి' సాధించానని చెప్పుకోవడానికి 'అగ్నిపథ్' ను ప్రకటించి ఉండవచ్చు. ఈ పథకం ఇంకా ఇతర డిపార్టుమెంట్లతో పది లక్షల ఉద్యోగాలు రానున్న ఏడాదిన్నర కాలంలో కల్పిస్తామని మోదీ ప్రకటించారు. అంటే లోక్‌సభ ఎన్నికలు జరిగే దాకా నిరుద్యోగ యువతను భ్రమల్లో ఉంచడానికి ఇదొక ఎత్తుగడ కావచ్చు. ఆ నేపథ్యంలో ప్రతిపక్షాలు వీలైనంత త్వరగా ఫ్రంట్ నిర్మించి నిర్దిష్టమైన కార్యాచరణను ప్రకటించి ప్రజా వ్యతిరేక ప్రభుత్వ విధానాలను ప్రజలకు వివరించడం ద్వారా మాత్రమే తాము విజయం సాధించగలమన్న నమ్మకంతో పనిచేస్తే సానుకూల ఫలితాలు వస్తాయి. ఈ అవకాశాన్ని కోల్పోతే ప్రాంతీయ పార్టీలకూ ముప్పు తప్పదు.



భారత ప్రజాస్వామ్యం, రాజ్యాంగం, ప్రజల ప్రాథమిక హక్కుల మీద నిత్యం కేంద్ర పాలకుల దాడులు జరుగుతూనే ఉన్నాయి. అసహనం, విద్వేషం, విచ్చలవిడిగా కరాళ నృత్యం చేస్తూ, పాలక విధానాలను వ్యతిరేకిస్తున్న వారిని నిర్దాక్షిణ్యంగా అణచి వేస్తున్నారు. తప్పుడు కేసులు పెట్టి జైళ్లలో కుక్కుతున్నారు. ఆర్థిక వ్యవస్థ మాంద్యంలోకి జారుకుంటుందని ఆర్థికవేత్తలు ఆందోళన వ్యక్తం చేసినా ఎనిమిదేళ్లలో ఎంతో అభివృద్ధి చేశామని కాకి లెక్కలు వల్లిస్తున్నారు. యుపితో సహా అనేక రాష్ట్రాల్లో బుల్డోజరు న్యాయాన్ని అమలు చేస్తున్నారు. చట్టాలు, కోర్టులను ఖాతరు చేయడం లేదు. గోబెల్స్‌ను మించిన అధికార ప్రచార యంత్రాంగం, పాలకుల నుండి ప్రయోజనాలు ఆశిస్తున్న మీడియా సంస్థలు, పత్రికలు ప్రభుత్వాల తప్పుడు విధానాలకు వంత పాడుతున్నాయి. ఆయా రాష్ట్రాల్లో బలంగా ఉండి పాలిస్తున్న ప్రతిపక్ష పాలకులను భయపెట్టి కేంద్రం క్రమంగా విపక్షాలను నిర్వీర్యం చేసేందుకు పూనుకున్నది. రాష్ట్రాల హక్కులను కేంద్రం హరిస్తోంది.

ఆర్‌ఎస్ఎస్, బీజేపీ నాయకత్వంలో ప్రధాని నరేంద్ర మోదీ సర్వం తానై పాలిస్తూ నియంత పోకడలకు పోతున్నారన్న విమర్శలు మెండయ్యాయి. లోక్‌సభ ఎన్నికల్లో ప్రతిపక్షాలన్నీ కలిసికట్టుగా పోటీచేసి నరేంద్ర మోదీ ప్రభుత్వాన్ని గద్దె దించాలని అనుకుంటున్నారు. మోదీ పాలనతో విసిగిపోయిన రైతులు, కార్మికులు, సామాన్య ప్రజలు ప్రత్యామ్నాయం కోసం ఎదురు చూస్తున్నారు. భారీ లక్ష్యాన్ని పెట్టుకున్న ప్రతిపక్షాలు ఇంతవరకు ఏ ఒక్క ప్రజా వ్యతిరేక చర్య మీద దేశవ్యాప్త ఆందోళన చేపట్టలేదు. రైతులు ముందుకు వచ్చి ఏడాదికి పైగా మహత్తర పోరాటం జరిపి తమ సమస్యను పరిష్కరించుకున్నారు. తోద్పాటుతో ప్రతిపక్షాలు సరిపెట్టుకున్నాయి. బుధవారం ఢిల్లీలో జరిగిన ప్రతిపక్షాల సమా వేశానికి 17 పార్టీలు హాజరు కాగా ఆమ్ ఆద్మీ, బీజేడీ, టిఆర్ఎస్, వైసీపీ, టీడీపీ పార్టీలు దూరంగానే ఉన్నాయి. జాతీయ పార్టీ అయిన కాంగ్రెస్ తీవ్రంగా బల హీనపడినప్పటికీ, ఇప్పటికీ కొన్ని రాష్ట్రాల్లో అధికారంలో ఉంది. తెలంగాణ, కర్నాటక, మధ్యప్రదేశ్ లాంటి రాష్ట్రాల్లో శక్తిమంతంగా ఉంది. అయితే కాంగ్రెస్‌ను పూర్తిగా నిర్వీర్యం చేయాలని 'లక్ష్యంగా' పెట్టుకున్న మోదీ ప్రభుత్వం కాంగ్రెస్ ముఖ్యనేతలపై గల కేసులను తిరగదోడి విచారణ తంతుతో వేధిస్తోంది. నేషనల్ హెరాల్డ్ కేసు విషయంలో రాహుల్‌గాంధీని ఈడీ పిలిపించి ప్రశ్నిం చడంపై నిరసన తెలిపిన కాంగ్రెస్ శ్రేణులు చిదంబరం విషయంలో ఎవరూ మాట్లాడలేదు. ఇలాంటి పరిస్థితుల్లో కాంగ్రెస్ పునరుజ్జీవనం సాధ్యమేనా? అలాగే టీఎంసీ, ఆమ్‌ఆద్మీ పార్టీలను కకావికలం చేస్తున్నారు. జాతీయ పార్టీ అని ఊదరగొడుతున్న టీఆర్ఎస్ నేత కె.సి.ఆర్ ఢిల్లీ సమావేశానికి దూరంగా ఉండి రాష్ట్రపతి ఎన్నికలో తాను బీజేపీ వైపే ఉండదలచుకున్నానన్న సంకేతం ఇచ్చారా? వైసీపీ, టీడీపీ నేతలపై కేసులున్నందున వారు కూడా ప్రతిపక్షాల సమావేశానికి దూరంగా ఉన్నారని భావించాలా?. దూరంగా ఉండే పార్టీలు కూడా బీజేపీ పాలనా విధానాలు నచ్చకపోయినా తమ అవసరాలకు అనుగుణంగా అవి నడుచుకుంటున్నాయి.

ఇక ఎన్నికల్లో ఈ ప్రతిపక్షాల మధ్య సీట్ల పంపిణీ పెద్ద సమస్య. ఇందులో ప్రధాన పాత్ర తీసుకుని కాంగ్రెస్ సీట్ల విషయంలో, పొత్తుల వ్యవహారంలో ఎక్కువగా సర్దుబాటు ధోరణిని అనుసరించాలి. గత ఎన్నికల్లోనూ స్థోమతకు మించి బిహార్‌లో సీట్లు తీసుకుని బలమైన ప్రాంతీయ పార్టీ ఆర్జేడీకి నష్టం కలిగించిందని సర్వత్రా విమర్శలను ఎదుర్కొన్నది. కాంగ్రెస్ అధిష్ఠాన వర్గం అసమర్థత వల్లే పంజాబ్‌లో అధికారాన్ని కోల్పోయింది. అక్కడ బలహీనపడింది. కేరళలో కాంగ్రెస్ బలంగానే ఉంది. అందువల్ల వామపక్షాలతో పొత్తు సాధ్యం గాకపోయినా సర్దుకుపోవలసిన అవసరం ఉంది. అక్కడి బీజేపీతో పాటు వామపక్ష ప్రభుత్వంపై పోరాటం పేరుతో అల్లరి చేస్తోంది. పశ్చిమబెంగాల్‌లో చాలా బలహీనపడిన కాంగ్రెస్, టీఎంసీతో సర్దుకుపోతుందా లేదా అనేది పెద్ద ప్రశ్న. ఢిల్లీలోనూ ఆమ్‌ఆద్మీతో సర్దుబాటు కష్టం కావచ్చు. అయినా సర్దుకు పోవాలి. ఏదిఏమైనా ఇంతవరకు స్వయంకృతం వల్లనే కాంగ్రెస్ బలహీన పడింది. మోదీకి ధీటుగా ఎవరున్నారని చూడడం కంటే ప్రతిపక్షాలు ఐక్యంగా ఉండి పోరాడితే విజయం సాధించే అవకాశాలున్నాయి. మోదీ జనాకర్షణ శక్తి తగ్గిపోయిందని సర్వేలు చెప్తున్నప్పటికీ కొత్తకొత్త వ్యూహాలు, నినాదాల సృష్టితో ప్రజలను మభ్యపెట్టేందుకు ఆయన వెనుకాడరు. ఆయన ఎత్తుగడల్లో తాజాగా ప్రకటించిన 'అగ్నిపథ్' ఒకటి. ఇదొక విప్లవాత్మక చర్య అని జనంలో వ్యాప్తి చేసేందుకు బీజేపీ ప్రచార యంత్రాంగం లంకించుకున్నది. ఈ పథకం ఉపసంహరించాలని అనేక రాష్ట్రాల్లో యువత ఆగ్రహం వ్యక్తం చేస్తోంది. అనేక చోట్ల రైళ్లను తగులబెట్టారు. పోలీసులు కాల్పులు జరిపారు. ఇక పాలకుల అనుకూల మీడియా ప్రభుత్వ నిర్ణయాలను శ్లాఘిస్తోంది. ప్రభుత్వ చర్య 'బుల్డోజర్ న్యాయం' కూడా ఆ మీడియాకు దుర్మార్గమైనదిగా కనిపించకపోవడం విషాదం. బుల్డోజర్ న్యాయంపై ఆయా రాష్ట్రాల హైకోర్టుల స్పందన సక్రమంగా లేకపోవడంతో, న్యాయ కోవిదుల అభ్యర్థనతో సుప్రీంకోర్టు జోక్యం చేసుకున్నది. అగ్నిపథ్ ద్వారా సంఘ పరివార్ దళాలను అనామతు సైనికులుగా తయారు చేయాలన్న వ్యూహం దీని వెనుక ఉండవచ్చునని ఇప్పటికే కొందరు అనుమాని స్తున్నారు. ఏడాదికి రెండుకోట్ల ఉద్యోగాలు సృష్టిస్తానని వాగ్దానం చేసి 45 ఏళ్ల గరిష్ఠ స్థాయికి నిరుద్యోగాన్ని తీసుకువెళ్లి 'గొప్ప అభివృద్ధి' ని సాధించానని చెప్పుకోవడానికి 'అగ్నిపథ్' ను ప్రకటించి ఉండవచ్చు. ఈ పథకం ఇంకా ఇతర డిపార్టుమెంట్లతో పది లక్షల ఉద్యోగాలు రానున్న ఏడాదిన్నర కాలంలో కల్పిసా మని మోదీ ప్రకటించారు. అంటే లోక్‌సభ ఎన్నికలు జరిగే దాకా నిరుద్యోగ యువతను భ్రమల్లో ఉంచడానికి ఇదొక ఎత్తుగడ కావచ్చు. ఆ నేపథ్యంలో ప్రతిపక్షాలు వీలైనంత త్వరగా ఫ్రంట్ నిర్మించి నిర్దిష్టమైన కార్యాచరణను ప్రకటించి ప్రజా వ్యతిరేక ప్రభుత్వ విధానాలను ప్రజలకు వివరించడం ద్వారా మాత్రమే తాము విజయం సాధించగలమన్న నమ్మకంతో పనిచేస్తే సానుకూల ఫలితాలు వస్తాయి. ఈ అవకాశాన్ని కోల్పోతే ప్రాంతీయ పార్టీలకూ ముప్పు తప్పదు.

ఆరోగ్య జీవన విధానమే ప్రకృతి వైద్యం

ఆరోగ్యంగా ఉండాలని ఎవరికి ఉండదు. అందరికీ ఉంటుంది. కానీ, అందుకు అనుసరించాల్సిన అంశాల గురించిన అవగాహన లేకపోవడమే మనకున్న అతి పెద్ద లోపం. అదే జబ్బుకి అసలు హేతువు. మంచి ఆహార అలవాట్లతో పాటు పోషకాహారం తీసుకోవడం, వ్యాయామం చేయడం, ఒత్తిడి లేకుండా హాయిగా ఉండడం మొదలైనవి అనుసరించడం వల్ల ఆరోగ్యంగా ఉండొచ్చు. పోషకాహారం మౌలికమైన అవసరం. వేరు వేరు వర్గాలకు చెందిన పదార్థాలన్నింటినీ తీసుకోవడం వల్ల ఆహారం పోషకాలను తగిన పాళ్ళలో అందిస్తుంది. ప్రధానంగా గింజధాన్యాలు, చిరుధాన్యాలు, పప్పు దినుసులు పోషకాలను ఎక్కువగా కలిగి ఉంటాయి. ఇదంతా దాదాపుగా ప్రకృతి సంబంధితమే. ప్రకృతి వైద్యమూ వీటితోనే కూడి ఉంటుంది. ప్రకృతి వైద్య సిద్ధాంతంలో "ప్రకృతి నివారణ శక్తి" ఆధారంగా సహజమైన, తక్కువ ఇబ్బందికర పద్ధతులు ఉంటాయి. "సంయోజిత" ఔషధం, అణు ధార్మికత, పెద్ద శస్త్రచికిత్స వంటి చికిత్సలు ఉండవు. అనారోగ్యాలను ఎదుర్కోవడానికి ప్రకృతి మానవ శరీరానికి తగిన శక్తిని సమకూర్చింది. ఆనందకర ఆరోగ్య జీవన విధానమే ప్రకృతి వైద్యం, మనం ఎలా జీవించాలి, ఏం తినాలి అనేది ఇది తెలియజేస్తుంది.

డా యం. అఖిల మిత్ర

'అగ్నిపథ్' నిరసనలతో 200 రైళ్లపై ప్రభావం

35 రైళ్లు రద్దు, 13 తాత్కాలికంగా నిలిపివేత : రైల్వే శాఖ

న్యూఢిల్లీ : సైనిక దళాల్లో నియామకం కోసం కేంద్రం ప్రవేశపెట్టిన అగ్నిపథ్ పథకాన్ని వ్యతిరేకిస్తూ నిరసనలు చెలరేగిన కారణంగా ఇప్పటి వరకు 200కి పైగా రైలు సర్వీసులపై ప్రభావం పడిందని రైల్వేలు శుక్రవారం తెలిపాయి. బుధవారం నిరసనలు ప్రారంభమైన నాటి నుంచి దాదాపు 35 రైళ్లు రద్దవగా, 13 రైళ్లను తాత్కాలికంగా నిలిపివేసినట్లు వివరించింది. ఉత్తర ప్రదేశ్‌కి చెందిన అనేక ప్రాంతాలతో పాటు బీహార్, జార్ఖండ్‌లలో నడిచే తూర్పు మధ్య రైల్వేలపై ఇది తీవ్రంగా ప్రభావం చూపింది. ఈ రాష్ట్రాల్లో విస్తృతంగా నిరసనలు చెలరేగాయి. దీంతో ఎనిమిది రైళ్ల కార్యకలాపాలను పర్యవేక్షించాలని కూడా నిర్ణయించింది. ఈ రైళ్ల రాకపోకలను నిశితంగా గమనించడంతో పాటు నిరసనలు తీవ్రమైనప్పుడు వాటిని నడిపే విషయమై నిర్ణయం తీసుకుంటామని అధికారులు తెలిపారు. ఈ ఎనిమిది రైళ్లలో 12303 హౌరా-న్యూఢిల్లీ పూర్వా ఎక్స్‌ప్రెస్, 12353 హౌరా-లక్నో ఎక్స్‌ప్రెస్, 18622 రాంచి-పాట్నా పాటలీపుత్ర ఎక్స్‌ప్రెస్, 18182 దానాపూర్-టాటా ఎక్స్‌ప్రెస్, 22387 హౌరా-ధన్‌బాద్ బ్లాక్ డైమండ్ ఎక్స్‌ప్రెస్, 13512 అసన్‌సోల్-టాటా ఎక్స్‌ప్రెస్, 13032 జైనగర్-హౌరా ఎక్స్‌ప్రెస్, 13409 మాల్దా టౌన్-కియుల్ ఎక్స్‌ప్రెస్ ఉన్నాయి. అలాగే రెండు ఈసీఆర్ రైళ్లు 12335 మాల్దా టౌన్-లోకమాన్య తిలక్(టి) ఎక్స్‌ప్రెస్, 12273 హౌరా-న్యూఢిల్లీ దురంతో ఎక్స్‌ప్రెస్ కూడా రద్దయ్యాయి. అయితే రద్దయిన ఇతర రైళ్ల వివరాలు వెంటనే ఇంకా తెలియరాలేదు. ఉత్తర సరిహద్దు రైల్వేలు నడుపుతున్న అనేక రైళ్లు కూడా ఈసీఆర్ అధికార పరిధి గుండా వెళతాయి. వాటిలో మూడింటిపై కూడా ప్రభావం పడినట్లు రైల్వేలు తెలిపాయి. ఈసీఆర్‌లో నడుస్తున్న మూడు రైళ్ల కోచ్‌లు, కుల్హారియాలో ఒక ఖాళీ రేక్ (ఈసీఆర్‌లో కూడా) హింసాత్మక నిరసనకారుల వల్ల దెబ్బతిన్నాయి.

ఉత్తరప్రదేశ్‌లోని బలియా వద్ద వాషింగ్ లైన్‌లో ఉన్న ఒక రైలు కోచ్ కూడా దెబ్బతింది. ఈ ఆస్తి నష్టాలను ప్రస్తుతానికి అంచనా వేయడం కష్టమని రైల్వే అధికారులు తెలిపారు. ఇదిలాఉండగా, తెలంగాణ రాష్ట్రం సికిందరాబాద్ రైల్వే స్టేషన్‌లో నిరసనకారులు ఒక రైలు కోచ్‌ను తగలబెట్టినట్లు కూడా వార్తలు వస్తున్నాయి.

నిరసనలతో యమునా ఎక్స్‌ప్రెస్‌వే పై ట్రాఫిక్‌కి అంతరాయం

నోయిడా : అగ్నిపథ్ పథకాన్ని నిరసిస్తూ యమునా ఎక్స్‌ప్రెస్‌వే పై శుక్రవారం నిరసనలు కొనసాగాయి. యువకులు పెద్ద సంఖ్యలో ట్రాఫిక్‌ను కొద్దిసేపు అడ్డుకోవడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడినట్లు అధికారులు తెలిపారు. గ్రేటర్ నోయిడా, మథుర-ఆగ్రా మధ్య జెవార్ టోల్ ప్లాజా మీదుగా నిరసనలు కొనసాగడంతో మధ్యాహ్నం 12 గంటల నుంచి సుమారు గంటపాటు ట్రాఫిక్‌కి అంతరాయం ఏర్పడిందని అన్నారు. 'శాంతి భద్రతల పరిస్థితి నేపథ్యంలో నిరసనలు జరుగుతున్న ప్రాంతానికి పెద్ద సంఖ్యలో పోలీసు బలగాలు వెళ్లాయి' అని పోలీసు అధికారి ఒకరు తెలిపారు. అయితే మధ్యాహ్నం దాదాపు 1.30 గంటలకు యమునా ఎక్స్‌ప్రెస్‌వే పై ట్రాఫిక్‌ను పునరుద్ధరించినట్లు ట్రాఫిక్ అధికారి ఒకరు చెప్పారు.

మోదీకి అవేమీ వినిపించవు...

అగ్నిపథ్ వ్యతిరేక ఆందోళనలపై రాహుల్ విమర్శ

న్యూఢిల్లీ : కేంద్రప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకు వచ్చిన అగ్నిపథ్ పథకం దేశ యువతలో అగ్గి రాజేసింది. సైన్యంలో చేరాలని కోరుకున్న వారికి కోపం తెప్పించింది. దీంతో నిరసనలు, ఆందోళనలు మిన్నంటాయి. పలుచోట్ల ఉద్రిక్తతకు దారితీశాయి. ఈ పరిస్థితులు ఏవీ కేంద్రానికి పట్టవని, ప్రధాని మోదీకి ఆయన మిత్రుల స్వరాలు తప్ప మరేమీ వినిపించవని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ శుక్రవారం విమర్శించారు. 'ప్రజా సంక్షేమం నెపంతో నోట్ల రద్దు చేపట్టారు. జీఎస్టీ, సాగు చట్టాలను తెచ్చారు. కొత్తగా అగ్నిపథ్‌ను ప్రకటించారు. కానీ వీటన్నింటిని పౌరులు తిరస్కరించారు. అగ్నిపథ్‌ను యువత తిరస్కరించింది. సాగు చట్టాలను రైతులు తిప్పికొట్టారు. నోట్ల రద్దును ఆర్థికవేత్తలు వద్దన్నారు. జీఎస్టీని వర్తకులు తిరస్కరించారు. కానీ ప్రధానమంత్రికి దేశ ప్రజలు ఏం కోరుకుంటున్నారో అర్థం కావడం లేదు. ఎందుకంటే ఆయనకు తన మిత్రుల స్వరాలు తప్ప ఏమీ వినపడవు' అని హిందీలో రాహుల్ ట్వీట్ చేశారు. కాంగ్రెస్ నేత ప్రియాంక గాంధీ వాద్రా కూడా స్పందించారు. 24 గంటల్లో ఆర్మీ నియామకాలకు సంబంధించిన కొత్త నిబంధనలను సవరించాలని డిమాండు చేశారు. యువతపై హడావిడిగా తమ ప్రాణాళికను బీజేపీ ప్రభుత్వం రద్దుతోందని దుయ్యబట్టారు. అగ్నిపథ్ పథకాన్ని వెంటనే ఉపసంహరించుకోండి మోదీజీ అంటూ హిందీలో ట్వీట్ చేశారు. వైమానిక దళంలో నియామకాలు చేపట్టాలని, ఇవి చాలా కాలంగా జరగలేదన్నారు. సైనిక నియామకాలు గతంలో వలే చేపట్టాలని, వయో పరిమితిని సడలించాలని ప్రియాంక డిమాండు చేశారు. అగ్నిపథ్ పథకంలో స్వల్పకాల సర్వీసు విషయాన్ని పక్కకు పెట్టి దీనిపై తదుపరి కార్యాచరణకు ముందు నిపుణులతో విస్తృతంగా చర్చలు జరపాలని మోదీ ప్రభుత్వాన్ని కాంగ్రెస్ డిమాండు చేసింది. కాగా, దేశవ్యాప్తంగా జరుగుతున్న నిరసనలతో మెట్టు దిగిన కేంద్రం అగ్నిపథ్ కింద వయోపరిమితిని 21 నుంచి 23ఏళ్లకు పెంచుతూ ప్రకటన చేసింది.

'అగ్నిపథ్'ను ఉపసంహరించాలి: ప్రియాంక

న్యూఢిల్లీ: కేంద్రం తీసుకొచ్చిన 'అగ్నిపథ్' పథకాన్ని వెంటనే ఉపసంహరించాలని కాంగ్రెస్ ప్రధానకార్యదర్శి ప్రియాంకగాంధీ వాద్రా డిమాండ్ చేశారు. 24 గంటలు కూడా గడవకముందే ప్రభుత్వం ఈ పథకానికి సవరణలు తీసుకురావడం చూస్తుంటే మోదీ సర్కారు అనాలోచితంగా ఈ పథకాన్ని యువతపై విధించడానికి ప్రయత్నిస్తోందన్న సంగతి స్పష్టమవుతోందని ఆమె విమర్శించారు. ఈ మేరకు ఆమె ట్వీట్ చేశారు. సైనిక దళాల నియామకాలకు కేంద్రం తీసుకొచ్చిన కొత్త విధానానికి వ్యతిరేకంగా దేశంలో నిరసనలు మిన్నంటిన నేపథ్యంలో అగ్నిపథ్ పథకం కింద మొదటి విడత సైనికుల నియామకానికి గరిష్ఠ వయోపరిమితిని 21 నుంచి 23 ఏళ్లకు ప్రభుత్వం గురువారం పెంచింది. 'నరేంద్ర మోదీ జీ, ఈ పథకాన్ని వెంటనే ఉపసంహరించుకోండి.. ఎయిర్‌ఫోర్స్‌లో నిలిచిపోయిన రిక్రూట్‌మెంట్ ఫలితాలను బయట పెట్టండి.. నియామకాలు చేయండి' అని ప్రియాంక గాంధీ డిమాండ్ చేశారు.

పోలీసులు మమ్మల్ని నిర్బంధించారు

యువజన కాంగ్రెస్ నేతల ఆగ్రహం

న్యూఢిల్లీ : అగ్నిపథ్ పథకానికి వ్యతిరేకంగా నిరసనలు పెరగడంతో పోలీసులు ఎటువంటి కారణాలు లేకుండానే తమ పార్టీ ప్రధాన కార్యాలయం ప్రధాన ద్వారం వద్ద తమను అడ్డుకున్నారని, అనేక మంది నాయకులను అరెస్టు చేశారని ఇండియన్ యువజన కాంగ్రెస్ (ఐవైసీ) నేతలు శుక్రవారం ఆరోపించారు. అయితే నిరసన ప్రదర్శన చేపట్టేందుకు ఇండియన్ యువజన కాంగ్రెస్‌కి ఎటువంటి అనుమతి లేనందునే తగిన భద్రతా ఏర్పాట్లు చేశామని పోలీసులు తెలిపారు. దీనిపై కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం నాయకులు మాట్లాడుతూ పోలీసులు ఎటువంటి కారణం లేకుండానే పార్టీ కార్యాలయం ప్రధాన ద్వారం వద్ద బారికేడ్‌లు పెట్టారని, ఐవైసీ సభ్యులు అనేక మందిని అరెస్టు చేశారని ధ్వజమెత్తారు. 'రైసినా రోడ్‌లోని మా కార్యాలయం ప్రాంతమంతా బారికేడ్‌లు పెట్టేశారు. మమ్మల్ని బయటకు వచ్చేందుకు అనుమతించలేదు. కార్యాలయంలోకి ప్రవేశించేందుకు ప్రయత్నించిన మా సభ్యులు కొంతమందిని అడ్డుకుని, అరెస్టు చేశారని ఆరోపించారు. ఐవైసీ జాతీయ మీడియా ఇన్‌ఛార్జి రాహుల్ రావ్ మాట్లాడుతూ ఎటువంటి కారణం లేకుండానే బారికేడ్‌లు ఏర్పాటు చేశారు. పోలీసు ఉన్నతాధికారి ఒకరు మాట్లాడుతూ అగ్నిపథ్‌కి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా నిరసనలు చెలరేగిన నేపథ్యంలో తాము ఎక్కడా అవకాశాన్ని తీసుకోబోమని, ప్రదర్శన నిర్వహించేందుకు ఐవైసీకి అనుమతి ఏదీ లేదని, ఈ ప్రాంతంలో పెద్ద సంఖ్యలో ప్రజలు గుమికూడకుండా ఉండేందుకు ఇప్పటికే సీఆర్‌పీసీ సెక్షన్ 144 విధించినట్లు చెప్పారు. కాగా బీజేపీ ప్రభుత్వం అనధికార అత్యవసర పరిస్థితిని విధించిందని, వారు ప్రజల గొంతులను నొక్కుతున్నారని ఐవైసీకి చెందిన రాహుల్ రావ్ ఆరోపించారు.

'నిన్న కూడా అగ్నిపథ్ పథకానికి వ్యతిరేకంగా నిరసనలు ర్యాలీలు చేశాం. అప్పుడు కూడా మమ్మల్ని అడ్డుకున్నారు. ఇప్పుడు మా కార్యాలయం మొత్తాన్ని బారికేడ్‌లతో నింపేశారు' అని అన్నారు. శాంతియుతంగా కార్యాలయాలకు వెళ్లే సిబ్బందిని, ఇతర కార్మికులను బలవంతంగా అరెస్టులు చేస్తున్నారని, పోలీసులు గూండాయిజం ప్రదర్శిస్తున్నారని ఆమె ధ్వజమెత్తారు.

ఎన్‌సీఆర్‌టీ ట్వెల్త్ సిలబస్ నుంచి గుజరాత్ 2002 అలర్లు తొలగింపు

న్యూఢిల్లీ: జాతీయ విద్య పరిశోధనా, శిక్షణా మండలి (ఎన్‌సీఈఆర్‌టీ) 12వ తరగతి పాఠ్యాంశాల్లో కోతలు జరిగాయి. పొలిటికల్ సైన్స్‌లో నుంచి గుజరాత్ 2002 అలర్ల నేపథ్య అధ్యాయాన్ని తొలగించారు. కోవిడ్ మహమ్మారి దృష్ట్యా విద్యార్థులపై భారాన్ని తగ్గించే క్రమంలో 'టెక్స్ట్‌బుక్ రేషనలైజేషన్' (పాఠపుస్తకాల హేతుబద్ధీకరణ) పేరిట ఈ చర్యలు కొనసాగుతున్నాయి. సిలబస్‌లో గుజరాత్ అలర్ల గురించి ఉన్న 187-189 పేజీలూ తీసేసినట్లు గురువారం ఎన్‌సీఈఆర్‌టీ ప్రకటించింది. నక్సలైట్ ఉద్యమం (పేజి 105), ఎమర్జెన్సీపై వివాదాల (113-117 పేజీలు)ను సవరించిన పాఠ్యపుస్తకాల్లో తొలగించారు. ఈ తొలగింపులు హేతుబద్ధీకరణ ప్రక్రియలో భాగమని ఎన్‌సీఈఆర్‌టీ సమర్థించుకుంది. ప్రస్తుత పరిస్థితులకు ఆయా అంశాలను అక్కర్లేదని, కోవిడ్ నేపథ్యంలో విద్యార్థులపై సిలబస్ భారాన్ని తగ్గించే ఉద్దేశంతోనే కొన్ని పాఠ్యాంశాలను తగ్గించామని తెలిపింది. జాతీయ విద్య విధానం 2020 కూడా ఇదే చెబుతున్న నేపథ్యంలోనే ఎన్‌సీఈఆర్‌టీ తాజా చర్యలకు ఉపకరించిందని అధికారిక ప్రకటన పేర్కొంది. కాగా, 58 మంది కరసేవక్‌లు గోద్రా రైలు దుర్ఘటనలో చనిపోయిన కారణంగా 2002లో గుజరాత్ అలర్లు జరిగాయి. కొన్ని నెలల పాటు సాగిన హింసాకాండలో వెయ్యి మందికిపైగా ముస్లింలు ఊచకోతకు గురికాగా 200 మంది గల్లంతయ్యారు. మరో 2,500 మంది గాయపడ్డారు. అప్పట్లో ఆ రాష్ట్ర ముఖ్యమంత్రిగా నరేంద్రమోదీ ఉన్నారు. నాటి ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి.. మోదీని ఉద్దేశించి 'ముఖ్యమంత్రి ఎప్పుడు రాజధర్మానికి కట్టుబడి ఉండాలి. పాలకుడు ఎప్పుడు కూడా కులం, మతం, జాతి ఆధారంగా తన ప్రజల విషయంలో వివక్ష చూపరాదు' అని గుజరాత్ అల్లర్ల నేపథ్యంలో అన్నారు.

అశోక్ గెహ్లాత్ సోదరుడి నివాసంలో సీబీఐ సోదాలు

ప్రతీకార రాజకీయమేనన్న కాంగ్రెస్



న్యూఢిల్లీ: రాజస్థాన్ ముఖ్యమంత్రి అశోక్‌గెహ్లాత్ సోదరుడు అగ్రసేన్ గెహ్లాత్ నివాసం, వ్యాపార సముదాయాలతో పాటు రాష్ట్రవ్యాప్తంగా అనేక ప్రాంతాల్లో కేంద్ర దర్యాప్తు సంస్థ(సీబీఐ) శుక్రవారం సోదాలు నిర్వహించింది. ఓ ఫెర్టిలైజర్ కుంభకోణంపై తాజాగా కేసు నమోదు చేసిన సీబీఐ... ఈ తనిఖీలు నిర్వహించినట్లు సంబంధిత అధికారులు పేర్కొన్నారు. జోధ్‌పూర్‌లోని అగ్రసేన్ గెహ్లాత్ నివాసానికి శుక్రవారం ఉదయం చేసుకున్న సీబీఐ అధికారులు సోదాలు నిర్వహించారు. అగ్రసేన్ ఫెర్టిలైజర్ వ్యాపారి. రాహుల్‌గాంధీని ఈడీ ప్రశ్నించటాన్ని నిరసిస్తూ దేశవ్యాప్తంగా కాంగ్రెస్ నిరసనలు చేపట్టిన తరుణంలోనే అశోక్ గెహ్లాత్ సోదరుడి ఇంట్లో సీబీఐ సోదాలు నిర్వహించటం ప్రాధాన్యం సంతరించుకుంది. ప్రత్యేకించి అశోక్ ఢిల్లీలో రాహుల్‌కు మద్దతుగా నిరసనల్లో పాల్గొంటున్నారు. యూపీఏ ప్రభుత్వ హయాంలో 2007 నుంచి 2009 వరకు పొటాష్‌ను భారీగా విదేశాలకు తరలించినట్లు అగ్రసేన్‌పై ఆరోపణలు ఉన్నాయి. ఆ ఎరువులు... రైతులకు రాయితీపై ఇచ్చేవని, వాటిని అక్రమ మార్గంలో విదేశాలకు ఎగుమతి చేసినట్లు సీబీఐ అధికారవర్గాలు తెలిపాయి. ఈ కేసుకు సంబంధం ఉన్న వారికి సంబంధించిన గుజరాత్, రాజస్థాన్, బెంగాల్‌లోని మొత్తం 16 ప్రాంతాల్లో ఈ తనిఖీలు నిర్వహించినట్లు అధికారులు తెలిపారు. ఇండియా పొటాష్ లిమిటెడ్‌కు అధికారిక డీలర్‌గా వ్యవహరించిన అగ్రసేన్ గెహ్లాత్ సహా 14మందిపై అవినీతి కేసు నమోదు చేసిన అనంతరం ఈ దాడులు నిర్వహించినట్లు చెప్పారు. 2020లోనూ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అగ్రసేన్ నివాసంలో సోదాలు చేపట్టింది.

అశోక్ గెహ్లాత్ ఆగ్రహం

ఈ పరిణామంపై రాజస్థాన్ సీఎం అశోక్ గెహ్లాత్ ఆగ్రహం వ్యక్తం చేశారు. తాను ఇటీవల సీబీఐ, ఈడీ డైరెక్టర్‌తో పాటు ఆదాయపు పన్ను శాఖ చైర్మన్‌ను కలిసేందుకు సమయం కోరినట్లు చెప్పారు. తాము జూన్ 13న సమయం కోరగా, 15న కేసు నమోదు చేశారన్నారు.

జూన్ 17న దాడులు జరిగాయన్నారు. ఈ విధానం ఏమిటో అర్థకావడం లేదని వాపోయారు. 'నేను ఢిల్లీలో క్రియాశీలకంగా ఉంటే లేదా రాహుల్ కు మద్దతుగా ఉద్యమంలో పాల్గొన్నట్లయితే, మా సోదరుడి ద్వారా ఎందుకు ప్రతీకారం తీర్చుకుంటారు. 2020లో మా ప్రభుత్వంలో రాజకీయ సంక్షోభం ఏర్పడినప్పుడు, ఆ సమయంలో కూడా ఈడీ నా సోదరుడి ఇంటిపై దాడి చేసింది' అని విలేకరులతో అన్నారు. అగ్రసేన్ గెహ్లాత్ నివాసంలో సీబీఐ సోదాలు నిర్వహించటాన్ని కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా నిరసించింది. ఈ చర్యను బీజేపీ ప్రతీకార రాజకీయంగా అభివర్ణించింది. అలాంటి చర్యలతో తమ గొంతును నొక్కలేరని కాంగ్రెస్ అధికార ప్రతినిధి జైరాం రమేశ్ అన్నారు. మూడు రోజులుగా ఢిల్లీలో జరిగిన ఆందోళనల్లో అశోక్‌గెహ్లాత్ ముందు వరుసలో ఉన్నారని, దానికి మోదీ ప్రభుత్వం ఈ విధంగా స్పందించిందని ఆరోపించారు.

ఢిల్లీలో భారీవర్షం

న్యూఢిల్లీ: ఢిల్లీలోని అనేక ప్రాంతాల్లో శుక్రవారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. దీంతో రాజధాని వాసులకు తీవ్ర ఎండ వేడి నుంచి కొంత ఉపశమనం లభించింది. రాజధానిలోని అనేక ప్రాంతాల్లో ఉరుములతో కూడిన వర్షం పడే అవకాశం ఉందని వాతావరణశాఖ అధికారులు తెలిపారు. దీంతో ఢిల్లీలో 22.8 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైనట్లు వివరించారు. గడచిన 24 గంటల్లో ఢిల్లీలో 7 మిల్లీమీటర్ల వర్షం పాతం నమోదైనట్లు పేర్కొన్నారు.

ఈడీ చర్య నిరసిస్తూ కాంగ్రెస్ కార్యకర్తల ధర్నా

నాగపూర్: కాంగ్రెస్ పార్టీ నాయకుడు రాహుల్ గాంధీని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ప్రశ్నించడాన్ని నిరసిస్తూ మహారాష్ట్రలోని నాగపూర్‌లో స్థానిక కాంగ్రెస్ నాయకులు పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. వారంతా పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్రం తన నిర్ణయాన్ని ఉపసంహరించుకోకపోతే ఇకపై కూడా ధర్నాలు చేస్తామని హెచ్చరించారు.

జైపూర్ జిల్లాలోని కలెక్టరేట్ వద్ద జరిగిన నిరసనలో స్థానిక నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని నినాదాలు చేశారు. మాజీ డిప్యూటీ ముఖ్యమంత్రి సచిన్ పైలెట్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ నిరంకుశ ధోరణిని నిరసిస్తూ రాష్ట్రంలోని అన్ని కలెక్టరేట్ వద్ద నిరసనలు తెలుపుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. రాహుల్‌ను ఈడీ ప్రశ్నించడం వెనుక కేంద్రం దురుద్దేశం అర్థమైందని, దీన్ని కార్యకర్తలంతా వ్యతిరేకించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ ఎమ్మెల్యేలు, రాష్ట్రమంత్రులు ప్రతాప్‌సింగ్ కచారియావాజ్, మహేశ్ జోషి, లాల్‌చంద్ ఖటారియా పాల్గొన్నారు.

ద్రవ్యోల్బణం కట్టడికి సరైన సమయంలోనే స్పందించాం

ఆర్బీఐ గవర్నర్ శక్తికాంతదాస్



ముంబై: దేశంలో ద్రవ్యోల్బణాన్ని అదుపు చేయడంలో సరైన సమయంలోనే స్పందించామని ఆర్బీఐ గవర్నర్ శక్తికాంతదాస్ పేర్కొన్నారు. ఈ విషయంలో ఏమాత్రం తొందరపడినా ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం పడేదని చెప్పుకొచ్చారు. ఫైనాన్షియల్ ఎక్స్‌ప్రెస్ నిర్వహించిన మోడరన్ బీఎఫ్ఎస్ఐ సదస్సు-సమ్మిట్ 2022లో ఆయన మాట్లాడారు. ఆర్థిక పరిస్థితులకు తగ్గట్టుగా ఆర్బీఐ ఎప్పటికప్పుడు నిర్ణయాలు తీసుకుంటునే వుందన్నారు. వృద్ధి అవకాశాలపై ప్రతికూల ప్రభావం పడకుండా ద్రవ్యోల్బణం కట్టడికి ఆర్బీఐ చర్యలు తీసుకుందని చెప్పారు. అంతర్జాతీయ విపణిలో బ్యారెల్ ముడి చమురు ధర 80 డాలర్లుగా లెక్కలోకి తీసుకునే ఫిబ్రవరిలో ద్రవ్యోల్బణాన్ని 4.5 శాతంగా అంచనా వేసినట్లు చెప్పారు. ఉక్రెయిన్‌పై రష్యా దాడి తర్వాత పరిస్థితులు పూర్తిగా మారిపోయాయన్నారు. మరోవైపు ఆర్థిక రంగంలో పెద్ద టెక్నాలజీ కంపెనీలు ప్రవేశించడం వల్ల ఇబ్బందికర పరిస్థితులు తలెత్తుతున్నాయని, వాటిని సమర్థంగా ఎదుర్కోవాల్సి ఉందన్నారు. ఆయా సంస్థలు తమ సొంతంగా లేదా భాగస్వామ్యాల ద్వారా ఆర్థిక సేవల్ని అందిస్తున్నాయని, దీనివల్ల పరపతి అంచనాకు కొత్త విధానాలను అనుసరించాల్సి వస్తోందన్నారు. ఇక రుణాల రికవరీకి కఠిన పద్ధతుల్ని అవలంబించడాన్ని దాస్ తప్పు బట్టారు. ఇష్టం వచ్చినసమయంలో కాల్ చేసి, అభ్యంతరకర భాషను ఉపయోగించడం ఆమోదయోగ్యం కాదన్నారు. వీటిని అరికట్టడంపై ఆర్బీఐ దృష్టి సారించినట్లు తెలిపారు.

ఫలితాలివ్వని 'స్వదేశ్'

లోకా కేరళ సభలో పినరయి విజయన్

తిరువనంతపురం: దేశానికి తిరిగి వస్తున్న ప్రవాసీలకు మద్దతిచ్చేందుకుగాను 'స్వదేశ్ స్కిల్ కార్డ్' పథకాన్ని కేంద్రప్రభుత్వం తీసుకువచ్చింది. రెండేళ్ల తర్వాత కూడా ఈ పథకం ఎలాంటి ఫలితాలను ఇవ్వలేకపోయిందని కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ విమర్శించారు. కోవిడ్ కారణంగా విదేశాల్లో ఉద్యోగాలు కోల్పోయి రాష్ట్రానికి తిరిగి వచ్చిన వారి సంక్షేమార్థం రూ.2వేల కోట్ల ప్యాకేజిని మంజూరు చేయాలని కేరళ ప్రభుత్వం కోరితే కేంద్రం పట్టించుకోవడం లేదని, కనీసం స్పందించలేదని విజయన్ అన్నారు. తిరిగొచ్చే ప్రవాసీల కోసం కేంద్రం ప్రకటించిన ఏకైక కార్యక్రమం స్వదేశ్ (స్కిల్డ్ వర్కర్స్ అరైవల్ డేటా బేస్ ఫర్ ఎంప్లాయిమెంట్ సపోర్టు) అని, ఇది పూర్తిగా విఫలమైందని సీఎం వ్యాఖ్యానించారు. తమ ప్రభుత్వం ఎల్లప్పుడు ప్రవాసీలకు ప్రాధాన్యత ఇస్తూనే వచ్చిందని, వారిని రాష్ట్రంలో భాగంగానే చూసిందని అన్నారు. మూడవ లోకా కేరళ సభలో చేసిన ప్రసంగంలో ఈ అంశాలను విజయన్ ప్రస్తావించారు. రెండ్రరోజుల ఈ సభను గవర్నర్ ఆరీఫ్ మహమ్మద్ ఖాన్ గురువారం ప్రారంభించారు. కాగా, విజయన్ అనారోగ్యంతో ఉండటంతో విశ్రాంతి అవసరమని వైద్యులు సూచించిన క్రమంలో సీఎం ప్రసంగాన్ని ఆయన తరపున పరిశ్రమల మంత్రి పి.రాజీవ్ చదివి వినిపించారు. సభకు 65 దేశాల నుంచి 180 మందితో పాటు 351 మంది ప్రతినిధులు హాజరయ్యారు. ఈ కార్యక్రమాన్ని బహిష్కరిస్తున్నట్లు కాంగ్రెస్ నేతృత్వ యూడీఎఫ్ ప్రకటించింది.

ఈశాన్యాన్ని ముంచెత్తుతున్న వానలు

గువహతి: వరుసగా నాలుగోరోజు ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తుండటంతో ఈశాన్య ప్రాంతంలో వరద పరిస్థితి భయంకరంగా ఉందని, ప్రధాన నదులు ఉప్పొంగుతున్నాయని అధికారులు శుక్రవారం తెలిపారు. అసోం స్టేట్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అథారిటీ ప్రకారం, రాష్ట్రంలోని 25 జిల్లాల్లో వర్షాలు, వరదల కారణంగా 11 లక్షల మందికి పైగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మేఘాలయ, అరుణాచల్ ప్రదేశ్‌లలో కొండచరియలు విరిగిపడటంతో రోడ్లు దెబ్బతిన్నాయి. చాలా గ్రామాలు ముంపునకు గురవుతున్నాయి. మేఘాలయలోని తూర్పు ఖాసీ హిల్స్‌లోని సోహ్రా (పూర్వపు చిరపుంజి)లో గడచిన 24 గంటల్లో 972 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. 1995 తర్వాత జూన్‌లో ఇదే అత్యధికమని భారత వాతావరణ శాఖ తెలిపింది. అసోంలోని సోనిత్‌పూర్ జిల్లాలో ఒక వ్యక్తితో పాటు మరో ముగ్గురు ప్రయాణిస్తున్న పడవ జియా భోరోలి నదిలో బోల్తా పడింది. ముగ్గురిని రక్షించామని, నాలుగో వ్యక్తి జాడ తెలియలేదని జిల్లా అధికారి తెలిపారు. గువహతిలోని పలు ప్రాంతాలు, డిమా-హసావో, గోల్‌పరా, హోజాయ్, కమ్రూప్‌లోని కొన్ని ప్రాంతాల్లో తాజాగా కొండచరియలు విరిగిపడ్డాయి. ఈ సంవత్సరం అసోంలో వరదలు, కొండచరియలు విరిగిపడటంతో మృతి చెందిన వారి సంఖ్య గురువారానికి 46కు చేరింది. ఇల్లు కూలిపోవడంతో ఇద్దరు పిల్లలు సజీవ సమాధి అయ్యారు. కేంద్ర షిప్పింగ్, ఓడరేవులు, జలమార్గాలు, ఆయుష్ శాఖ మంత్రి సర్బానంద సోనోవాల్, ముఖ్యమంత్రి హిమంత బిస్వా శర్మకు ఫోన్ చేసి, రాష్ట్రంలో పరిస్థితిపై వాకబు చేసినట్టు అధికారి ఒకరు తెలిపారు. ప్రస్తుత పరిస్థితిని, బాధిత ప్రాంతాల్లోని ప్రజలను ఆదుకునేందుకు వివిధ శాఖలు రాత్రింబవళ్లు ఎలా పని చేస్తున్నాయని సీఎం కేంద్ర మంత్రికి వివరించారు. అసోంలో నిమతిఘాట్, ధుబ్రి వద్ద బ్రహ్మపుత్ర, నాగాన్ వద్ద కోపిలి, కమ్రూప్ వద్ద పుతిమరి, నల్బరి వద్ద పగలడియా, బర్పేట వద్ద మానస్, బెకి వంటి అనేక నదులు ప్రమాదకర స్థాయికి మించి ప్రవహిస్తున్నాయని కేంద్ర జల కమిషన్ విడుదల చేసిన బులెటిన్‌లో తెలిపింది. బొంగైగావ్, డిబ్రూగర్, గోల్‌పరా, కమ్రూప్, కోక్రాఝర్, మోరిగావ్, నల్బరీ, సోనిత్‌పూర్ మరియు దక్షిణ సల్మారా వంటి జిల్లాల్లో భారీ స్థాయిలో రోడ్డు కోతకు గురయ్యాయి. ప్రస్తుత వరదల కారణంగా 68వేలమంది ప్రజలు 150 సహాయ శిబిరాల్లో తలదాచుకున్నారు. ప్రభుత్వ ఆహారం, మందుల పంపిణీ కోసం వివిధ ప్రాంతాల్లో 46 సహాయ కేంద్రాలు ప్రారంభించింది. ఇప్పటివరకు, 5,840 మందిని సురక్షితంగా తరలించినట్లు అసోం స్టేట్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అధికారులు తెలిపారు. ఇదిలావుండగా, దిగువ అసోంలోని రంగియా డివిజన్‌లోని నల్బారి, ఘోగ్రాపర్ మధ్య రైల్వే ట్రాక్‌లపై నీరు నిలిచిపోవడంతో అనేక రైళ్లను దారి మళ్లించాయి. గురువారం రద్దు చేయబడిన ప్రముఖ రైళ్లలో న్యూ బొంగైగావ్-గౌహతి ప్యాసింజర్ రైలు, అలీపుర్‌దువార్-గౌహతి సిఫంగ్ ఎక్స్‌ప్రెస్ రైలు ఉన్నాయని రైల్వే ప్రతినిధి తెలిపారు. న్యూ ఢిల్లీ-దిబ్రూగఢ్ రాజధాని ఎక్స్‌ప్రెస్, కామాఖ్య-ఢిల్లీ బ్రహ్మపుత్ర మెయిల్, కామాఖ్య-లోకమాన్య తిలక్ ఏసీ ఎక్స్‌ప్రెస్, సీల్దా-అగర్తలా కాంచన్‌జంగా ఎక్స్‌ప్రెస్ వంటి రైళ్లను ప్రత్యామ్నాయ మార్గంలో మళ్లించారు.

12వేలు దాటిన కొత్త కేసులు

న్యూఢిల్లీ: దేశంలో కరోనా వ్యాప్తి పెరుగుతోంది. వరుసగా రెండో రోజు 12 వేలకు పైగా కొత్త కేసులు నమోదయ్యాయి. గడిచిన 24 గంటల్లో 12,847 మందికి పాజిటివ్‌గా నిర్ధారణ అయ్యిందని కేంద్ర ఆరోగ్య శాఖ తెలిపింది. కరోనా పాజిటివిటీ రేటు 2 శాతంపైనే కొనసాగుతోంది. మహారాష్ట్రలో 4,255 కేసులు, కేరళలో 3,419, ఢిల్లీలో 1,323, కర్ణాటకలో 833 కేసులు వచ్చాయి. తమిళనాడు, హర్యానా, ఉత్తర్‌ప్రదేశ్ సహా పలు రాష్ట్రాల్లో కేసులు పెరుగుతున్నాయని ఆరోగ్య శాఖ వెల్లడించింది. ఈనెల 7న 1.92 శాతంగా ఉన్న పాజిటివిటీ రేటు 15 తేదీ నాటికి 7.01 శాతానికి ఎగబాకింది. దేశవ్యాప్తంగా ఇప్పటి వరకూ 4.32 కోట్ల మందికి పైగా కరోనా బారినపడ్డారు. యాక్టివ్ కేసులు రోజురోజుకూ గణనీయంగా పెరుగుతుండటం ఆందోళన కలిగిస్తోంది. ప్రస్తుతం యాక్టివ్ కేసుల సంఖ్య 63,063కి చేరింది. మొత్తం కేసుల్లో బాధితుల వాటా 0.15 శాతానికి పెరిగింది. 7,985 మంది కోలుకోగా.. రికవరీ రేటు 98.64 శాతానికి క్షీణించింది. గడచిన 24 గంటల్లో కరోనాతో 14 మంది మరణించారు.

వ్యవసాయం భారం..

హెలికాప్టర్ కొనుగోలుకు రుణమివ్వండి

బ్యాంకు అధికారులను కోరిన మహారాష్ట్ర యువరైతు

ఔరంగాబాద్: రానురాను వ్యవసాయం మరింత భారమవుతోందని, దీంతో తాను హెలికాప్టర్ కొనుగోలు చేద్దామనుకుంటున్నానని, ఇందుకోసం అధికారులు రుణం ఇప్పించాలంటూ మహారాష్ట్రలోని హింగోలీ ప్రాంతానికి చెందిన 22 ఏళ్ల ఓ యువరైతు బ్యాంకు అధికారులను కోరారు. తనకు 6 కోట్లు రుణం ఇవ్వాలని విజ్ఞప్తి చేశాడు. హింగోలి జిల్లాలోని తక్‌తోడా గ్రామానికి చెందిన కైలాస్ పతంగీ గురువారం దరఖాస్తు తీసుకుని బ్యాంకు అధికారులను సంప్రదించాడు.

పతంగికి తన గ్రామంలో రెండు ఎకరాల పొలముంది. సమయానికి వర్షాలు రాకపోవడం, కరువులాంటి పరిస్థితులు కారణంగా వ్యవసాయం భారంగా మారిందని తెలిపా పతంగి తెలిపాడు.

'గడచిన రెండేళ్లలో నా పొలంలో సోయాబీన్ పండించాను. వర్షాభావం కారణంగా అనుకున్నంతగా దిగుబడి రాలేదు. అయితే ప్రభుత్వం పంట బీమా ఇచ్చినా అది సరిపోలేదు' తెలిపాడు. దీంతో తాను ఒక హెలికాప్టర్ కొనుక్కొని అద్దెకు తిప్పుకుంటే సుఖంగా బతకవచ్చుననే ఆలోచన వచ్చిందని పేర్కొన్నారు. 'ధనికులకే పెద్ద కలలు వస్తాయని ఎవరు చెప్పారు? రైతులు కూడా పెద్ద కలలు కంటారు. హెలికాప్టర్ కొనుగోలుకు నేను రూ.6.65కోట్ల రుణం కోసం దరఖాస్తు చేశా. ఇతర వ్యాపారాల్లో పోటీ విపరీతంగా ఉంది. అందుకే నేను దీనిని ఎంచుకున్నా' అని పతంగి తెలిపాడు.

మాట్లాడుతున్న నారాయణ. పక్కన రామానాయుడు, మురళి, పెంచలయ్య, విశ్వనాథ్

ఆగ్రహజ్వాలకు బాధ్యుడు మోదీ

సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ

విశాలాంధ్ర బ్యూరో-తిరుపతి: దేశంలో అగ్నిపథ్‌పై నిరుద్యోగుల ఆగ్రహ జ్వాలలు, విధ్వంసాలకు ప్రధాని నరేంద్ర మోదీనే బాధ్యత వహించాలని సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కే నారాయణ స్పష్టం చేశారు. దేశం అగ్నిగుండం అవుతుంటే, నీరో చక్రవర్తిలా మోదీ వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. తిరుపతిలో శుక్రవారం నారాయణ విలేకరులతో మాట్లాడుతూ... ఎన్నికల ముందు రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తానని నమ్మించి మోసం చేసిన మోదీ... మరోవైపు కోటిన్నర ఉద్యోగాలు ఊడగొట్టా రన్నారు. ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు అగ్నిపథ్ పథకాన్ని తీసుకువచ్చి యువతను దగా చేస్తున్నారని పేర్కొన్నారు. చేతగాని నిర్ణయాలతో నిరుద్యోగుల ఉద్యమాన్ని ఎవరో నడిపిస్తున్నారంటూ కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి వ్యాఖ్యానించడం విడ్డూరంగా ఉందన్నారు. ఈ పథకం ప్రకారం నాలుగేళ్ల అనంతరం ఉద్యోగం నుండి తీసివేస్తే వారి భవిష్యత్తు ఏమిటని ప్రశ్నించారు. తమ భవిష్యత్తు కోసం పోరాడి మృతి చెందిన ఆరుగురు కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.కోటి చొప్పున పరిహారం ఇవ్వాలన్నారు. మృతులకు సంతాపం, వారి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. కేంద్ర ప్రభుత్వంపై నిరుద్యోగ యువత చేస్తున్న పోరాటాన్ని నారాయణ అభినందించారు. తక్షణం అగ్నిపథ్ పథకాన్ని రద్దు చేసి, గతంలో మాదిరిగా శాశ్వత ప్రాతిపదికన ఉద్యోగ నియామకాలు చేపట్టాలని కోరారు. ప్రస్తుతం ఉన్న రాష్ట్రపతి వేకువజామున సంతకాలు పెట్టేందుకు ఉపయోగపడ్డారని, ఇదే తరహాలో మరొకరిని ఎంపిక చేసే ప్రక్రియలో బీజేపీ ఉందని విమర్శించారు. వెంకయ్య నాయుడు లాంటి నాయకుడిని రాష్ట్రపతి అభ్యర్థిగా నిలబెట్టేందుకు మోదీ ఎందుకు సాహసించ డం లేదని ప్రశ్నించారు.

రాష్ట్రపతి ఎన్నికల్లో ప్రతి పక్షాల తరఫున అభ్యర్థిని నిలబెట్టేందుకు జాతీయ స్థాయిలో చర్చలు జరుపుతున్నామని తెలిపారు. రాష్ట్రపతి ఎన్నికల సందర్భంగా రాష్ట్రానికి రావాల్సిన ప్రత్యేక హోదా, నిధులు వంటి అంశాలపై కేంద్రాన్ని నిలదీ సేందుకు జగన్‌కు సరైన సమయం వచ్చిందని అన్నారు. కేసీఆర్ జాతీయ పార్టీ పెట్టుకుంటే తప్పులేదని, బీజేపీకి వ్యతిరేకంగా పోరాడుతున్న కూటమితో కలిసి పని చేస్తే మంచిదని హితవు పలికారు.

సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రామా నాయుడు, జిల్లా కార్యదర్శి మురళి, జిల్లా కార్యవర్గ సభ్యుడు చిన్నం పెంచలయ్య, నగర కార్యదర్శి విశ్వనాథ్ విలేకరుల సమావేశంలో పాల్గొన్నారు.

‘అగ్నిపథ్’ను ఉపసంహరించుకోవాలి

ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి అమర్‌జిత్ కౌర్

న్యూఢిల్లీ: దేశ సైన్యంలో నియామకాల కోసం ప్రవేశపెట్టిన ‘అగ్నిపథ్’ పథకాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని ఏఐటీయూసీ డిమాండు చేసింది. ‘అగ్నిపథ్’ ఎవరినీ మోసం చేయలేదని, ముఖ్యంగా కనీసం ఎవరి కోసం ప్రచారం చేయబడుతుందో ఆ యువకులందరినీ మోసం చేయలేదని తెలిపింది. భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) అనుబంధ కార్మిక సంఘం ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి అమర్‌జిత్ కౌర్ శుక్రవారం ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. ‘అగ్నిపథ్’ పథకం అసలు అర్థం తెలియగానే సైనిక ఎంపిక పరీక్షలకు హాజరయిన, స్థిరమైన ఉపాధి కోసం ఎదురు చూస్తున్న వారి నుంచి విస్తృతమైన నిరసన ప్రదర్శనలు ఆకస్మికంగా చెలరేగాయి. మరికొందరు, పదవీ విరమణ చేసిన సైనిక కమాండర్లు, లోపల ఉన్న సైనిక స్థాపన గురించి తెలిసిన వారు ఈ అస్తవ్యస్థ పథకంపై విస్తుపోతున్నారు. ఒకవైపు అగ్నిపథ్ సైనిక స్థాపనను నిర్వీర్యం చేస్తుందని, మరోవైపు అగ్నివీరులను నిరుద్యోగులు, పింఛన్లు లేకుండా వీధిన పడేస్తే సమాజానికి ప్రమాదం వాటిల్లుతుందని వారు హెచ్చరించారని అమర్‌జిత్ కౌర్ తెలిపారు. గత ఎనిమిదేళ్లుగా నరేంద్ర మోదీ ప్రభుత్వం తీసుకున్న విధానపరమైన నిర్ణయాల తంతు సామాన్య ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురి చేసింది. అది నోట్ల రద్దు కావచ్చు, ఇప్పటివరకు 1,100 సార్లు సవరించిన జీఎస్‌టీ కావచ్చు, అలాగే ఎలాంటి హెచ్చరికలు లేకుండానే కోట్లాది మంది శ్రమజీవులకు ఆహారం, ఆశ్రయం లేదా ఆదాయం లేకుండా చేసిన క్రూరమైన లాక్‌డౌన్, నాలుగు లేబర్ కోడ్‌లు, మూడు వ్యవసాయ చట్టాలు, సీఏఏ, ఎన్‌ఆర్‌సీ, నూతన విద్యా విధానం, జాతీయ మానిటైజేషన్ పైప్‌లైన్... జాబితా అంతం కాదు. ఫలితంగా ధనిక, పేదల మధ్య నిరంతరంగా పెరుగుతున్న అంతరం, భరించలేని ధరల పెరుగుదల, ఎప్పటికప్పుడు అధిక నిరుద్యోగం, అనుమానితులపై ప్రభుత్వం బుల్డోజర్లను ఉపయోగించి కఠోరమైన చట్టవిరుద్ధ చర్యలను ఆమె ప్రస్తావించారు. అగ్నిపథ్ అనేది తెలియని పరిణామాలతో దేశాన్ని అనిశ్చిత భవిష్యత్తులోకి తీసుకెళ్లే మరో అడుగు. తమ ప్రాణాలను పణంగా పెట్టి మన దేశ సరిహద్దులను రక్షించిన వారికి పెన్షన్, సామాజిక భద్రతను తొలగించడానికి ప్రయత్నించినప్పుడు, బీజేపీ అతి జాతీయవాదులమని పదే పదే చెబుతున్న దానికి ఇది అబద్ధం. 2024 లోక్‌సభ ఎన్నికల్లో గెలుపొందాలనే ఏకైక లక్ష్యంతోనే బీజేపీ ఈ విధానాలకు శ్రీకారం చుట్టింది. మన దేశం, ప్రజల కోసం అగ్నిపథ్ పథకాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని, దానిని బుల్డోజ్ చేయడానికి ప్రయత్నించవద్దని ఏఐటీయూసీ బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వాన్ని కోరింది.

వినాశకరమైన రూపకల్పన: సీఐటీయూ

భారతీయ జనతా పార్టీ ప్రభుత్వం ‘తాజా వినాశకరమైన రూపకల్పన’పై సీఐటీయూ ఆందోళన, దిగ్భ్రాంతిని వ్యక్తం చేసింది. ఇది కూడా ఎటువంటి పెన్షన్ నిబంధనలు లేకుండానే ‘నిర్దిష్ట-కాల ఒప్పందాలపై సాయుధ దళాల సిబ్బందిని నియమించడం’ అని విమర్శించింది.

కలిసి పోరాడదాం: కాంగ్రెస్

న్యూఢిల్లీ: సైన్యంలో నియామకాల కోసం తీసుకు వచ్చిన అగ్నిపథ్ పథకాన్ని 24 గంటల్లో ఉపసంహరించుకోవాలని కేంద్రాన్ని కాంగ్రెస్ శుక్రవారం డిమాండ్ చేసింది. ఈ పథకం దేశ ప్రయోజనాలకు గానీ దేశ భద్రతకుగానీ దేశ యువతకు గానీ పనికిరాదని వ్యాఖ్యానించింది. సాయుధ దళాల్లో నియామకాల అంశమై చర్చించేందుకు పార్లమెంటు ప్రత్యేక సమావేశాన్ని లేదా అఖిలపక్షాన్ని పిలవాలని కాంగ్రెస్ డిమాండ్ చేసింది. ఈ అంశంపై ద్వైపాక్షిక ఏకాభిప్రాయం కోసం కృషి చేయాలని సూచించింది. మిత్రుల మాటలు తప్ప ప్రజాఘోష వినిపించదా అంటూ ప్రధాని మోదీని కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీనిల దీశారు. హక్కుల కోసం పోరాటంలో యువతకు అండగా కాంగ్రెస్ ఉంటుందని ఆపార్టీ ఎంపీ దీపిందర్ సింగ్ హుడా అన్నారు. నియామ కాల్లో జాప్యం కారణంగా వయో పరిమితిని మూడేళ్లు సడలించి ఉద్యోగం కోసం నిరీక్షిం చిన యువతకు అవకాశం ఇవ్వాలని కోరారు. సంయమనం పాటించాలని, హింసకు పాల్పడవద్దని నిరసనకారులను కోరారు. దేశ యువతకు ప్రభుత్వం క్షమాపణ చెప్పాల న్నారు. రైతాంగ ఉద్యమం నేపథ్యంలో 700 మందికిపైగా అన్నదాతలు ప్రాణాలు కోల్పోవడాన్ని, ఆర్మీలో చేరాలని ఆశపడి ఆత్మహత్య చేసు కున్న హరియాణా యువకుడి గురించీ ప్రస్తా వించారు. చేసిన తప్పునే మళ్లీ చేయొద్దు. ఆత్మహత్యలకు కారణం కావద్దు అని ప్రభు త్వాన్ని ఉద్దేశించి అన్నారు. రక్షణ దళాల్లో ఉద్యోగాల ఆశావాహులు హక్కుల కోసం చేసే పోరాటానికి, డిమాండ్లకు కాంగ్రెస్ అండగా ఉంటుందని హుడా ప్రకటించారు.

అగ్నిపథ్‌పై తక్షణ సమీక్ష అవశ్యం: జేడీయూ

పాట్నా: సాయుధ దళాల్లో కొత్త నియామకాల విధానం దేశవ్యాప్తంగా నిరసనలకు దారితీసిన క్రమంలో తక్ష ణమే దీనిపై సమీక్ష జరపాలని మోదీ ప్రభుత్వానికి జేడీ(యూ) శుక్రవారం డిమాండు చేసింది. పార్టీ జాతీయ అధ్యక్షుడు రాజీవ్ రంజన్ సింగ్ అలియాస్ లల్లన్ ఓ వీడియో సందేశాన్ని విడుదల చేశారు. ‘అగ్ని పథ్ ప్రకటన నేపథ్యంలో బీహార్‌తో పాటు దేశంలోని అనేక చోట్ల యువత ఆందోళనలకు దిగారు. కేంద్రం వెంటనే దీనిపై సమీక్ష జరపాలి. అది సాధ్యం కాకపోతే తమ భవిష్యత్‌కు ఢోకా ఉండదని యువతకు భరోసా ఇవ్వాలి’ అని లల్లన్ వెల్లడిం చారు. ఈయన సామాజిక మాధ్యమాల ద్వారా ఇదే డిమాండు చేశారు. దేశంలో జరుగుతున్నవి మెరుపు ఆందోళనలను అని ఎవరి ప్రోద్బలంతో జరిగేవి కాదని ఆ మేరకు బీజేపీ చేసే ఆరోపణలను జేడీయూ పార్ల మెంటరీ బోర్డు అధ్యక్షుడు ఉపేంద్ర కుశ్వాహా తోసిపుచ్చారు.

అగ్నివీరుల నియామకాలకు రంగం సిద్ధం

- రెండ్రోజుల్లో ఆర్మీలో ప్రక్రియ షురూ: సైన్యాధిపతి మనోజ్ పాండే
- 24 నుంచి వైమానిక దళంలో...: ఎయిర్ చీఫ్ మార్షల్ వీఆర్ చౌదరి

న్యూఢిల్లీ: అగ్నిపథ్ పథకానికి వ్యతిరేకంగా నిరసనలు మిన్నంటున్న వేళ సాయుధ దళాల్లోకి అగ్నివీరుల నియామకాలకు రంగం సిద్ధమైంది. రెండు రోజుల్లో ఈ ప్రక్రియను ప్రారంభించనున్నట్లు సైన్యాధిపతి మనోజ్ పాండే వెల్లడిం చారు. అదే విధంగా ఈనెల 24 నుంచి నియామకాల ప్రక్రియ మొదలవుతుందని చీఫ్ ఆఫ్ ఎయిర్ స్టాఫ్ ఎయిర్ చీఫ్ మార్షల్ వీఆర్ చౌదరి ప్రకటించింది. వయోపరిమితిని 23 ఏళ్లకు పెంచడం ద్వారా అనేక మందికి అవకాశం లభిస్తుందని, దీనిని సద్వినియోగించుకోవాలని ఇద్దరు దళాధిపతులు పిలుపు నిచ్చారు. డిసెంబరు నుంచి అగ్నిపథ్ పథకం కింద కొత్తవారికి శిక్షణ మొదలు కావాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు సైన్యాధికారులు తెలి పారు. వచ్చే ఏడాది జూన్ నాటికి కొత్త పథకం కింద నియమి తులైన వారిని విధుల్లోకి తీసుకోవాలని యోచిస్తున్నట్లు వెల్లడిం చారు. నియామక ప్రక్రియకు సంబంధించిన షెడ్యూల్‌ను త్వర లోనే ప్రకటిస్తామని జనరల్ పాండే అన్నారు. కోవిడ్ మహమ్మరి వల్ల రెండేళ్లుగా నియామకాలు జరగని కారణంగా అగ్నిపథ్ తొలి రిక్రూట్‌మెంట్‌కు గరిష్ఠ వయో పరిమితిని 23 ఏళ్లకు పెంచడం అభినందనీయమని ఎయిర్ చీఫ్ మార్షల్ చౌదరి అన్నారు. కాగా, అగ్నివీరుల నెలసరి జీతం మొదటి సంవత్సరంలో రూ.30వేలుగా ఉంటుంది, చేతికి వచ్చేది రూ.21వేలు కాగా అందులో రూ.9 వేలు కార్పొస్‌కు వెళుతాయి. అంతే మొత్తాన్ని ప్రభుత్వం ఇస్తుంది.

మాట్లాడుతున్న రామకృష్ణ. వేదికపై జేవీఎస్ఎన్ మూర్తి, వెంకటరమణ, విమల, సత్యనారాయణ తదితరులు

మహాసభకు హాజరైన జనసందోహం

దేశం పరువు తీస్తున్న బీజేపీ

- మతాల మధ్య చిచ్చుపెట్టి పబ్బం గడుపుతున్న కేంద్ర ప్రభుత్వం
- కమ్యూనిస్టులే దేశానికి భవిష్యత్తు
- సీపీఐ అనకాపల్లి జిల్లా మహాసభలో రామకృష్ణ

విశాలాంధ్ర-అనకాపల్లి: కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం దేశంలో మతాల మధ్య మంటలు రేపుతోందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ఆగ్రహం వ్యక్తం చేశారు. మతాల మధ్య చిచ్చుపెట్టి దేశం పరువు తీసి మతోన్మాదంతో ప్రజలపై విషం చిమ్ముతోంద న్నారు. సీపీఐ అనకాపల్లి జిల్లా ప్రథమ మహాసభ సందర్భంగా శు క్రవారం నెహ్రూచౌక్ లోని కోడుగంటి గోవిందరావు విగ్రహం వద్ద జరిగిన బహిరంగ సభలో రామకృష్ణ మాట్లాడుతూ, సికింద్రా బాద్ రైల్వేస్టేషన్‌లో ఉద్యోగార్థులపై లాఠీచార్జీ చేయించి అది రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యం అని చెప్పడం బీజేపీ నాయకుల సిగ్గులేనితనానికి నిదర్శమని అన్నారు. 2014 ఎన్నికల ముందు ఏడాదికి 2 కోట్లు ఉద్యోగాలు ఇస్తామని, రైతుల సమస్యలు పరిష్కారిస్తామని, అందరి బ్యాంకు ఖాతాలలో 15లక్షలు నగదు జమ చేస్తామని తదితర హామీలతో అధికారంలోకి వచ్చిన నరేంద్రమోదీ వాటిని అమలు పరచలేదన్నారు. వైసీపీ ప్రభుత్వం మూడేళ్ల పాలనలో అభివృద్ధి శూన్యమని అన్నారు. రాష్ట్రంలో సామాజిక న్యాయం ముసుగులో అరాచాక పాలన సాగుతోందని రామకృష్ణ విమర్శించారు. సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీసత్యనారాయణమూర్తి మాట్లాడుతూ.అనకాపల్లి జిల్లాలో రసాయానిక పరిశ్ర మలు ఎక్కువగా ఉన్నాయని ఎక్కువగా ప్రమాదాలు జరుగుతూ, మరణాలు సంభవిస్తున్నప్పటికి ప్రభుత్వాలు, పరిశ్రమలు పట్టించుకొవడంలేదన్నారు. అచ్యుతాపురం బ్రాండెక్స్‌లో జరిగిన విషవాయపు లికేజీ విషయంలో ఇప్పటికి నిజనిజాలు బయటపెట్టకపోవడం, కమిటి పేరుతో తాత్సరం చేయడంపై అనుమానం ఉందన్నారు. కమ్యూనిస్టులే లేకపోతే దేశానికి భవిష్యత్ ఉండదని అన్నారు. అంతకుముందు రింగురోడ్డు జంక్షన్ నుంచి భారీ ప్రదర్శనతో వేలాదిమంది కమ్యునిస్టు పార్టీ కార్య కర్తలు ఎర్రజెండాలు చేతభూని నెహ్రూచౌక్‌కు చేరుకు న్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ అధ్యక్షతన జరిగిన సభలో మహిళ సమాఖ్య రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షురాలు ఎ.విమల, సీపీఐ అల్లూరి సీతారామరాజు జిల్లా కార్యదర్శి పి.సత్యనారాయణ, జిల్లా కార్యవర్గ సభ్యులు రాజాన దొరబాబు, డీసీహెచ్. క్రాంతి, అనకాపల్లి పట్టణ కార్యదర్శి వైఎన్ భద్రం, మునగపాక మండల కార్యదర్శి మళ్ల మాధవరావు, అనకాపల్లి మండల కార్యదర్శి చెల్లూరి నాగరాజు, అధిక సంఖ్యలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

21మంది అధికారులపై ఏకకాలంలో ఏసీబీ సోదాలు

బెంగళూరు: ఏసీబీ అధికారులు కర్ణాటకలో పెద్ద ఎత్తున సోదాలు నిర్వహించారు. ఏకకాలంలో 21 మంది ప్రభుత్వ అధికారులపై దాడులు చేశారు. ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉన్నారన్న ఆరోపణలు రావడంతో తనిఖీలు నిర్వహిం చారు. ఏకకాలంలో 80 ప్రాంతాల్లో ఏసీబీ సోదాలు చేసింది. ఈ తనిఖీల్లో 300 మంది ఏసీబీ అధికారులు పాల్గొన్నారు.

ఇంకా ఆసుపత్రిలోనే సోనియా

న్యూఢిల్లీ: కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీ ఆరోగ్య పరిస్థితిపై ఆ పార్టీ శు క్రవారం తాజా సమాచారం విడుదల చేసింది. సోనియాగాంధీ శ్వాసకోశ సంబంధ అనారోగ్యం, కోవిడ్ అనం తర ఆరోగ్య సమస్యలకు చికిత్స పొందుతున్నారని పేర్కొంది. కరోనా వైరస్ సోకడం, ముక్కు నుంచి రక్త స్రావం కావడంతో జూన్ 12న సోనియా గాంధీ ఢిల్లీలోని గంగారాం ఆస్పత్రిలో చేరారు. సోనియాకు ఆస్ప త్రిలో వైద్యులు శస్త్రచికిత్స నిర్వహిం చారు. ప్రస్తుతం కరోనా అనంతర సమస్యలతో సోనియా ఇబ్బంది పడుతున్నారు. గురువారం ఉదయం మరో సారి ఆమెకు వైద్యులు పరీక్షలు నిర్వహించారు. సోనియా ప్రస్తుతం వైద్య నిపుణుల పర్యవేక్షణలో ఉన్నారని, చికిత్స కొనసాగుతోందని కాంగ్రెస్ వర్గాలు వెల్లడించాయి. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ లేఖ విడుదల చేశారు. జూన్ 1న సోని యాకు నిర్వహించిన పరీక్షలో కోవిడ్-19 పాజిటివ్‌గా నిర్ధారణ అయింది.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2021-23, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.